Deccan Land




OCT 2026

Deccan

OCT

PRGI Regn. No. TELTEL/2012/46784
₹30
సంపుటి : 15
సంచిక : 2

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

అక్టోబర్ - 2026
DECCAN LAND, HYDERABAD
170
OCTOBER - 2026

UNESCO, India Tentative List (TL) Site - 2014: MEGHALAYAN AGE CAVES: East Khasi Hill, Meghalaya



VOL 15వ వసంతంలో
170 ISSUES నూట డెబ్భైవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్




- సేంద్రియ రత్నం - జెట్
- సింథటిక్ జీవన శాస్త్రం
- ఎడారిలో ఒయాసిస్ దక్కన్ ల్యాండ్
- నాటి మునిగండ్లే నేటి మనిగళ్ళ





## OCTOBER 2026

Naib Subedar Gyan (Quartermaster) and Havildar Satender Bhadoria (Training NCO) of 3 Telangana Battalion NCC selected the 2nd NCC Batch of Oxford Grammar School. Senior cadets also honed their skills through firing practice at the NCC Firing Site.


Oxford Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs FOUNDATIONAL STAGE

45 YEARS OF MERITORIOUS PERFORMANCE


| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |
| | | | | | | |

**Important Dates**

2 Oct - Gandhi Jayanti
19 Oct - Durga Ashtami
20 Oct - Vijayadashami / Dussehra

NOTES :


Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph. +91 90599 50055


**Leaders aren't born, they are made through hard work.**




UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2014

Serial Nomination for

MEGHALAYAN AGE CAVES

East Khasi Hill, Meghalaya Province or Region India.

Category: Natural

## మేఘాలయన్ యుగం గుహలు

ఈశాన్య భారతదేశంలోని మేఘాలయ రాష్ట్రంలో షిల్లాంగ్ పీఠభూమిపై అనేక విశేష గుహలు చెల్లాచెదురుగా ఉన్నాయి. ఈ గుహలు హోలోసీన్ కాలానికి చెందిన ఒక ప్రత్యేకమైన ఆనవాళ్లను కలిగి ఉన్నాయి. అటువంటి గుహలు గారో, ఖాసీ, జైంతియా కొండలలో సున్నపురాయి సమృద్ధిగా ఉన్న ప్రాంతంలో కనీసం 12 దాకా ఉన్నాయి. ఈ గుహల లోపల పైకప్పు నుండి కిందకు వేలాడే సున్నపురాయి నిర్మాణాలు, కింద నేలపై నుండి పైకి పెరిగే స్తంభాలు ఉన్నాయి. ప్రత్యేక, అరుదైన నిర్మాణానికి ప్రసిద్ధి చెందాయి. మేఘాలయ ఇప్పుడు ప్రపంచంలోని అత్యంత సంక్లిష్ట గుహల వ్యవస్థలకు నిలయంగా ప్రసిద్ధి చెందింది.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## మార్పు కోసం దక్కన్‌ల్యాండ్

ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ మూడు ప్రాంతాల్లోని ఎన్నెన్నో సామాజిక సమస్యలు. అలాంటి సమస్యలపై ప్రజల గొంతును ప్రతిధ్వనించేందుకు మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 2012 సెప్టెంబర్‌లో పురుడు పోసుకున్నది 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక. అభివృద్ధికి మార్గదర్శకంగా, ప్రజాభిప్రాయ వేదికగా నిలవాలన్నదే దక్కన్‌ల్యాండ్ సంకల్పమని వేదకుమార్ నాటి సంపాదకీయంలో స్పష్టం చేశారు. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ తెలుగు ప్రాంతాలే కాకుండా, జాతీయ, అంతర్జాతీయ ఏప్రాంతానికి చెందిన సామాజిక, రాజకీయ అంశమైనా ఆయా ప్రాధమ్యాలను దక్కన్‌ల్యాండ్‌లో చోటు కల్పించారు. నేటి సమాజంలో ప్రపంచీకరణ దుష్ఫలితాలు ఒక్కొక్కరంగాన్నే కబళిస్తున్నాయి. అలాంటి అంశాలను చర్చించేందుకు ఒక వేదిక లేకుండా పోయిన తరుణంలో మీడియా కూడా అదే బాట పట్టిన తరుణంలో మిణుగురులా వెలుగు నిచ్చింది దక్కన్‌ల్యాండ్ పత్రిక. విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు రచయితలకు చక్కటి వేదికలా మారింది దక్కన్‌ల్యాండ్ పత్రిక. క్రమం తప్పకుండా ప్రతి మాసం వెలువడుతూ.. 169వ సంచిక (సెప్టెంబర్ 2026) తో 15 వసంతాలు పూర్తి చేసుకున్న దక్కన్‌ల్యాండ్‌కు ప్రత్యేక అభినందనలు. వ్యయప్రయాసాలు కోర్చి పత్రికను నడిపిస్తున్న సంపాదకులు మణికొండ వేదకుమార్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– **ఎస్. పద్మావతి**, మేడ్చల్

❖ ❖ ❖

## 15వ వసంతంలో దక్కన్‌ల్యాండ్

ఐఎస్ఎస్ఎన్ అర్హత కలిగిన దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో గత మాసం (సెప్టెంబర్ 2026) సంపాదకీయం చాలా చక్కగా రాశారు సంపాదకులు మణికొండ వేదకుమార్. ప్రారంభ సంచిక, పది సంవత్సరాల సంచికల సంపాదకీయాలు పునఃప్రచురణ చేయడం చాలా బాగుంది. నాటి అంశాలు మరోసారి నెమరేసుకోవడం జరిగింది. చరిత్ర, హెరిటేజ్, వారసత్వ సంపద, ప్రకృతి, పర్యావరణం, భౌగోళిక శాస్త్రం, ఖనిజాలు, శాసనాలు, వ్యవసాయ రంగ అంశాలు, న్యాయ సంబంధ అంశాలు, సాహిత్యం, చిత్రకళ, ఫొటోగ్రఫీ, నృత్యం, జానపద కళలు వంటి సాంస్కృతిక అంశాలకు విశేష ప్రాధాన్య నిచ్చి ప్రోత్సహించింది దక్కన్‌ల్యాండ్. పరిశోధక విద్యార్థులకు, పోటీపరీక్షలు రాసే అభ్యర్థులకు కరదీపిక దక్కన్‌ల్యాండ్. మేధావులు, వివిధ రంగాల నిష్ణాతులతో దక్కన్‌ల్యాండ్ పది వసంతాలపై వారి అభిప్రాయాలు ప్రచురించడం చాలా బాగుంది. అప్రహతంగా 15 వసంతాలుగా కొనసాగుతున్న దక్కన్‌ల్యాండ్ పత్రికకు, వేదకుమార్‌గారికి అభినందనలు.

– **డి. రాజేష్**, నల్లగొండ

❖ ❖ ❖

## బహుముఖ ప్రజ్ఞాశీలి మలయశ్రీ

జగమెరిగిన హేతువాది ఎస్.మల్లయ్య (మలయశ్రీ). తెలుగు ఉపాధ్యాయుడిగా, లెక్చరర్‌గా పనిచేసి, 50 పుస్తకాలకు పైగా రాశారు. వీరు 'నవ్యసాహిత్య పరిషత్'ను స్థాపించి ప్రగతి శీల రచయితలకు ప్రతి సంవత్సరం మలయశ్రీ సాహితీ అవార్డులు ఇస్తూ రచయితలను ప్రోత్సహిస్తుండడం చాలా గొప్ప విషయం. 'శాంతి పథం' ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాన్ డీటెయిల్ ఉపవాచకంగా ప్రభుత్వం ఎన్నిక చేయబడడం వారి సాహిత్యానికి ఉదాహరణ. కరీంనగర్ సాహిత్యంలో వారు చెరగని ముద్ర వేశారు. వారి గురించి క్లుప్తంగా తెలియజేసిన దక్కన్‌ల్యాండ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– **పసుపుల శ్రీనివాస్**, కరీంనగర్

## యునెస్కో గుర్తింపుగా 'ముడుమాల్'

తెలంగాణ రాష్ట్రంలోని రామప్ప దేవాలయం యునెస్కో గుర్తింపు పొందింది. ఆ తరువాత వరుసలో ముడుమాల్ మెగాలిథిక్ మెన్హార్స్ ఉండడం తెలుగు ప్రజలకు ఎంతో గర్వం. ప్రపంచ వారసత్వ గుర్తింపునకు విశిష్టమైన ప్రదేశం. వీటి గుర్తింపుకు విశేష కృషి చేసిన వ్యక్తులు మణికొండ వేదకుమార్. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పరిశోధన చేయడం చాలా గొప్ప విషయం. వారికి ధన్యవాదాలు.

– **మహమ్మద్ సత్తార్**, మహబూబ్‌నగర్ ద

## పరిశోధకులకు శుభవార్త
### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం పొందడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 15 సంచిక : 2 పేజీలు : 60

అక్టోబర్ - 2026



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

వాణిజ్య ప్రకటనలు

**కె. సచిన్**

86866 64949

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**



కవర్‌పేజీ

**మేఘాలయన్ యుగం గుహలు**

layout - Composing & Printed @

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

Mobile: 90599 50055

deccanpress.hyd@gmail.com



కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో



ఇంధన రంగంలో
ఇథనాల్ బ్లెండింగ్



మండోదరి పూజించినది
కొలనుపాక తీర్థంకరుడినా!


భానుమతి బహుముఖ సినీ నటి ........ ఎసికె. శ్రీహరి ........ 6
మూసీ చరిత్రే హైదరాబాద్ చరిత్ర (ఎడిటోరియల్) ........ వేదకుమార్. యం ........ 7
సేంద్రియ రత్నం - జెట్ ........ చకిలం వేణుగోపాలరావు ........ 9
రాహుల్ సాంకృత్యాయన్ అడుగుజాడలలో ........ పరవస్తు లోకేశ్వర్ ........ 11
నందికంది 'భూమిజ'ం తెలంగాణా ఆలయ వాస్తు'రాజం' ........ ఈమని శివనాగిరెడ్డి ........ 13
ఘనంగా కెం.ఎం.రెడ్డి జయంతి సభ ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 14
సింథటిక్ జీవన శాస్త్రం - డార్విన్, ఊల్ఫ్‌సన్, మనమూ ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 15
ఇథనాల్ బ్లెండింగ్ ........ పుట్టా పెద్ద ఓబులేసు ........ 17
టంగ్‌స్టన్ మూలకం యొక్క ఖనిజాలు ........ కమతం మహేందర్‌రెడ్డి ........ 21
తెలంగాణ సమాజాన్ని జాగృతం చేస్తున్న దక్కన్ ల్యాండ్ ........ కె. శ్రీనివాస్‌రెడ్డి ........ 23
హైదరాబాద్ చిరునామా దక్కన్ ల్యాండ్ ........ డా॥ నీరజ అమరవాది ........ 23
ఎడారిలో ఒయాసిస్ దక్కన్ ల్యాండ్ ........ బిఎస్. రాములు ........ 24
చరిత్రను అక్షర బద్ధం చేస్తున్న దక్కన్ ల్యాండ్ ........ గిరిజ పైడిమర్రి ........ 27
కాలపురుషుడి డైరీ: మేఘాలయన్ యుగం గుహలు ........ ఎన్. వంశీమోహన్ ........ 29
దక్కన్ చైతన్య వాహిని దక్కన్ ల్యాండ్ ........ డా. ఎస్. రఘు ........ 35
మండోదరి పూజించినది కొలనుపాక తీర్థంకరుడినా! ........ డా॥ జి.యస్. రామయ్య ........ 37
'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ ........ సైయ్యద్ ఖైజర్ ........ 40
పప్పూరు రామాచార్యుల 'శ్రీ సాధన పత్రిక' ........ డా॥ నాగసూరి వేణుగోపాల్ ........ 41
చరిత్రలో... నాటి మునిగండ్లే నేటి మనిగళ్ళ ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 43
ఘనంగా నందికంది యాత్ర ........ అరవింద్ ఆర్య పకిడె ........ 46
మచిలీపట్నంలో సిపాయిల తిరుగుబాటు-1780 ........ మహ్మామద్ సిలార్ ........ 49
మంచుకొండల్లో మహా ప్రళయం : నేపాల్ విలయం ........ పుట్టా పెద్ద ఓబులేసు ........ 52
మంజీరాను అర్థం చేసుకోవడమే నదీ పరిరక్షణకు తొలి అడుగు ........ శోభా సింగ్ ........ 55
ఐటి విప్లవంలో 'నాలెడ్జ్ వర్కర్లదే కీలక భూమిక' ........ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య ........ 57



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# భానుమతి బహుముఖ సినీ నటి

## భారతదేశంలోనే సొంత స్టూడియో ఉన్న తొలి మహిళా నటి

## మూడు భాషల్లో ఒకేసారి సినిమాను డైరెక్ట్ చేసిన తొలి మహిళా దర్శకురాలు

భారతీయ చలనచిత్ర చరిత్రలో కొందరు నటీమణులు కేవలం గ్లామర్‌తో మెప్పిస్తే, మరికొందరు నటనతో ఆకట్టుకుంటారు. కానీ, భానుమతి రామకృష్ణ మాత్రం వీటన్నింటికీ అతీతం. ఆమె నటి మాత్రమే కాదు గాయని, సంగీత దర్శకురాలు, నిర్మాత, దర్శకురాలు, రచయిత్రి ఇలా సినిమాలోని అన్ని విభాగాల్లోనూ తనదైన ముద్ర వేశారు. ఆమె జీవితం, సినిమాలు, రికార్డులు, వ్యక్తిత్వం అన్నీ ఒక పాఠం లాంటివి.



భానుమతీ ఒంగోలు (ప్రకాశం)లో 1926 సెప్టెంబరు 7న జన్మించారు. ఈమె తండ్రి బొమ్మరాజు వెంకట సుబ్బయ్య శాస్త్రీయ సంగీత కళాకారుడు. తండ్రి దగ్గర సంగీతం అభ్యసించిన ఆమె పదమూడేళ్ళ వయసులోనే వరవిక్రయం అనే సినిమాలో నటించారు. తమిళ, తెలుగు చిత్రాల నిర్మాత, దర్శకుడు, ఎడిటరు అయిన పి.ఎస్. రామకృష్ణారావును వివాహమాడారు.

పి.భానుమతి కేవలం నటన గురించి మాత్రమే కాదు. ఈమె 16 చిత్రాలకు దర్శకత్వం వహించి, నిర్మించింది. స్క్రీన్ ప్లేలు, మాటలు, స్క్రిప్టులు రాశారు. సంగీతం సమకూర్చింది. ఈమె తన సినిమాల్లోని అన్ని పాటలు పాడింది. త్యాగరాజు యొక్క ఒక కీర్తనను ఎక్కువగా తన తెలుగు సినిమాలలో చేర్చింది.

భానుమతి గారు అర్ధ శతాబ్దానికి పైబడి సినీ రంగంలో ఉన్నప్పటికీ, ఆమె నటించిన చిత్రాలు సుమారు నూరు మాత్రమే. ఆమె సినిమాలలో మల్లీశ్వరి, మంగమ్మగారి మనవడు వంటి ఆణిముత్యాలు ఎన్నో ఉన్నాయి. విజయా వారి మిస్సమ్మ సినిమాలో ప్రధాన పాత్రకు మొదట భానుమతినే తీసుకున్నారు. అయితే షూటింగు మొదలైన తర్వాత చక్రపాణికి ఆమె వ్యవహార శైలి నచ్చక ఆమె స్థానంలో సావిత్రిని తీసుకున్నారు. ఈ సంగతి గురించి ప్రస్తావిస్తూ భానుమతి ఏటా తాను వరలక్ష్మీ వ్రతం చేసుకుంటాను కనుక ఒక గంట లేటుగా వస్తానని ముందు రోజు చెప్పినా అధికారపూర్వకంగా చక్రపాణి నొప్పించారని రాసుకున్నారు. సావకాశంగా ఆలోచిస్తే చక్రపాణి తప్పేముంది నా సమయం బాగోలేదేమోనని భావించినట్టుగా వివరించారు. ఆ సినిమా విడుదలై, ఘన విజయం సాధించాక భానుమతి నేను మిస్సమ్మలో నటించక పోవడం వల్ల సావిత్రిలాంటి గొప్పనటి వెలుగులోకి వచ్చింది, అని సంతోషించింది.

భానుమతి కేవలము నటిగానే కాక బహుముఖ ప్రజ్ఞాశాలిగా పలువురి మన్ననలు అందుకున్నది. ఓ గాయనిగా, సంగీత దర్శకురాలిగా, స్టూడియో యజమానిగా, నిర్మాతగా, దర్శకురాలిగా, రచయిత్రిగా పలు పాత్రలు సమర్థవంతంగా నిర్వర్తించింది. దక్షిణాది నుంచి హిందీ చిత్రసీమకు వెళ్లిన తొలి సినీతార భానుమతి. ఆ రోజుల్లోనే పాన్ ఇండియా ఘనత సాధించింది. అపూర్వ సహోదరులు, మంగళ, చండీరాణి లాంటి చిత్రాలు ఏక కాలంలో తెలుగు, తమిళ్, హిందీ భాషలలో త్రిభాషా చిత్రాలుగా రూపొంది ఘన విజయం సాధించాయి.

### దర్శకురాలిగా రికార్డ్!

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై భానుమతిని “నడిప్పుకు ఇలక్కణం” (నటనకు నిఘంటువు) అని పిలిచేవారు. ‘స్వర్గసీమ’, ‘మల్లీశ్వరి’, ‘విప్రనారాయణ’, ‘అంతస్తులు’ వంటి సినిమాల్లో ఆమె నటన అద్భుతం. ముఖ్యంగా, 1953లో వచ్చిన ‘చండీరాణి’ సినిమాతో ఆమె ఒక అరుదైన రికార్డు సృష్టించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో సినిమాను డైరెక్ట్ చేసిన తొలి మహిళగా చరిత్రకెక్కారు. అంతేకాదు, ఆ సినిమాలో డ్యూయల్ రోల్ చేసి, మూడు భాషల్లోనూ పాటలు పాడి, కథ స్క్రీన్ ప్లే కూడా రాశారు. అందుకే ఆమెను ‘మల్టీ టాలెంటెడ్’ అనే పదం కూడా తక్కువగానే అనిపిస్తుంది.

### సాహిత్యం, ఎడిటింగ్, సేవ అన్నింట్లో ఆమే టాప్!

భానుమతి కేవలం తెర ముందే కాదు, తెర వెనుక కూడా మేధావి. 1972లో ‘అంత మన మంచికే’ సినిమా నుంచి ఆమె ఎడిటింగ్ బాధ్యతలు కూడా చేపట్టారు. షూటింగ్ స్పాట్‌లో డైలాగ్స్ అప్పటికప్పుడు సొంతంగా చెప్పేసి, తర్వాత స్క్రిప్ట్‌లో రాయించుకునే వారట. ఆమెకు జ్యోతిష్యం, సాముద్రికంలో కూడా మంచి పట్టు

(మిగతా 8వ పేజీలో)




మూసీ హెచ్చరిస్తోంది: సుస్థిర హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయాలు లేవు

# "మూసీ చరిత్రే హైదరాబాద్ చరిత్ర"

**1908** సెప్టెంబర్ 28న సంభవించిన మహా వరదలు హైదరాబాద్‌ను శాశ్వతంగా మార్చేశాయి. అభివృద్ధి చెందుతున్న నగరం ఎంత ప్రమాదానికి లోనవుతుందో అవి తెలియజేశాయి. డ్రైనేజీ, జల నిర్వహణ, వరద నియంత్రణ, పట్టణాభివృద్ధిపై పాలకులు, ప్రణాళికకర్తలు పునరాలోచించేలా చేశాయి.

అసలు పాఠం ఆ తరువాత జరిగిన పరిణామాల్లో ఉంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణం, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థల మెరుగుదల, క్రమబద్ధమైన నగర ప్రణాళిక-హైదరాబాద్‌ను రక్షించి, భవిష్యత్తుకు సిద్ధం చేయాలన్న దూరదృష్టిని ప్రతిబింబించాయి. 1948 వరకు నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల అవసరాలతో సమన్వయంగా సాగింది.

ఆ తరువాత హైదరాబాద్ జనాభా, విస్తీర్ణం, రవాణా, ఆర్థిక కార్యకలాపాల పరంగా అనూహ్యంగా విస్తరించింది. కానీ మౌలిక సదుపాయాలు అదే వేగంతో అభివృద్ధి చెందలేదు. భారీ వర్షం కురిసిన ప్రతిసారీ ఈ అసమతుల్యత బయటపడుతూ నగరంలోని అనేక ప్రాంతాలు స్తంభిస్తున్నాయి.

హైదరాబాద్ ప్రణాళిక ప్రకారం కాకుండా, దానంతట అదే పెరుగుతోంది. పట్టణాభివృద్ధిని కేవలం భవనాలు, రహదారులు, ఫ్లైఓవర్లతో కొలవలేం. మూసీ, చెరువులు, కుంటలు, నాలాలు, పరీవాహక ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు, భూగర్భజలాలు, సహజ శిలా సంపద-ఇవన్నీ నగర జీవావరణ వ్యవస్థలో అంతర్భాగాలు. ఒకదానిని దెబ్బతీస్తే దాని ప్రభావం మిగతావాటిపైనా పడుతుంది.

మూసీని సమగ్ర నదీ పరీవాహక వ్యవస్థగా చూడాలి. చెరువులు-వాటి అనుసంధానాల పునరుద్ధరణ, వరద మైదానాల రక్షణతో పాటు మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఘన వ్యర్థాలు కాలువలకు, చెరువులకు చేరకుండా కఠినంగా నిరోధించాలి. హైదరాబాద్‌కు శాస్త్రీయంగా రూపొందించి, ఎప్పటికప్పుడు నవీకరించే సమగ్ర డ్రైనేజీ మాస్టర్ ప్లాన్‌తో కూడిన సమగ్ర మెట్రోపాలిటన్ ప్రణాళిక అత్యవసరం. భూ వినియోగం, రవాణా, మురుగునీటి నిర్వహణ, వరదనీటి పారుదల, జలవనరులు, పర్యావరణ పరిరక్షణలను వేర్వేరు శాఖలు విడివిడిగా కాకుండా సమన్వయంతో చేపట్టాలి.

నేపాల్‌తో సహా పొరుగు ప్రాంతాల్లో సంభవించిన విపత్తులు మనకు హెచ్చరిక. ప్రకృతిని విస్మరించిన ప్రణాళిక ఉన్నచోట భారీ వర్షాలు, వరదలు పెను విషాదాలుగా మారతాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు సంసిద్ధత మరింత అవసరం.

స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు, సురక్షితమైన నివాసయోగ్య నగరం విలాసాలు కావు. అవి పాలక వ్యవస్థల ప్రాథమిక బాధ్యతలు. ప్రజల భాగస్వామ్యమూ అంతే ముఖ్యం. మూసీ మనకు నేర్పుతున్న పాఠం స్పష్టం-ప్రకృతిని గౌరవించాలి, ముందుచూపుతో ప్రణాళిక చేయాలి, సంక్షోభం రాకముందే చర్యలు చేపట్టాలి. దీనికి ప్రత్యామ్నాయాలు ఉండవు.

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

ఉంది. ఇక సేవగుణం విషయానికి వస్తే చెన్నైలోని సాలిగ్రామంలో 'డాక్టర్ భానుమతి రామకృష్ణ మెట్రిక్యులేషన్ స్కూల్' స్థాపించి పేద పిల్లలకు ఉచిత విద్యను అందించారు. రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ మెంబర్‌గా ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు.

**సాహిత్య వృత్తి**

భానుమతి ప్రతిభావంతురాలైన, నిష్ణాతురాలైన రచయిత్రి. ఆమె పేరు మీద అనేక కథానికలు ఉన్నాయి. ఆమె ఆత్మకథ 'నాలో నేను' తెలుగులో ప్రచురితమై, ఆ తర్వాత 'మ్యూజింగ్స్' పేరుతో ఆంగ్లంలో విడుదలైంది. ఆమె ప్రసిద్ధ కథానిక 'అత్తగారి కథలు'కు గాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆమెను ఉత్తమ కథానిక రచయిత్రిగా సత్కరించింది. ఆమె 5 సంవత్సరాల పాటు లలిత కళా అకాడమీలో, 10 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో సభ్యురాలిగా ఉన్నారు.



ఆమె తన సాహిత్య రచనలలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణను తన గురువుగా భావిస్తారు. భానుమతి హాస్య రచనలు చేయడంలో చాలా నిపుణురాలు. ఆ ఘనతను ఆమె విశ్వనాథ సత్యనారాయణకు ఇస్తారు. ఆమె 14 ఏళ్ల వయసులో రాసిన ఆమె మొదటి లఘు కథ, "మర చెంబు", ప్రచురణకు ముందు విశ్వనాథ సత్యనారాయణ చేత సంకలనం చేయబడింది. ఆమె ఆత్మకథ, "నాలో నేను", తెలుగు మరియు తమిళ భాషలలో ఆమెచే టీవీ సీరియల్‌గా నిర్మించబడింది. ఆమె కథల లఘుచిత్రం, "అట్టగారి కథలు", హిందీలో ఆమెచే టీవీ సీరియల్‌గా (6 ఎపిసోడ్‌లు) నిర్మించబడింది.

ఆమె రెండు సంవత్సరాల పాటు రాష్ట్ర చలనచిత్ర పురస్కారాల కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. ఆమె ఒక సంవత్సరం పాటు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా కూడా పనిచేశారు. ఆమె 1965 నుండి 1970 వరకు 5 సంవత్సరాల పాటు బాలల చలనచిత్ర సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు.

**సంగీతంలో కూడా మంచి గుర్తింపు– ఎంజీఆర్ గౌరవం!**

భానుమతికి సంగీతం అంటే ప్రాణం. సినిమాల్లోకి వచ్చాక కూడా త్యాగరాజ కృతులు పాడతానని తండ్రికి మాట ఇచ్చారు. అందుకు తగ్గట్టే తన సినిమాల్లో శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేశారు. తమిళ లెజెండ్ ఎం.జి. రామచంద్రన్ (MGR) ఆమెకు పెద్ద ఫ్యాన్. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భానుమతిని మద్రాస్ గవర్నమెంట్ మ్యూజిక్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా నియమించారు. లక్స్ సబ్బు యాడ్‌ను తిరస్కరించిన గట్స్ ఆమె సొంతం.

దిగ్గజ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 1945లో 'స్వర్గ సీమ' చిత్రంలో భానుమతితో కలిసి నేపథ్య గానంతో అరంగేట్రం చేశారు. ఈ సమయంలోనే ఆమె ఏకైక కుమారుడు భరణి జన్మించాడు. అయినప్పటికీ ఆమెకు సినిమా అవకాశాలు వెల్లువెత్తాయి. 1947లో భానుమతి, రామకృష్ణ తమ కుమారుడి పేరు మీద 'భరణి ఫిల్మ్స్' అనే పేరుతో సొంత చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించారు. 1950లో వారు భరణి స్టూడియోస్‌ను ప్రారంభించారు.

**అవార్డుల రారాణి దక్షిణాదికే గర్వకారణం!**

భానుమతి గారు సాధించిన అవార్డులు ఆమె ప్రతిభకు అసలైన నిదర్శనం. దక్షిణ భారతదేశం నుంచి పద్మ అవార్డులు (పద్మశ్రీ 1966) అందుకున్న మొట్టమొదటి నటిగా ఆమె చరిత్ర సృష్టించారు. 2001లో పద్మభూషణ్ కూడా ఆమెను వరించింది. 'అన్నై' (1962), 'అంతస్తులు' (1965), 'పల్నాటి యుద్ధం' (1966) సినిమాల్లో నటనకు గాను మూడుసార్లు రాష్ట్రపతి అవార్డులు అందుకున్నారు. 1986లో ఉత్తమ దర్శకురాలిగా నంది అవార్డు, తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి', ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, రఘుపతి వెంకయ్య, ఎన్టీఆర్ జాతీయ అవార్డులు కూడా వచ్చాయి.

చివరి వరకు ఒక మహారాణిలా బతికిన భానుమతి 2005లో డిసెంబరు 24న కన్నుమూసినా, ఆమె వేసిన ముద్ర భారతీయ సినిమా ఉన్నంత కాలం చెరిగిపోదని చెప్పవచ్చు.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145, e : ackvs08@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# సేంద్రియ రత్నం – జెట్

ధనార్థినో జనాః సర్వే రమంతేస్మిన్నతీవ యత్ ।
అతో రత్నమితి ప్రోక్తం శబ్దశాస్త్రవిశారదైః ॥

"ధనాన్ని కోరుకునే మనుషులందరూ దీనియందు అమితమైన ఆనందాన్ని (రమంతే) పొందుతారు, కాబట్టే పండితులు దీనిని 'రత్నము' అని పిలిచారు." అని ఆయుర్వేద నిఘంటువు లో పేర్కొన్నారు.

ఇలాంటి రత్నాలు 300 దాకా ఉండవచ్చు. ఈ రత్నాలు ఎక్కువ భాగం భూమి నుండి వివిధ సహజ ప్రక్రియల ద్వారా ఉద్భవించినవే. అయితే కొన్ని మాత్రం జీవ సంబంధ పదార్థాల నుంచి ఏర్పడినవి. ఉదాహరణకు ముత్యాలు, పగడాల వంటివి. మరికొన్ని భూమి లోపల దొరికేవే అయినా, జీవ సంబంధ పదార్థాల నుంచి ఏర్పడినవి ఉదాహరణ ఏంబర్ (శిలాజ జిగురు). ఇలాంటి జీవ సంబంధ పదార్థాల వల్ల ఏర్పడిన రత్నాలను "సేంద్రియ రత్నాలు" అంటారు. ముత్యాలు పగడాలు అందరికీ బాగా పరిచయం ఉన్నవే. ఇవి కాకుండా జనబాహుళ్యానికి అంతగా పరిచయం లేని రత్నాలు కూడా ఉన్నాయి. వీటిలో జెట్ కూడా ఒకటి.



**జెట్ అంటే ఏమిటి:** జెట్ అనేది ముదురు నలుపు రంగులో ఉండే ఒక సేంద్రీయ రత్నం. ఇది ఖనిజం కాదు, లక్షల సంవత్సరాల నాటి శిలాజంగా మారిన దారువు నుండి ఏర్పడిన ఒక ఖనిజ రూపం. ఆంగ్లంలో అత్యంత నల్లని రంగును సూచించడానికి వాడే "జెట్ బ్లాక్" అనే పదం దీని వల్ల వచ్చింది.

**పుట్టుక:** సుమారు 180 మిలియన్ సంవత్సరాల క్రితం, జురాసిక్ కాలంలో జీవించిన పురాతన కోనిఫెర్ చెట్ల కలప కుళ్ళిపోవడం మరియు కర్బనీకరణం చెందడం ద్వారా ఈ జెట్ ఏర్పడుతుంది. ఈ చెట్లు ఆక్సిజన్ లేని చిత్తడినేలలు లేదా సముద్రపులోతుల్లో పూడుకుపోయినప్పుడు, అధిక ఉష్ణోగ్రత మరియు తీవ్రమైన ఒత్తిడి కారణంగా కాలక్రమేణా గట్టిపడి నల్లనిరాయిగా మారతాయి.

**రసాయన నిర్మాణం:** ఇది పూర్తిగా చెట్ల నుండి ఏర్పడినది కాబట్టి దీని రసాయన కూర్పు అది ఏర్పడిన మూలం, పర్యావరణ పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. ఇందులో ప్రధానంగా 75% కార్బన్, 12% ఆక్సిజన్, 13% సల్ఫర్ మరియు హైడ్రోజన్ ఉంటాయి. కొద్ది మొత్తంలో పైరైట్ ఖనిజం కూడా ఉంటుంది.

**లక్షణాలు:** ఇవి నిగనిగలాడే నలుపు లేదా ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ఇది చాలా తక్కువ కాఠిన్యం కలిగిన రత్నం. మోహ్స్ స్కేల్‌పై దీని కఠినత్వం 2.5 నుండి 4.0 మాత్రమే ఉంటుంది. కాబట్టి దీనిపై సులభంగా గీతలు పడతాయి. దీని మెరుపు ముడి రూపంలో ఉన్నప్పుడు కాంతివిహీనంగా ఉంటుంది. కానీ పాలిష్ చేసినప్పుడు అద్దం లాంటి అద్భుతమైన మెరుపును సంతరించుకుంటుంది. ఇది చాలా తేలికగా ఉంటుంది, ఇంకా ఉష్ణ వాహకం కాకపోవడం వల్ల ఇతర రాళ్ళలా కాకుండా, తాకినప్పుడు వెచ్చగా అనిపిస్తుంది. ఈ రాయిని గుడ్డతో గట్టిగా రుద్దినప్పుడు, ఇందులో స్థిర విద్యుత్ ఏర్పడి చిన్న చిన్న కాగితపు ముక్కలను ఆకర్షిస్తుంది.

**రకాలు:** జెట్ ప్రధానంగా రెండు రకాలు. హార్డ్ జెట్– ఉప్పు నీటి సముద్రపు పర్యావరణంలో ఏర్పడుతుంది. ఇది చాలా గట్టిగా ఉంటుంది, పగుళ్లు రావు. దీనితోనే నాణ్యమైన నగలు తయారు చేస్తారు. సాఫ్ట్ జెట్– మంచి నీటి పర్యావరణంలో ఏర్పడుతుంది. ఇది పెళుసుగా పగిలిపోయే స్వభావాన్ని కలిగి ఉంటుంది.

**లభ్యత:** ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైన జెట్ రత్నాలు ఇంగ్లాండ్‌లోని విట్బీ తీరప్రాంతాల్లో లభిస్తాయి. ఇవి కాకుండా స్పెయిన్, అమెరికా యుటా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా మరియు చైనా దేశాలలో కూడా ఇవి దొరుకుతాయి.

**భారతదేశంలో లభ్యత:** భారతదేశం జెట్ రత్నాలకు ప్రపంచ ప్రసిద్ధి కాకపోయినా, జెట్ వంటి నల్లని సేంద్రియ శిలాజరాళ్లు బొగ్గు, లిగ్నైట్ పొరల్లో అక్కడక్కడా లభిస్తాయి. భారత భూగర్భసర్వే ప్రకారం టెర్షియరీకాలపు లిగ్నైట్ నిక్షేపాలు ఉన్నచోట్లనే దీనికి అవకాశం ఎక్కువ. గుజరాత్ లోని కచ్ ప్రాంతం, ముఖ్యంగా లఖ్ పత్ తాలూకాలోని పానంద్రో, మాతానోమఢ్, ఉమర్ సర్ లిగ్నైట్ గనుల పరిసరాల్లో దాదాపు 15% రాష్ట్ర లిగ్నైట్ నిల్వల్లో జెట్ వంటి నల్లనికార్బన్ రూపాలు, అంబర్‌తో పాటు బయటపడ్డట్లు పరిశోధనలు చెబుతున్నాయి. అస్సాం ఎగువప్రాంతంలో మాకుమ్, జైపూర్, నజీరా బొగ్గు క్షేత్రాల్లో, జమ్మూ ఓ కాశ్మీర్ లోని కాలాకోట్ టెర్షియరీ బొగ్గు పొరల్లో, రాజస్థాన్ లోని బార్మర్, బికనీర్ లిగ్నైట్

బెల్ట్‌లో, తమిళనాడు నెయ్వేలీ లిగ్నైట్ గనుల్లో కూడా ఇలాంటి శిలాజదారువు ముక్కలు దొరుకుతాయి. అయితే ఇవి వాణిజ్య స్థాయిలో నగలనాణ్యత కలిగిన హార్డ్ జెట్ కాదు, ఎక్కువగా సాఫ్ట్ జెట్, లిగ్నైట్ తో కలిసిన రూపాలు. అందువల్ల భారతమార్కెట్‌లో దొరికే నల్ల పూసలు చాలావరకు నల్లగాజు లేదా ఒనిక్స్ అయ్యే అవకాశం ఉంది.

**చరిత్ర:** ప్రాచీన నాగరికతలో నవీనశిలాయుగం నుండి మానవులు దీనిని పూసలు, బొమ్మల తయారీకి వాడేవారు. రోమన్లు దీనితో తలపిన్నులు, ఉంగరాలు చేసేవారు. జెట్ అనే పేరు గ్రీకుభాషలోని లిథోస్ గగాటెస్ అంటే టర్కీలోని గగే నది ప్రాంతపురాయి అనే పదం నుండి కాలక్రమేణా వచ్చింది. 1861లో బ్రిటన్ రాణి క్వీన్ విక్టోరియా భర్త మరణించిన తర్వాత, ఆమె తన జీవితాంతం కేవలం నల్లనిబట్టలు మరియు ఈ జెట్ రత్నంతో చేసిన నగలనే ధరించారు. దీనితో ప్రపంచవ్యాప్తంగా శోక, సంతాపసమయాల్లో ధరించే నగలుగా దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది.

**జెట్‌ను పోలిన రాళ్లతో తేడా:** మార్కెట్‌లో జెట్ అనే పేరుతో అనేక నకిలీరాళ్లను అమ్ముతుంటారు కాబట్టి తేడా తెలుసుకోవడం అవసరం. నల్ల గాజు లేదా అబ్సిడియన్ చూడటానికి జెట్ లాగే నల్లగా ఉన్నా బరువుగా, చల్లగా ఉంటుంది, లెన్స్‌తో చూస్తే లోపల బుడగలు కనిపిస్తాయి. జెట్‌లో బుడగలు ఉండవు. బ్లాక్ ఒనిక్స్ ఖనిజం కాబట్టి చాలా గట్టిగా, బరువుగా ఉంటుంది. దాని మెరుపు గాజుమెరుపులా ఉంటుంది. ప్లాస్టిక్, ఎబోనైట్, బేకలైట్ వంటివి జెట్ లాగే తేలికగా ఉన్నా వేడిసూదిపరీక్షలో తేలిపోతాయి. వేడి సూదిని గుచ్చితే ప్లాస్టిక్ కరిగి ఘాటైన రసాయనవాసన వస్తుంది. అసలైన జెట్‌కు బొగ్గు లేదా కట్టె కాలిన సహజవాసన మాత్రమే వస్తుంది. అలాగే జెట్‌ను ఉన్నిగుడ్డతో రుద్దితే కాగితపుముక్కలను ఆకర్షిస్తుంది. గాజు లేదా ఒనిక్స్ అలా చేయవు.



**నమ్మకాలు మరియు విశేషాలు:** ప్రాచీన రోమన్లు మరియు గ్రీకులు దీనిని దిష్టి తగలకుండా రక్షణ కవచంగా ధరించేవారు. ఇది దుఃఖాన్ని, బాధను తగ్గిస్తుందని మరియు నెగటివ్ ఎనర్జీని దూరంచేస్తుందని నమ్ముతారు. పూర్వకాలంలో దీనిని కాల్చగా వచ్చే పొగద్వారా పాములను, కీటకాలను తరిమేసేవారని ప్లినీ రాశాడు. వేడిసూదిపరీక్ష ద్వారా ఇది నిజమైన జెట్ రాయా లేక ప్లాస్టిక్కా అని తెలుసుకోవచ్చు. మధ్యయుగంలో దీనిని నల్లని అంబర్ అని పిలిచేవారు. జెట్ మరియు అంబర్ రెండూ చెట్ల నుండి వచ్చినవే కావడం, రుద్దినప్పుడు విద్యుత్‌ను పుట్టించడం దీనికి కారణం. విక్టోరియా రాణికాలంలో ఇంగ్లాండ్‌లోని విట్‌బీ కొండలను విపరీతంగా తవ్వడంవల్ల ఆ కొండలు విరిగిపడటం మొదలైంది. అందువల్ల అక్కడ గనులతవ్వకాన్ని నిషేధించారు. ఇప్పుడు కేవలం సముద్రపు అలల ద్వారా కొట్టుకువచ్చే జెట్ రాళ్ళను మాత్రమే సేకరించడానికి అనుమతి ఉంది.

**మన పూర్వీకుల దృష్టిలో:** మన పూర్వీకులు దీనిని కృష్ణ శిలగా భావించినట్లు బుధభట్టుని రత్నపరీక్షలోని ఈ శ్లోకం ద్వారా తెలుస్తోంది.

*కృష్ణోపలో లఘుర్వర్ణే స్నిగ్ధో దృష్టి వినాశకః ।*
*ధార్యో రాజ్ఞా సదా కంఠే రక్షోఘ్నః పరికీర్తితః ॥*

"నల్లనిరంగు, తేలికైన, మెరిసేరాయి కృష్ణోపలము. ఇది దిష్టిని పోగొడుతుంది. రాజు దీనిని ఎప్పుడూ కంఠంలో ధరించాలి. ఇది రాక్షసులను నాశనం చేస్తుందని చెప్పబడింది." అధర్వవేద పరిశిష్టలో నల్లనిరాళ్ళు అభిచార(చేతబడి) నివారణ కోసం పనికివస్తాయి అని ఉంది. బృహత్సంహితలో వరాహమిహిరుడు ఇలా పేర్కొన్నారు.

*యత్ర తరూణాం శిలీభావో దృశ్యతే పుణ్యదేశే ।*
*తత్ర రత్నాని జాయన్తే భూమేః సారవశాద్భువి ॥*

ఎక్కడ చెట్లు రాయిగా మారాయో, ఆ పవిత్ర ప్రదేశంలో భూమియొక్కసారం వల్ల రత్నాలు పుడతాయి అనే ఆ కాలంలో ఉన్న నమ్మకాన్ని ఈ శ్లోకం ప్రతిబింబిస్తుంది.

ఆయుర్వేదం మరియు యునానీ వైద్యంలో జెట్‌ను కొన్ని ప్రత్యేకపేర్లతో పిలుస్తారు. సంగ్-ఎ-మూసా అనేది ఉత్తర భారతదేశంలో మరియు ఉర్దూసాహిత్యంలో ముదురు నల్లని, పాలిష్ చేసిన రాళ్ళను సూచిస్తుంది. మొఘల్ చక్రవర్తులు దీనితో అందమైన గిన్నెలు, బరువులు మరియు కట్టడాలలో ఇన్-లే పనులకోసం వాడేవారు. సంగ్-ఎ-సులేమాని అనే కొన్నిరకాల నల్లని రక్షణరాళ్ళను దిష్టి తగలకుండా తాయెత్తులలో వాడేవారు.

**ఉపయోగాలు:**

ఆభరణాలు, శివలింగాలు, జపమాలలు మరియు రక్షణ తాయెత్తుల తయారీలో ఈ నల్లనిరాయిని ఉపయోగిస్తారు. ఆయుర్వేద, యునానీవైద్యంలో రత్నశాస్త్రం ప్రకారం, ఈ రకమైన కార్బన్ రాళ్ళను శుద్ధిచేసి భస్మంగా మార్చి, కంటిసమస్యలు లేదా గాయాలను నయం చేయడానికి పూర్వం వాడేవారు.

-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# రాహుల్ సాంకృత్యాయన్ అడుగుజాడలలో...

మహామహోపాధ్యాయ, మహాపండిత, త్రిపిఠికాచార్య, ప్రపంచ సంచారి రాహుల్ సాంకృత్యాయన్‌కు నేను ఏకలవ్య శిష్యుడిని. ఆయన రచనలను పిన్న వయసులోనే జ్ఞాన దాహంతో చదివి నా జీవితాన్ని ఆయన అడుగుజాడలలో నడిచి తీర్చిదిద్దుకున్నాను. ఆయనతో నా అనుబంధమే ఈ వ్యాసం ఉద్దేశం.

× × ×

1975 ఎమర్జెన్సీ చీకటి రోజులు. అప్పుడు నాది 'పైలా పచ్చీస్' వయసు. 1970 దశకం సహచరులతో కలిసి "తిమిరంతో సమరం" సాగిస్తున్నాను. నగరం పొలిమేరలలో ఉన్న జిల్లెలగూడా, కర్మన్‌ఘాట్ ప్రాంతంలో శిథిల దేవాలయంలో "పురాణ పఠనం" కోసం అర్చకుడి అనుమతి సంపాదించి "అక్కడ రాజకీయ సమావేశం" పెట్టుకున్నాం. ఆ స్థలానికి త్వరగా చేరుకున్న నేను సమావేశానికి ఇంకా సమయం ఉన్నందున అక్కడి పూదోటలో ఉన్న చేదబావి గోడకు నిలబడి ఏకాంతంలోని నిశ్శబ్దాన్ని ఆనందిస్తున్నాను. ఇంతలో దూరంగా ఉన్న పూజారిగారి పెంకుటిల్లు నుండి రేడియోలో "ఎందుకోయి తోట మాలి" విప్రనారాయణ సినిమాలోని భానుమతి కలకూజిత కోయిల కంఠం నా చెవులకు సోకి నా మనసు మానస సరోవరంగా మారి అలలు అలలుగా తేలి పోతుంది. అట్లాంటి రసమయ వాతావరణంలో అక్కడికి వచ్చిన రఘుపాల్ "నువ్వు రాహుల్ సాంకృత్యాయన్ పుస్తకాలు చదివినవా?" అని ప్రశ్నించాడు.

ఆ పేరు నాకు గ్రీక్ అండ్ లాటిన్ పదంలా వినిపించి చదవలేదు అన్నాను. నువ్వు తప్పకుండా చదివి తీరవల్సిన పుస్తకాలు అని ఆదేశించాడు. తర్వాత నా సాహిత్య స్నేహితుడు వేణు సంకోజు కూడా ఆ మాటే అన్నాడు.



అట్లా ఆ మహోన్నత మానవుడు రాహుల్ సాంకృత్యాయన్ నా జీవితంలోకి ప్రప్రథమంగా ప్రవేశించాడు. అతని పుస్తకాలు దివోదాసు, లోకసంచారి, ఋగ్వేద ఆర్యులు, జయయౌధేయ, సింహసేనాధిపతి లాంటివి అన్నీ చదివి చరిత్ర పట్ల ఎక్కువ మక్కువ పెంచుకున్నాను. ఆయన రచనల్ని చదివి లోక సంచారిగా మారాలని, దేశదేశాలు తిరగాలని దేశంలోని అన్ని చారిత్రిక స్థలాలు పర్యటించాలని ధృడంగా నిశ్చయించుకున్నాను.

కాకతాళీయంగా మా ఇద్దరి జీవితాలలో ఒక సంఘటన ఒకే వయసులో జరిగింది. అయితే కాలాలు మాత్రం వేరువేరు. రాహుల్జీ తన పద్నాల్గు సంవత్సరాల వయసులో ఇంట్లో చేసిన ఒక చిన్న పొరపాటు వలన తాతగారి దండన భయంతో ఇల్లు వదిలి మొదటిసారి పారిపోయాడు. అది అతని లోక సంచారానికి నాంది పలికింది. నేను కూడా సరిగ్గా అదే వయసులో "ఇష్టం లేని స్కూలు, పాఠాలు వదిలి లైబ్రరీలో కూచుని పుస్తకాలు చదివే సంగతి మా బాపుకు తెలిసిందన్న భయంతో తన్నులు తప్పించుకోటానికి రైలెక్కి విజయవాడ పారిపోయాను". నా లోక సంచారానికి అది కూడా అంతం కాని ఆరంభమే!

రాహుల్జీ వేదాలు, సంస్కృత సాహిత్యాల ప్రభావంతో తొలిదశలో ఆర్యసమాజిస్టుగా, తర్వాత ప్రాకృతం పాళీ గ్రంథాల అధ్యయనంతో బుద్ధిస్టుగా, గాంధీజీ పిలుపును అందుకుని సత్యాగ్రహాలలో పాల్గొని కాంగ్రెసు వాదిగా జైలుకు వెళ్లి కమ్యూనిస్టుల సహవాసం, సహచర్యం అధ్యయనాలతో కమ్యూనిస్టుగా మారారు. చివరికి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగానే మరణించాడు. ఆయన జీవితం ప్రవహించే నదిలా తప్ప నిలవ నీటి మురికి గుంటగా మారలేదు.

ఇక నేను రష్యన్ మహాకవి మయకోవస్కీ "నేను అత్యున్నత కవితా సముశిఖరాలపై నుండి కమ్యూనిజం లోకి దూకుతాను. కమ్యూనిజం నా హృదయం. అది కాక నాకు వేరే ప్రేమలేదు" అన్నట్లు నేను చదివిన సాహిత్యం నన్ను సంస్కరించి, మానవీయంగా, సున్నితంగా మార్చటం వలన సహజాతి సహజంగా 1970ల నాటి కాలప్రభావాల మూలంగా కమ్యూనిస్టుగా మారి కటకటాల వెనుక కొంత కాలం గడిపాను. నేను "కాలం కన్న బిడ్డను" కావున రాహుల్జీ మాదిరిగానే కమ్యూనిస్టుగా మారి అదే హృదయం, అదే మనసుతో ఇప్పటికీ మనుగడ సాగిస్తున్నాను. "ఎల్లలోకములొక్క ఇల్లై" అన్న గురజాడ కవితా పంక్తిలాగే రాహుల్‌జీ కూడా నిరంతర లోక సంచారిగా ఘుమక్కడ్‌గా, చల్ ఆకేలా ముసాఫిర్‌గా మారి దేశదేశాలను చుట్టి వచ్చాడు. లోకం చుట్టిన జ్ఞానపిపాసి అతను. ఇబాన్ బటూ మార్కోపోలో, ఫాహియాన్, హ్యూయాన్‌త్సంగ్‌లకు నిజమైన వారసుడు అతను. మనకాలపు కాలిబాటల పర్యాటకుడు అతను. మూడుసార్లు మంచుకొండలు, మంచు లోయలు, మంచు ఎడారులలో కాలినడకతో టిబెట్‌కు ప్రయాణించి మధ్యయుగాలలో అక్కడికి తరలివెళ్ళిన బౌద్ధ సాహిత్యాన్ని మళ్లీ మన దేశానికి తీసుకు వచ్చి పాట్నా గ్రంథాలయంలో భద్రపరిచిన

మహామేధావి, మహోన్నత మానవుడు అతను.

"దునియా కీ సైర్ కర్ గాఫిల్" అన్న వాక్యం జీవితాంతం ఆయన్ను వెంటాడి వేధించింది. నేను కూడా ఆయన పర్యటించిన బౌద్ధ క్షేత్రాలన్నీ; నాగార్జున కొండ, అమరావతి, అజంతా గుహలు, బోధగయ, సారనాథ్, రాజగృహ, గృధకూట పర్వతం, నలందా, వైశాలి, కుసీనారా, లుంబినీ, కపిలవస్తులే కాక శ్రావస్తి, కోశాంబి, సాంచీలను ఒకటికి రెండుసార్లు చుట్టివచ్చాను. వీటితో పాటు దేశంలోని అనేక ప్రాంతాలను, నదుల మూలాలను ఒంటరి యాత్రికుడిగా తిరిగి వచ్చాను. రవీంద్రనాథ్ టాగోర్ "ఎక్లా చలో" కవిత నాకిష్టం. ఒంటరిగా ప్రయాణించడమంటే బాహ్య పర్యటనలతో పాటు ఏకకాలంలో మన మనసు పొరల్లోని అంతర్లోకాలలోకి కూడా ప్రయాణించటమే కదా! చెవిలో జోరీగలాగ ఎవరూ నా ప్రక్కన ఉండటం నాకిష్టం ఉండదు.




ఇతర దేశాలతో పాటు ఆయన రష్యా, చైనా, మధ్య ఆసియా దేశాలను పర్యటించి ఆ దేశాలపై యాత్రా గ్రంథాలను రచించాడు. ఆ స్ఫూర్తితో నేనూ ఆ దేశాలలో రెండు నెలల పాటు యాత్రికుడిగా సంచరించి "సిల్కురూట్‌లో సాహసయాత్ర" అన్న గ్రంధాన్ని ఇతర యాత్రాగ్రంధాలను రచించాను. పశ్చిమ యూరపులోని పదమూడు దేశాలు, ఆస్ట్రేలియా, న్యూజిలాండు, భూటాన్, నేపాల్‌లను సందర్శించి నా సంచార దాహాన్ని కొంతలో కొంతవరకు తీర్చుకున్నాను.

చదివిన పుస్తకాలలోని అక్షరాల వెంబడి, ఆ స్థలాలు, ఆ మనుష్యుల సందర్శన కోసం అన్వేషించటం, అనుసరించటం నా సంచార స్వభావంలో ఒక ముఖ్యమైన విశేషం. డార్జిలింగ్ వెళ్లినప్పుడు ''ముర్దాహట్టీ''లోని (స్మశానం) ఆయన సమాధిని వెతికి పట్టుకుని భక్తి, శ్రద్ధలతో నా నివాళులు అర్పించాను. ఆ నగరం కూడలిలో ఆయన కాంస్య విగ్రహాన్ని, ఆయన నివసించిన స్వగృహాన్ని సందర్శించటమే గాక నార్త్‌బెంగాల్ విశ్వవిద్యాలయానికి వెళ్లి అక్కడ ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా పని చేస్తున్న ఆయన కొడుకు జెటా సాంకృత్యాయన్‌ను కూడా కలుసుకున్నాను.

రాహుల్ సాంకృత్యాయన్ ఒక మేరుపర్వతం. నేను ఆ మహాపర్వతం ముందు నిలుచున్న ఒక మరుగుజ్జును మాత్రమే. ఆయనొక జ్ఞాన సముద్రం. ఆ మహాసముద్రం ఒడ్డున నేనొక చిన్న ఇసుక రేణువును మాత్రమే తప్ప నన్ను ఆయనతో పోల్చుకోవటం ఈ వ్యాసం ఉద్దేశం కాదని పాఠకులకు సవినయంగా మనవి చేస్తున్నాను.

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన



పెద్దలు రాసిన పిల్లల కథలు

(ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300

ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్
నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com



# నందికంది 'భూమిజ'ం తెలంగాణా ఆలయ వాస్తు'రాజం'

ఆలయాలు, నాగర, ద్రావిడ, వేసర అని మూడు రకాలుగా శిల్ప, ఆగమ శాస్త్రాలు పేర్కొన్నాయి. కింది నుంచి పై వరకూ, చదరంగా ఉన్న ఆలయం నాగరం, ఆలయం మొత్తం గానీ లేక విమానంలోని కంఠం, శిఖరం ఎనిమిది పలకలుగా ఉంటే ద్రావిడమనీ, వృత్తాకారం, ఆయతాశ్రంగా గానీ లేక, కింద చదరంగా ఉండి, విమానకంఠం, శిఖరం గుండ్రంగా ఉంటే వేసరమంటారని శిల్పాగశాస్త్రాలు చెప్పాయి. ఆలయ కప్పు భాగంపైన నిర్మించే కట్టడాన్ని విమానమంటారు. విమానంలో 'కలశం' కింద ఉండే భాగాన్ని శిఖరమంటారు. కానీ, సాధారణంగా, విమానాన్ని శిఖరమని కూడా పిలుస్తున్నారు.

'నానామాన విధానత్వాత్ విమనాం పరికల్పయేత్' అనేక రకాల కొలతలతో నిర్మించే కట్టడాన్ని విమానమంటారు. ఆలయాన్ని ప్రాసాదమని కూడా అంటారు. ఇలా అనేక రకాల ప్రాసాదాల గురించి విమానాల గురించి, శిల్పశాస్త్రాలు ఆసక్తికరమైన వివరాల నందిస్తున్నాయి. వీటిలో 'భూమిజ' అనే విధానం ఒకటి. ఆలయం కింది నుంచి గానీ, లేక శిఖరంగానీ, నాలుగు శీర్షాలతో, ముందు శుకనాసితో, మధ్య ముందుకు పొడుచుకొచ్చిన రథాలతోనూ, నాలుగు మూలల్లో శృంగాలనే చిన్ని శిఖరాలతోనూ, వరుసగా అమరి ఉంటే ఆ ఆలయాన్ని 'భూమిజం' అంటారు. అంటే, ఆ కట్టడం, భూమి నుంచి అలా పుట్టుకొచ్చిందాన్నంత భ్రమ కలిగించేలా ఉంటుంది.

**అపరాజితపృచ్ఛలో**, 25 రకాలు, **సమరాంగణసూత్ర**ధారంలో 4 రకాల భూమి జాల వివరాలున్నాయి. మాళ్వలోపుట్టి, కర్నాటకలో వేళ్లూనుకొని తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన ఈ 'భూమిజ' ఆలయానికి సంగారెడ్డి జిల్లా, నందికందిలోని రామలింగేశ్వరాలయం ఒక చక్కటి ఉదాహరణ. భూమట్టం నుంచి శిఖరం వరకూ (ఉపానాది స్థూపిపర్యంతం) నక్షత్రాకారంలో కోణాలన్నీ ఒక్కొక్క ఆలయరీతిలో, అధిష్ఠానం పాదవర్గం (ప్రస్తరంలేదు) నాలుగంతస్తుల శిఖరం, చివరికి ఆలయంపై కలశాన్ని బిగించే మహాపద్మం కూడా నక్షత్రాకారంగానే తీర్చి దిద్దటం ఈ ఆలయ ప్రత్యేకత. గర్భాలయం, అర్థమండపం, మహామండపం, ముందు ఒకతోరణంతో, ఆలయం లోపలి మహా(రంగ) మండపంలోని నాలుగు మధ్యస్థంభాలు, నాలుగు రకాలుగా తీర్చిదిద్దబడినాయి. సా.శ.1015-42 సం॥ల మధ్య కళ్యాణచాళుక్యచక్రవర్తి 'జగదేకమల్ల' జయసింహుని పాలనలో నిర్మించబడిన ఈ ఆలయం, కర్ణాటకలోని దంబాల్ ఆలయ రీతిలో ఉండటం గమనార్హం. ఆ తరువాతి కాలపు భూమి జాలయం, కర్నూలు జిల్లా పెదతుంబళంలో కూడ ఉంది.

ఇంతటి విలక్షణ వాస్తు శైలికి అద్దంపడుతూ, తెలంగాణా ఆలయశైలిలో, వాస్తురాజంగా విలసిల్లుతూ అనేకమంది పరిశోధకులను పర్యాటకులనూ ఆకర్షిస్తుంది. గత నెలలో కొత్త తెలంగాణా చరిత్ర బృందం, అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, అధ్యక్షులు మణికొండ వేదకుమార్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది చరిత్రకారులు నందికంది భూమిజ ఆలయాన్ని సందర్శించిన సంగతిని ఇక్కడ ప్రస్తావించాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎక్కడా లేని ఇలాంటి అరుదైన ఆలయం తెలంగాణా ఆలయ వాస్తు చరిత్రలో ఒక మైలురాయి.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి
m : 9848598446, e : nagireddy@malaxmi.in




# ఘనంగా కె.ఎం.రెడ్డి జయంతి సభ

తెలంగాణ తాను నడిచొచ్చిన తొవ్వను యాది చేసుకున్నది. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాలకు ఊపిరులూదిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య కె. మధుసూధన్ రెడ్డి (1935–2025) జయంతి సభను జ్ఞాపకాల తలపోతగా సెప్టెంబర్ నాలుగున నిర్వహించారు. 1990వ దశకం ఆరంభం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమానికి పాదులు వేసి, భావజాల వ్యాప్తికి కరపత్రాలు, బుక్‌లెట్స్ ప్రచురించి, ఊరూరా సభలు సమావేశాలు నిర్వహించి, విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉద్యమ విద్యార్థులకు అండగా నిలబడి, తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్టు కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములై ప్రజల్ని చైతన్య పరిచిన చింతనాశీలి మధుసూధన్ రెడ్డి. ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర ఆచార్యులుగా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గ్రామీణ విద్యార్థుల కల్పతరువుగా వేలాది మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిండు.

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆయన జయంతి ఉత్సవాలను ఈ ఏడాది కృష్ణ జన్మాష్టమి రోజున (సెప్టెంబర్ నాలుగు) హైదరాబాద్‌లోని భారత్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగాయి. ఈ సభలో మధుసూధన్ రెడ్డి శిష్యులు, అనుయాయులు, అభిమానులు పాల్గొన్నారు. ఉద్యమ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. సభలో ఎమ్మెల్సీలు ఆచార్య కోదండరామ్, దాసోజు శ్రావణ్ కుమార్‌లతో పాటు అనేకమంది పాల్గొని తమ అభిప్రాయాలను, సారుతో గల అనుబంధాన్ని పంచుకున్నారు. మధుసూధన్ రెడ్డి పేరిట ప్రతి సంవత్సరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్మారక ఉపన్యాసాన్ని ఏర్పాటు చేయాలని, బెస్ట్ విద్యార్థికి స్వర్ణ పతకం ప్రదానం చేయాలని, పొలిటికల్ సైన్స్ విభాగంలో ఆయన పేరిట ఒక చెయిర్‌ని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అధ్యయన విభాగాన్ని నెలకొల్పాలని కూడా వక్తలు అభిప్రాయ పడ్డారు.




అట్లాగే ప్రస్తుతం మఱ్ఱిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఉన్నటువంటి 'సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్'ని 'ఆచార్య కెఎం రెడ్డి సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్'గా మార్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. ఇది ప్రభుత్వానికి ఖర్చుయ్యే విషయం కూడా కాదు కాబట్టి, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సభలో తీర్మానించారు.

జీవిత పర్యంతం అటు ఆచార్య తోట ఆనందరావు మొదలు ఇటు ఆచార్య కేశవరావు జాదవ్, కాళోజి నారాయణరావు మొదలు జూలూరు గౌరీశంకర్ వరకు ఎందరో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి నడవడమే గాకుండా మరెంతో మందికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మధుసూధన్ రెడ్డి 1990వ దశకం నుంచి తెలంగాణ ఉద్యమ కాగడాను ఆరిపోకుండా భావజాల వ్యాప్తి చేసిన మహనీయుల్లో ముఖ్యులు. ఆయన స్మారకంగా తెలంగాణ ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన ఐసిఎస్ఎస్ఆర్ లైబ్రరీకి పేరు పెట్టాలనే డిమాండ్ వచ్చింది. మధుసూధన్ రెడ్డి బతికున్నప్పటి నుంచి ప్రతి యేటా శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు ఆయన పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పరంపరలో భాగంగానే సారు శిష్యులు తెలంగాణ ప్రభాకర్, ప్రొఫెసర్ లక్ష్మణ్, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు రాములు, ఆచార్య వినాయక్‌రెడ్డి, డా.హరనాథ్‌లు ఈ జయంతి సభను ఘనంగా నిర్వహించారు.

సభలో దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్, తెలుగు అకాడెమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, రామానంద తీర్థ యూనివర్సిటీ చైర్మన్ ఎన్.కిశోర్ రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకేశ్వర్లు, తెలంగాణ సాహిత్య అకాడెమీ పూర్వ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డా. సంగిశెట్టి శ్రీనివాస్, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు, అడ్వకేట్లు, పోలీసు అధికారులు, మధుసూధన్ రెడ్డి అభిమానులు, అనుయాయులు, కుటుంబ సభ్యులు సభలో పాల్గొన్నారు.

– సంగిశెట్టి శ్రీనివాస్,
m : 98492 20321
e : sangishettysrinivas@gmail.com







# సింథటిక్ జీవనశాస్త్రం – డార్విన్, ఊల్ఫ్‌సన్, మనమూ...

**1859**లో డార్విన్ జీవరాశుల పుట్టుక, పరిణామాల గురించి వివరిస్తూ 'ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్' అన్న పుస్తకం రాశాడు. అందులో డార్విన్ జీవజాతులు ఉద్భవించడాన్ని నేచురల్ సెలక్షన్ పరంగా వివరించాడు. ఆడ్రియన్ వూల్ఫ్‌సన్ 2026 జీవజాతుల భవిష్యత్తు ఏమిటి అనే ప్రశ్నతో ఆన్ ది ఫ్యూచర్ ఆఫ్ స్పీసిస్ ఆథరింగ్ లైఫ్ బై మీన్స్ ఆఫ్ ఆర్టిఫీషియల్ బయోలాజికల్ ఇంటిలిజెన్స్ అనే పుస్తకం రాశాడు. గత నాలుగైదు దశాబ్దాలుగా మనం జీవజాతుల అంతరింపు, జీవవైవిధ్యం నశింపు లాంటి మాటలు వింటున్నాం. పర్యావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల అనేక జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందనేది కూడా సత్యమే. ఇంతకాలమూ అంతరింపుల గురించి వింటూ వచ్చిన మనకు జీవరాశులను ఉద్భవింపజేయవచ్చు అనే మాట లేదా ఆలోచన ఎంతయినా ఆసక్తిని కలిగిస్తుంది.

ఉల్ఫ్‌సన్ పుస్తకం శీర్షికతోనే ఒక ఆలోచన కలిగించాడు. అలాగే భవిష్యత్ ప్రతిస్పందనను ప్రతిపాదించాడు. డార్విన్‌కాలం నాటికి మనిషి జీవాన్ని పరిశీలించే వ్యక్తి మాత్రమే. ఊల్ఫ్‌సన్ ఊహిస్తున్న లేదా ప్రతిపాదిస్తున్న భవిష్యత్తులో మనిషి జీవాన్ని రూపొందించే రచయితగా మారవచ్చు. ఒక కవి కవిత రాసినట్లు, ఒక రచయిత కథ లేదా నవల రాసినట్లుగా, మనిషి జీవజాతులను రాయవచ్చు అంటే సృష్టించవచ్చు.




ఈ పుస్తకంలోని ముఖ్యమైన, ఆసక్తికరమైన ప్రశ్న ఏమిటంటే. మనిషి గనుక కొత్త జీవ జాతులను సృష్టించగలిగినట్లైతే ఆ శక్తిని ఏ విధంగా ఉపయోగించాలి?

ఇప్పటికే మనం కృత్రిమ మేథ, డిఎన్ఏ సంశ్లేషణ, జీనోమ్ రచన, జీనోమ్ ఇంజనీరింగ్, సింథటిక్ బయాలజీ లాంటి పదాలు, భావనలు వాటి వాటి కార్యక్షేత్రాలు కలిసిపోతున్న నేపథ్యంలో ఈ ప్రశ్నకు ఎంతో ప్రాధాన్యం ఉందని రచయిత స్పష్ట పరిచాడు.

డి.ఎన్.ఎ. అనేది ఒక జీవి, ప్రాణి వారసత్వ సమాచారాన్ని ఒక చోట పోగుపరచిన పదార్థం కాదు. ఒక విధమైన భాషా వ్యవస్థ అది.

ఈ పుస్తకం అందుకు తగినట్లుగానే 'ది లాంగ్వేజ్ ఆఫ్ లైఫ్' అనే అధ్యాయంతో మొదలై 'ఏ మేనిఫెస్టో ఫర్ లైఫ్' అనే దానితో ముగుస్తుంది.

ఒక విధంగా ఈ పుస్తకంలో జీవాన్ని అధ్యయనం చేయటం, అర్థం చేసుకోవడం, మార్చడం, కొత్తగా రాయడం, కొత్త జీవాన్ని రూపుదిద్దటం అనే పరిణామక్రమంలో రచయిత చూపాడు. జీవితం / ప్రాణం అంటే ఇది కేవలం పరిణామం ద్వారా ఏర్పడే ప్రక్రియే కాకుండా మనిషి రూపకల్పనకు కూడా లోబడిపోయే వ్యవస్థగా మారుతుందా? అనేది ప్రశ్న.

పుస్తకంలో ఉన్న విశేషం, ప్రాధాన్యం గల అంశం ఏమంటే ABI ఆర్టిఫిషియల్ బయోలాజికల్ ఇంటెలిజెన్స్. అంటే ఇప్పటి దాకా ఈ కృత్రిమ మేథ, డొనాల్డ్ ట్రంప్ సూచన ప్రకారం సూపర్ ఇంటెలిజెన్స్ అనేది భాషలను, చిత్రాలను సమాచార నమూనాలను అర్థం చేసుకోవడంలో ముందుకొచ్చింది. కృత్రిమ మేధస్సుకు గల ఈ శక్తి సామర్థ్యాలను ఊర్ఫ్‌సన్ జీవశాస్త్రానికి విస్తరింపజేస్తాడు. కృత్రిమ మేధా జీవ శాస్త్రంలోని నియమాలను బాగా అర్థం చేసుకున్నట్లయితే.

DNA సంకేతం, AI విశ్లేషణ కలిస్తే – జీనోమ్ డిజైన్. ఇది డి.ఎన్.ఎ. సంశ్లేషణకు దారి తీస్తుంది. ఇది కొత్త బయలాజికల్ సిస్టమ్ అన్న ప్రక్రియ సాధ్యమవుతుంది అంటాడు.

నిజానికి ఈ పుస్తకంలోని అతి ముఖ్యమైన ప్రశ్న ఏమిటి అంటే ప్రకృతి, పరిణామం సృష్టించని జీవ రూపాలను మనిషి సృష్టించగలడా? సృష్టిస్తే ఏమవుతుంది. ఊల్ఫ్‌సన్ ఊహ ప్రకారం

భవిష్యత్తులో మానవుడు కొత్త సూక్ష్మజీవులను రూపొందించగలడు, నూతన జన్యువ్యవస్థలను నిర్మించగలడు. ఉపయోగకర జీవులను సృష్టించగలడు. అలాగే అంతరించి పోయిన జీవులను పునర్నిర్మించే ప్రయత్నం జరుపగలడు. మానవులకు వచ్చే వ్యాధులను నియంత్రించేందుకు కొన్ని కొత్త రతహా జన్యువులను తిరిగి నిర్వచించవచ్చు.

ఈ పుస్తకం జన్యువును తిరిగి రాయటం అనే విషయాన్ని బహు కోణాల నుంచి చర్చించింది. ఒక జన్యువును చదవటం అందులో పొరపాట్లను గుర్తించటం, పుస్తకంలోని అచ్చుతప్పులను గుర్తించినట్లు, తిరిగి ప్రూఫ్ రీడర్ ఎలాగైతే సరిచేస్తాడో అలాగే సరిచేయటం. అవసరాన్ని బట్టి తిరిగి రాయటం వల్ల.

కొన్ని జన్యు సంబంధవ్యాధులను అరికట్టవచ్చు. కొత్త మందులకు రూపకల్పన చేయవచ్చు. కృత్రిమ అవయవాలను వృద్ధి పరచవచ్చు. మనిషి ఆయుఃప్రమాణాన్ని పెంచవచ్చు. ఇలా చేయవచ్చును కనుకనే తొమ్మిదవ అధ్యాయం 'ఎండ్ ఆఫ్ ఇల్‌నెస్'. ఒక వ్యాధిని ఆసాంతం లేకుండా చేయడం ఇవన్నీ సాధ్యమేనంటుంది.

అయితే జన్యువులను రచించటం అనే చాప్టర్ మనలను అత్యంత సున్నితమైన పరిసరాల్లోకి తీసుకుపోతుంది. అసలు వ్యాధిని తొలగించగలమా? లేక మనిషిని మార్చాలా? మనిషిని మార్చటం అంటే జన్యుపరివర్తనను మార్చటం.

జన్యుపరివర్తనను మార్చటమంటే వ్యక్తిని ఎడిట్ చేయటం. మానవ శరీరంలోని ఏవో కొన్ని లక్షణాలను మనకు ప్రతికూలంగా ఉన్నాయని, అనుకూలం కావని మార్చగల సామర్థ్యం వస్తే ఇక సహజమైన మనిషి అనే భావనకు అర్థం ఏముంటుంది? అట్లాగే రాబోయే కాలంలో మానవులు తమ పిల్లల జన్యు లక్షణాలు ప్రత్యేకంగా ఉండాలని ఎంపిక చేసిన లక్షణాలతో కోరుకుంటే – ఈ సౌలభ్యం లేదా దీనిని అందుకోగల అవకాశం, ఆర్థిక స్థితి గతుల వల్ల కొందరికి ఉండి, మరికొందరికి లేకపోతే ఇటువంటి ప్రశ్నలు శాస్త్ర పరిధిని దాటి సామాజిక న్యాయం, సమానత్వం లాంటి సమస్యలు ముందుకొస్తాయి.

అయితే ఈ సింథటిక్ జీవశాస్త్రం ద్వారా కొన్ని కొత్త జీవులను సృష్టించడం వలన పర్యావరణానికి కొన్ని ప్రయోజనాలు కలుగవచ్చు. వాతావరణంలో మార్పునేపథ్యంలో కొత్త ఆహార వనరులను సమకూర్చుకోవడం వ్యర్థాలను మార్చే సూక్ష్మజీవులు లేదంటే పర్యావరణ సమస్యలను పరిష్కరించే జీవ వ్యవస్థలను రూపొందించుకోవచ్చు.

ఇక్కడ మరో ప్రశ్న మనముందుకు వస్తుంది. ఒక కృత్రిమ జీవి ప్రకృతిలోకి వస్తే దాని ప్రభావాలను మానవులుగా మనం పూర్తిగా నియంత్రించగలమా? దీనికి సమాధానం ఆ జీవి పర్యావరణ వ్యవస్థను రక్షించవచ్చు లేదంటే దానిని అస్థిరం చేయవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకునే ఊల్ఫసన్ సృష్టించే సామర్థ్యం ఎంత ఉన్ని సృష్టించిన దాని పరిణామాలను అంచనా వేయగల సామర్థ్యం ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తాడు. మనిషి ప్రకృతి సృష్టించిన జీవిని మార్చడం నుంచి, తానే కొత్త జీవిని సృష్టించే స్థాయికి మనిషి మరలుతున్నాడా? ఇదే ఎంతో ప్రాధాన్యం గల ప్రశ్న. ప్రకృతిని అర్థం చేసుకున్న మనిషి ప్రకృతిని మార్చడం మొదలు పెట్టాడు. ఈ పనిని నిరాటంకంగా చేస్తూనే ఉన్నాడు. జీవ పరిణామానికి వెలుపల నిలబడి దానిని పరిశీలించిన మనిషి, ప్రస్తుతం పరిణామ ప్రక్రియలో తానే ఒక రచయితగా ప్రవేశించడం గురించి ఎన్నో సామాజిక, తాత్విక ప్రశ్నలను వేస్తుంది పుస్తకం.

మనమందరం భవిష్యత్తులో మనిషి ఏమి చేయగలడనే ప్రశ్న కంటే, మనిషికి ఏమైనా శక్తి సామర్థ్యాలు వచ్చినప్పుడు అతను ఏమి చేయాలి? అనే ప్రశ్నాత్మక ఆలోచనను ఈ పుస్తకం ఇస్తుంది.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు




**మ**న **దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

## ఇంధన రంగంలో ఆత్మనిర్భరతకు ధీటైన మార్గం..!!

# @ ఇథనాల్ బ్లెండింగ్

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (E20) కలపడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజన్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కొంతమేరకు మైలేజీ తగ్గుతోందన్న మాట వాస్తవమేనని కేంద్ర ప్రభుత్వం ఓ వైపు అంగీకరిస్తూనే – పశ్చిమాసియా సంక్షోభం, పర్యావరణ హితం, రైతుల ప్రయోజనాల రీత్యా ఈ విధానంపై వెనక్కి తగ్గేదేలేదని చెబుతూ, మరోవైపు పెట్రోల్‌లో 100 శాతం (E100) ఇథనాల్ కలిపేందుకు అవసరమైన విధి విధానాలకు, నియమ నిబంధనలకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర ఉపరితల రవాణాశాఖా మంత్రి నితిన్ గడ్కరీ ఈ ఏడాది జూన్‌లో ప్రకటించడం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఇథనాల్ బ్లెండింగ్ సాధకబాధకాలను మనమూ తెలుసుకుందాం..!

**అసలు ఇథనాల్ బ్లెండింగ్ అంటే..!!**

సాధారణంగా చెరకు, మొక్కజొన్న లేదా వ్యసాయ వ్యర్థాల వంటి మొక్కల పదార్థాల నుండి లభించే జీవ ఇంధనాన్ని **ఇథైల్ ఆల్కహాల్ లేదా ఇథనాల్** అంటారు. ఈవిధంగా లభించిన ఇథనాల్‌ను ప్రధానంగా గ్యాసోలిన్ (పెట్రోల్) వంటి సాంప్రదాయ రవాణా ఇంధనాలతో కలపడాన్ని **ఇథనాల్ బ్లెండింగ్** (ఇథనాల్ మిశ్రమం) అంటారు. ఈ విధంగా కలపడం వల్ల ఏర్పడిన మిశ్రమాన్ని E-ఇంధనం అని అంటారు. ఇక్కడ E-తరువాత వచ్చే సంఖ్య ఆ మిశ్రమంలోని ఇథనాల్ శాతాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు E10లో 10% ఇథనాల్, 90% గ్యాసోలిన్ పెట్రోల్ ఉంటాయి.




**ఇథనాల్-రకాలు:** ఇథనాల్‌లో 4 రకాలు ఉంటాయి. వీటిని 1జీ, 2జీ, 3జీ (4జీ-జనరేషన్) అని వ్యవహరిస్తారు.

**i) ఫస్ట్ జనరేషన్-(1జీ):** ఈ విధానంలో ఆహార పదార్థాలుగా ఉపయోగించే చెరకు, మొక్కజొన్న, గోధుమల ద్వారా ఇథనాల్ ఉత్పత్తి జరుగుతుంది. ఈ పద్ధతి సాంకేతికంగా సరైనదే అయినప్పటికీ అంతిమ ఉత్పన్నాలుగా అత్యధిక కార్బన్, గ్రీన్ హౌస్ వాయువులు వెలువడతాయి. ఇది వాతావరణానికి అంత శ్రేయస్కరం కాదు.

**ii) సెకండ్ జనరేషన్-(2జీ):** ఈ విధానంలో ఆహారపదార్థాలు కాని జీవ పదార్థాలు అంటే వ్యవసాయ వ్యర్థాలు, వరి మొక్కల వ్యర్థాలు, వెదురు మొదలగు వాటి నుండి ఇథనాల్ ఉత్పత్తి చేస్తారు. ఈ పద్ధతి ద్వారా పంట వ్యర్థాలను మండించడం (Stubble burning), క్లిష్టమైన ఖరీదైన పద్ధతిలో వాటిని బయోమాస్‌గా మార్చడం వంటి సమస్యలు తగ్గుతాయి. ఫస్ట్ జనరేషన్ విధానంలో కంటే ఈ పద్ధతిలో గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు తక్కువగా వెలువడుతాయి.

**iii) థర్డ్ జనరేషన్-(3జీ):** ఈ విధానం "ఆల్గే"ను ఇథనాల్ ఉత్పత్తికి వినియోగిస్తారు. ఈ విధానంలో ఇథనాల్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దీనికోసం పంట భూములు, మంచినీరు అవసరం ఉండదు. కానీ ఇండియాలో ఇది పరిశోధన, అభివృద్ధి దశలో ఉంది. ఈ విధానంలో కర్బన ఉద్గారాలు తటస్థ స్థితిలో ఉంటాయి.

**iv) ఫోర్త్ జనరేషన్-(4జీ):** ఈ విధానంలో జన్యుమార్పిడి చేసిన పంటలు పదార్థాలను ఇథనాల్ ఉత్పత్తికి వినియోగిస్తారు. ఎక్కువ కార్బన్ నిల్వ కోసం ఈ విధానాన్ని ఉపయోగిస్తారు. ఇది ప్రస్తుతం సిద్ధాంత దశలోనే ఉంది. ఈ విధానం ద్వారా కార్బన్ రహిత స్వచ్ఛవాయువులు విడుదలవుతాయి.

**ఇథనాల్ మిశ్రమాలు-వినియోగించే విధానం:**

i) E10-ఇందులో 10% ఇథనాల్, 90% గ్యాసోలిన్ (పెట్రోల్) కలుపుతారు. దాదాపు అన్ని ఆధునిక వాహనాలకు దీనిని వాడుతారు. E15 (15%+85%) దీనిని 2001 తరువాత తయారైన వాహనాలలో వాడుతారు. E20 (20%+80%)2023 ఏప్రిల్ తరువాత తయారైన వాహనాల్లో మాత్రమే వాడాలి. E85 (85% ఇథనాల్+15% గ్యాసోలిన్), దీనిని ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో మాత్రమే వాడాలి. E100 (93% నుండి 95% ఇథనాల్ + 5% నుండి 7% గ్యాసోలిన్), భద్రత, సాంకేతిక కారణాలతో 100% ఇథనాల్ కాకుండా కొద్ది మొత్తంగా గ్యాసోలిన్ కలుపుతారు. దీనిని ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లోనే వాడాలి.

**భారత్ పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే కార్యక్రమం:**

పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే కార్యక్రమం (ఇథనాల్ బ్లెండెడ్

పెట్రోల్ (ప్రోగ్రాం–EBP) కింద వాహనాలలో ఉపయోగించే పెట్రోల్‌లో ఇథనాల్ కలిపి ఉపయోగించే విధానాన్ని కేంద్రప్రభుత్వం 2001లో పైలెట్ ప్రాజెక్ట్‌గా మొదలుపెట్టి, 2003లో అధికారికంగా ప్రారంభించి, 2006 నాటికి దేశ్యాప్తంగా విస్తరించింది. జాతీయ బయో ఇంధన విధానం–2018 కింద పనిచేస్తున్న ఈ కార్యక్రమాన్ని భారత పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వశాఖ నిర్వహిస్తోంది.

**లక్ష్యాలు**

- మనదేశం, దిగుమతి చేసుకునే ముడిచమురు మీద ఎక్కువగా ఆధారపడడాన్ని తగ్గించడం. హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించడం, వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్కెట్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందించడంగా చెప్పవచ్చు.
- 2025లో భారత్‌లో దేశవ్యాప్తంగా వాహనాలలో ఉపయోగించే పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలిపి విజయవంతంగా ఉపయోగించడంతో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించినట్లయింది. వాస్తవానికి 2030 నాటికి ఈ లక్ష్యాన్ని సాధించాలని భారత్ ముందు ఆశించింది. దాన్ని గడువుకన్నా ఐదేళ్ళ ముందే సాధించగలిగింది.

  2026 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా తప్పనిసరిగా 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (E20) మాత్రమే అమ్ముతున్నారు. దాంతో పాటుగా పెట్రోల్ "కనీస పరిశోధన ఆక్టెన్ నంబర్" (RON)95గా ఉండాలని ప్రభుత్వం తప్పనిసరి నిబంధన ప్రవేశపెట్టింది.
- భారత్‌లో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 2014లో 2 బి॥ లీటర్ల కంటే తక్కువకాగా, 2026 నాటికి అది భారీ ఎత్తున పెరిగి 20 బిలియన్ లీటర్లకు చేరుకుంది. దేశంలో కొంత మేరకు మాత్రమే E 20 పెట్రోల్ ఉపయోగించాలన్న లక్ష్యాలను ఇది భారీగా అధిగమించి అనూహ్య విజయం సాధించింది.
- దేశంలో పశుగ్రాసం, మిగులు ఆహారధాన్యాలు వంటివి ఎంత ఉన్నాయన్న సమాచారం ఆధారంగా వాటిలో ఇథనాల్ ఉత్పత్తికి ఎంత ఉపయోగించాలి అన్న విషయాన్ని జాతీయ బయో ఇంధన సమన్వయ కమిటీ నిర్ణయిస్తుంది.
- 2014–15 నుండి 2026 వరకు ఈబీపీ కార్యక్రమం కింద 1.90 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అయింది. 930 లక్షల మెట్రిక్ టన్నుల $CO_2$ ఉద్గారాలు తగ్గాయి. రైతులకు అదనంగా 1.60 లక్షల కోట్లకు పైగా ఆదాయం పెరిగింది.

**భారత్‌లో ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత:**

**i) ఇంధన భద్రత:** ఇండియా 88.5% కంటే ఎక్కువ ముడిచమురును దిగుమతుల ద్వారానే పొందుతోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వంటి అంతర్జాతీయ అలజడుల వల్ల మన దేశ ఇంధన భద్రత బలహీనపడే అవకాశం ఉంది. ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం (ఈబీపీ), ఇంధన అవసరాల కోసం ఇండియా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించి, స్వావలంబనను పెంపొందిస్తుంది.

**ii) దిగుమతి ప్రత్యామ్నాయం:** ఈబీపీ కార్యక్రమం, శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించి, విదేశీ మారక ద్రవ్య నిల్వలను పరిరక్షించుకోవడానికి సహాయపడుతుంది. E20 ఇథనాల్ వాడడం ద్వారా సాలీనా 4 బిలియన్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్లు అంచనా. ఇది నేరుగా కరెంట్ అకౌంట్ బ్యాలెన్స్‌ను మెరుగుపరుస్తుంది.

**iii) ఉద్గారాల నియంత్రణ:** ఇథనాల్ స్వచ్ఛంగా మండే ఇంధనం. స్వచ్ఛమైన పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ కలిపిన ఇంధనాలు $CO_2$ ఉద్గారాలను, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్లు మరియు పార్టిక్యులేట్ మ్యాటర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం E20 ఇథనాల్ వల్ల ద్విచక్ర వాహనాల్లో 50%, ఫోర్‌వీలర్స్‌లో 30% కార్బన్‌మోనాక్సైడ్ ఉద్గారాలు తగ్గాయి.

**iv) రైతుల ఆదాయం బలోపేతం:** ఈబీపీ కార్యక్రమం హామీతో కూడిన మార్కెట్ ద్వారా వివిధ పంటల (మొక్కజొన్న, వరి మొదలైనవి) సాగును ప్రోత్సహించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ కార్యక్రమం రైతులను 'ఊర్జదాతలు' (శక్తి ప్రదాతలు)గా మార్చింది. మొక్క జొన్న సాగు లాభదాయకతను పెంచి, చెరకు బకాయిల చెల్లింపునకు కూడా తోడ్పడింది.

**v) ఉద్యోగ కల్పన:** డిస్టిలరీల ఏర్పాటు, నిర్వహణ మరియు సరఫరా గొలుసుల వల్ల గ్రామీణ మరియు పాక్షిక పట్టణ మరియు పాక్షిక పారిశ్రామిక ప్రాంతాలలో లక్షలాది పర్యావరణ అనుకూల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఆసియా అభివృద్ధి బ్యాంక్ నివేదిక ప్రకారం ఈబీపీ కార్యక్రమం ఇండియాలో 1.8 కోట్ల గ్రామీణ ఉద్యోగాలను సృష్టించింది.

**vi) మెరుగైన పనితీరు:** మెరుగైన ఆక్టేన్ నెంబర్ ఇంజన్ పనితీరును మెరుగుపరుస్తుంది. పెట్రోల్‌కు 84.4 కాగా, ఇథనాల్ యొక్క ఆక్టేన్ నెంబర్ 108.5గా ఉండి, అధిక ఆక్టేన్ కలిగిన ఇంధనంగా నిలిచింది. E20 భారతీయ పెట్రోల్‌యొక్క ఎఫెక్టివ్ ఆక్టేన్‌ను 95కు పెంచి, ఆధునిక ఇంజన్‌లలో దహనాన్ని మెరుగుపరిచింది. E20 ఇథనాల్ వాడే వాహనాలు సున్నితమైన పనితీరు మరియు తక్కువ ఉద్గారాలను వెలువరిస్తాయి.

**vii) అంతర్జాతీయ స్థాయి ఉత్తమ విధానాలకనుగుణంగా:** ఇథనాల్ మిశ్రమం ఇండియాకు మాత్రమే ప్రత్యేకమైనది కాదు. యూఎస్‌ఏ E10తో ప్రారంభమై E15దిశగా విస్తరిస్తోంది. ఇథనాల్ రంగంలో ప్రపంచ అగ్రగామి అయిన బ్రెజిల్ E27తప్పనిసరి చేసి, దీనిని 30%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇండియా E20 (పెట్రోల్ 20% ఇథనాల్ కలపడం) లక్ష్యాన్ని 2030 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకొని 2025–26 నాటికే సాధించడం ఇండియాను ఇంధన వ్యూహంలో అగ్రదేశాల సరసన నిలబెట్టింది.

**ఈబీపీ కార్యక్రమం - సవాళ్ళు:**

i) **వాహనాల అనుకూలత మరియు వినియోగదారుల ఆందోళనలు:** ఈబీపీ కార్యక్రమం ప్రారంభించే ముందే వాహనాల అనుకూలతను కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌ను వినియోగించడమే ప్రధానం అన్న రీతిలో ముందుకెళ్ళడంతో పాతవాహనాల ఇంజన్లు దెబ్బతింటున్నాయి. మరియు మైలేజ్ కూడా తగ్గుతోందని వినియోగదారులు ఆందోళన చెంతున్నారు. ఇండియాలో వాహన యజమానులకు వేర్వేరు ఇంధనాలను ఎంచుకునే అవకాశం కూడా లేదు. ఈబీపీ కార్యక్రమానికి అనుగుణంగా వాహనాలను అప్‌గ్రేడ్ చేయడం ఒక పెద్ద సవాలుగా చెప్పవచ్చు.

ii) **తక్కువ శక్తి సాంద్రత:** ఇథనాల్‌కు తక్కువ కెలోరిఫిక్ విలువ ఉంటుంది. అంటే ఒక లీటర్ స్వచ్ఛమైన పెట్రోల్‌తో పోలిస్తే, ఇథనాల్‌కు తక్కువ శక్తి ఉంటుంది. ఫలితంగా వాహనాల మైలేజ్ తగ్గుతుంది.

iii) **రవాణా మరియు నిల్వ:** ఇథనాల్‌ను సాధారణ పెట్రోల్‌లాగా నిర్వహించలేము. ఇది నీటిని సులభంగా గ్రహిస్తుంది. కాబట్టి ఎల్లప్పుడూ స్వల్ప మొత్తంలో తేమను కలిగి ఉండే ప్రస్తుత భూగర్భ పెట్రోలియం పైప్‌లైన్‌ల ద్వారా దీనిని రవాణా చేయలేము. ఈ విధంగా రవాణా మరియు నిల్వ సదుపాయాలకవసరమైన మౌళిక వసతుల కల్పన ఒక పెద్ద సవాలుగా మారనుంది. వినియోగ అవసరాల కన్నా, మిశ్రమ ఇంధనాలు నిల్వ చేసుకునే మౌళిక వసతుల విషయంలో ఇండియా చాలా వెనుకబడి ఉంది.




iv) **చెక్కెర మిల్లులకు ఆర్థిక స్థిరత్వం లేకపోవడం:**

బయోఫ్యూయల్ ప్లాంట్లలో పెట్టుబడులు పెట్టడానికి చెక్కెర మిల్లులకు ఆర్థికస్థిరత్వం లేకపోవడం, మరియు అవి కొన్ని నిర్దిష్ట ప్రాంతాలలోనే అధికంగా కేంద్రీకృతమై ఉండడం, ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం వేగవంతం కాకపోవడానికి ఒక ముఖ్య సవాలుగా చెప్పవచ్చు.

v) **రాష్ట్రాల మధ్య రవాణాకు అడ్డంకులు:** దేశవ్యాప్తంగా ఇథనాల్ రవాణా సజావుగా జరిగేలా చూసేందుకు కేంద్రప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి మరియు నియంత్రణ చట్టాన్ని సవరించింది. కానీ కేవలం 14 రాష్ట్రాలు మాత్రమే ఈ సవరించిన నిబంధనలు అమలు చేశాయి. ఫలితంగా మిశ్రమానికి అవసరమైన దానికంటే ఎక్కువ ఇథనాల్‌ను ఉత్పత్తి చేసే రాష్ట్రాలు, ఆ ఇథనాల్‌ను ఇతర రాష్ట్రాలకు రవాణా చేయలేకపోతున్నాయి.

vi) **ఆహారభద్రతపై ప్రభావం:** వరి వంటి ఆహార పంటలను ఇథనాల్ ఉత్పత్తికోసం మళ్లించడం, భారతదేశ ఆహార మరియు పోషకాహార భద్రతా లక్ష్యాలకు ఆటంకం కలిగిస్తుంది. ఉదా॥ 2022లో ఎఫ్‌సీఐ నిల్వల నుండి మానవ వినియోగానికి యోగ్యమైన దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇథనాల్ ఉత్పత్తి కోసం రాయితీ ధరలకు విక్రయించారు. చెరకును ఇతనాల్ కొరకు వాడడం వల్ల తెల్ల చెక్కెర ఉత్పత్తి తగ్గి దేశీయ మార్కెట్‌లో చెక్కర ధర విపరీతంగా పెరిగి Food us Fuel సంఘర్షణ తలెత్తుతోంది.

vii) **వ్యవసాయ భూమి మళ్ళింపు:** మిశ్రమ లక్ష్యాన్ని అధికంగా నిర్దేశించడం వల్ల, ఆహార పంటలు పండించడానికి వినియోగించే వ్యవసాయ భూమిని చెరకు మొక్క జొన్న లేదా నూనె గింజల వంటి జీవ ఇంధన ముడి పదార్థాల సాగుకు మళ్లించే అవకాశం ఉంది. అలాగే ఇథనాల్ కోసం మొక్కజొన్న సాగు పెరగడం వల్ల పప్పు ధాన్యాలు మరియు నూనె గింజల సాగు భూమి తగ్గిపోతుంది. దీనివల్ల నిత్యావసర వస్తువుల కోసం మనదేశం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుంది.

viii) **అధికనీటి వినియోగం:** వరిలాంటి పంటల నుండి ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి అధిక నీరు అవసరమవుతుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం వరి నుండి 1 లీటరు ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి సుమారు 10.790 లీ॥ నీరు అవసరమవుతుంది. ఈ నీటిలో అధిక భాగం వ్యవసాయ అవసరాలకు వినియోగించే నీరే ఉంటుంది. దీనివల్ల వ్యవసాయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఎక్కువ ఇథనాల్ ప్లాంట్లు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి నీటి కొరత అధికంగా ఉన్న రాష్ట్రాలలోనే నెలకొని ఉండడం సమస్య తీవ్రతను మరింత పెంచుతోంది.

ix) **నేల ఆరోగ్యంపై ప్రభావం:** జీవ ఇంధన ముడి పదార్థాల కోసం వరి, చెరకు వంటి ఒకే పంటను పదేపదే సాగు చేయడం వల్ల నేలలోని పోషకాలు నశించి, నేలలు నిస్సారంగా మారతాయి.

x) **వ్యవసాయ పంటల దిగుమతిలో పెరుగుదల:** పౌల్ట్రీ మరియు పాడిపరిశ్రమ రంగాలు మేతకోసం మొక్కజొన్నపై ఎక్కువగా ఆధారపడుతాయి. ఇథనాల్ ఉత్పత్తి కోసం మొక్కజొన్న అధికంగా ఉపయోగించడం వల్ల మొక్కజొన్న ధరలు పెరిగాయి. ఇది పరోక్షంగా పశుగ్రాసం ధరలను పెంచి పాడి మరియు పౌల్ట్రీ రైతులపై ఆర్థికంగా ప్రతికూల ప్రభావం చూపిస్తోంది.

**ప్రపంచ వ్యాప్తంగా విభిన్న దేశాలు అనుసరిస్తున్న విధానాలు:**

**1. బ్రెజిల్:** ఇథనాల్ వాడకంలో బ్రెజిల్ ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఉంది. E27 ను ప్రామాణిక పెట్రోల్ మిశ్రమంగా తప్పనసరి చేసింది. దీనిని 35% పెంచాలని లక్ష్య నిర్దేశం చేసుకున్నారు. బ్రెజిల్ ఒకేసారి కాకుండా 1930ల నుంచి మొ॥ పెట్టి 1970 అరబ్-ఇజ్రాయిల్ యుద్ధం తరువాత **Proal Cool** అనే పథకం ద్వారా ఇథనాల్ వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. అదే విధంగా ఇథనాల్ వాడకం పైనే దృష్టి పెట్టకుండా ఆటో మొబైల్ పరిశ్రమను సమన్వయం చేస్తూ దేశంలోని 90% వాహనాలను ఫ్లెక్స్‌ఫ్యూయల్ వాహనాలుగా మార్చింది. పాత సాంకేతికత కలిగిన వాహనదారులు నష్టపోకుండా కూడా బ్రెజిల్ తగు జాగ్రత్తలు తీసుకుంది.

**2. యూఎస్ఏ:** అమెరికాలో E10 అనేది దేశవ్యాప్తంగా

ప్రామాణిక ఇథనాల్ మిశ్రమ ఇంధనం. అమెరికా ప్రభుత్వ మద్దతుతో E15 దిశగా ఇథనాల్ కార్యక్రమం విస్తరిస్తోంది. ఇప్పటికే సింహభాగం వాహనాలు ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలుగా రూపాంతరం చెందాయి. ఇవి E85 లాంటి అధిక మిశ్రమ ఇంధనంతో కూడా నడవ గలవు.

**3. ఫ్రాన్స్:** కాలుష్యాన్ని తగ్గించడానికి మరియు ఇంధన ఖర్చుల నుండి ప్రజలకు ఉపశమనం కలిగించడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం పెట్రోల్ కార్లను ఇథనాల్ కార్లుగా మార్చే సాంకేతికతను ప్రోత్సహిస్తోంది. సాధారణ పెట్రోల్ కార్ల బానెట్ కింద ఒక చిన్న ఎలక్ట్రానిక్ కిట్‌ను అమర్చవచ్చు. దీన్నే E85 కన్వర్షన్ కిట్ అంటారు. దీంతో సాధారణ పెట్రోల్ కార్లు E85 ఇథనాల్ ఇంధనంతో సులభంగా నడుస్తాయి ఈ కిట్‌ను కొనుగోలు చేయడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది.

**4. యూరోపియన్ యూనియన్:** చాలా సభ్యదేశాలు E5 లేదా E10ను ప్రామాణిక ఇంధనంగా వినియోగిస్తున్నాయి. 2033 నాటికి సగటు మిశ్రమరేటు సుమారు 8.2% ఉంటుందని అంచనా.




**ఇథనాల్ బ్లెండింగ్‌ను ప్రోత్సహించడానికి చేపట్టాల్సిన చర్యలు:**

i) **దశలవారీ రోడ్ మ్యాప్:** కేవలం 2-3 సం॥ల వ్యవధిలోనే ఇండియా E10 నుండి E20 హడావుడిగా దూసుకెళ్ళింది. దీనివల్ల ఆటోమొబైల్ రంగానికి, వాహన యజమానులకు తగినంత సమయం దక్కలేదు. అలా కాకుండా బ్రెజిల్‌లాగా స్పష్టమైన మైలురాళ్ళతో కూడిన దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాలి.

ii) **వాహన అనుకూలత:** వాహనాలు అధిక ఇథనాల్ మిశ్రమాలకు అనుకూలంగా ఉండేలా చేసుకోవడానికి ప్రభుత్వం, చమురు కంపెనీలు, ఆటోమొబైల్ పరిశ్రమల మధ్య నిరంతర సమన్వయం అవసరం. ఫ్లెక్స్‌ఫ్యూయల్ వాహనాల (FFV) ఉత్పత్తిని పరిశ్రమలు వేగవంతం చేయాలి. వీటి కొనుగోలుకు ప్రభుత్వం వాహన కొనుగోలు దారులకు రాయితీలు ఇవ్వాలి.

iii) **వినియోగదారులకు అవగాహన:** మైలేజీ తగ్గిపోవడం మరియు ఇంజిన్ దెబ్బతినడం లాంటి నిరంతర ఆందోళనలను ప్రభుత్వం మరియు ఆటోమొబైల్ సంస్థలు స్పష్టమైన, స్థిరమైన సమాచారంతో పరిష్కరించాలి.

iv) **విభిన్న ధరల విధానం:** ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ వల్ల కొద్దిగా మైలేజ్ తగ్గుతుందని కేంద్రప్రభుత్వం అంగీకరించింది. ఇందు కొరకు E20 మరియు భవిష్యత్‌లో రాబోయే అధిక మిశ్రమ ఇంధనాల ధరను స్వచ్ఛమైన పెట్రోల్ ధర కంటే కొద్దిగా తక్కువగా నిర్ణయించాలి. తద్వారా మైలేజీలో వచ్చే స్వల్ప తగ్గుదలను వినియోగదారులకు నష్టపరచకుండా నివారించవచ్చు.

v) **రవాణా మరియు నిల్వ సౌకర్యాలను మెరుగు పరచడం:** ఇథనాల్‌ను ఉత్పత్తి కేంద్రాల నుండి బ్లెండింగ్ యూనిట్లకు సమర్థవంతంగా తరలించడానికి రవాణా సౌకర్యాలను, పెరిగిన ఇథనాల్ డిమాండ్‌ను తట్టుకోవడానికి మరిన్ని నిల్వ సదుపాయాలు అవసరం.

vi) **'ఫ్లెక్స్' ఫ్యూయల్ వాహనాలకు ప్రోత్సాహకాలు** E30 తో పాటు E85 మరియు E100 వంటి అధికశ్రేణి మిశ్రమాలను వినియోగించడమే లక్ష్యంగా బహుళ గ్రేడ్ ఇంధన వ్యవస్థను సృష్టించడం ప్రధానలక్ష్యం కావాలి. అధిక శ్రేణి మిశ్రమ ఇంధనాలను వినియోగించుకునేందుకు ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు తయారు చేయాలి. ఇందు కొరకు ప్రభుత్వం ఆటోమొబైల్ కంపెనీలకు జీఎస్టీ మినహాయింపులతో పాటు, రోడ్డు పన్ను ప్రోత్సాహకాలు, ఫ్రాన్స్‌లో మాదిరిగా రెట్రోఫిట్టింగ్ కిట్‌లను అందుబాటులోకి తేవాలి.

vii) **ధాన్యం ఆధారిత డిస్టిలరీల పెరుగుదల:** నీతిఆయోగ్ రూపొందించిన ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్య సాధ్య రోడ్‌మ్యాప్ ప్రకారం ఇండియా ధాన్యం ఆధారిత డిస్టరీల సామర్థ్యాన్ని 258 కోట్ల నుండి 740 కోట్ల లీటర్లకు పెంచడానికి పెట్టుబడి పెట్టాలి.

viii) **వడ్డీ రాయితీ కార్యక్రమాలు:** కొత్త డిస్టిలరీల స్థాపన మరియు ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం కోసం వడ్డీ రాయితీ పథకాలను అందించాలి.

ix) **సరఫరా గొలుసును క్రమబద్ధీకరించడం:** ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, డిస్టిలరీలతో మరిన్ని దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవాలి. సరఫరా గొలుసును క్రమబద్ధీకరించడానికి ఇథనాల్ యొక్క అంతరాష్ట్ర రవాణాను సులభతరం చేయాలి.

x) **చెరకుతో పంటమార్పిడి పద్ధతిలో మొక్కజొన్న సాగును ప్రోత్సహించడం:** మొక్కజొన్నకు ఎక్కువనీరు అవసరం లేదు. అయితే ఇది నేల సారాన్ని తగ్గిస్తుంది. నేల సారం తగ్గకుండా ఉండేందుకు దీనిని చెరకుతో పంట మార్పిడి పద్ధతిలో సాగుచేయాలి.

xi) **ఇంధన ఇథనాల్ ధరల పెంపు:** ఇంధన ఇథనాల్ ధరలను పెంచడం వల్ల దానిని మద్యం వినియోగం వైపు మళ్ళించడాన్ని తగ్గించవచ్చు.

**చివరగా:** ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా శిలాజ ఇంధన దిగుమతులను తగ్గించి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ఎంత ముఖ్యమో - వినియోగదారుల హక్కులు, వాహనాల భద్రత మరియు సరసమైన ధరలకు కూడా అంతే ప్రాధాన్యమివ్వాలి. బ్రెజిల్ అనుసరించిన వినియోగదారుల కేంద్రీకృత, దశలవారీ విధానాన్ని (Consumer centric & phased Approach) ఆదర్శంగా తీసుకుని విలువైన పాఠాలు గ్రహిస్తే ప్రజా మద్దతుతో మన దేశంలో కూడా ఈ "హరిత ఇంధన విప్లవం" అద్వితీయ విజయం సాధిస్తుందన్న విజ్ఞుల మాటలు అక్షర సత్యాలు.

-పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047, e : obu.jmd@gmail.com




# టంగ్స్టన్ మూలకం యొక్క ఖనిజాలు

**టం**గ్స్టన్ కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలు మన దేశంలో ప్రస్తుతం మన అవసరాలకు సరిపడా లేనందువల్ల ఎక్కువ శాతం ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవలసి వస్తున్నది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ ఖనిజాన్వేషణ విస్తృతంగా ప్రభుత్వ, ప్రైవేటు ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల ద్వారా జరుపుతున్నారు.

టంగ్స్టన్ మూలకం యొక్క కెమికల్ సింబల్ 'W' మరియు దాని అటమిక్ నంబర్ 74. ఇదిస్టీల్ గ్రే రంగులో ఉంటుంది. ఈ మూలకం రిఫ్రాక్టరీ మెటల్‌గా గుర్తింపబడినది. దీని నామకరణం స్వీడన్ భాషలో నుండి వచ్చినది. దీని ముఖ్యమైన ఓర్ వోల్‌ఫ్రమైట్ మరియు దీనికున్న ముఖ్యమైన క్యారెక్టర్ "చాలా ఎక్కువ మెల్‌టింగ్ పాయింట్" ఉండటం వల్ల ఎక్కువ ప్రాముఖ్యత కలిగింది. దీనికి అదనంగా ఎక్కువ వేడిని తట్టుకునే ప్రాపర్టీ ఉండడం వల్ల దీని ఉపయోగం హైటెంపరేచర్ అప్లికేషన్స్‌లో జరుగుతున్నది.




టంగ్స్టన్ చాలా ఓర్స్‌లో దొరుకుతుంది. కానీ ముఖ్యమైన ఖనిజాలు వోల్‌ఫ్రమైట్ మరియు శీలైట్. టంగ్స్టన్ యొక్క ప్యూర్ ఫార్మ్‌ని ఎలక్ట్రికల్ పరికరాలలో ఉపయోగిస్తారు. దీని కంపౌండ్స్, అల్లాయన్ చాలా వాటిలో ఉపయోగిస్తారు. అందులో ప్రముఖమైనవి బల్బుల ఎలక్ట్రికల్ ఫిల్‌మెంట్స్ కొరకు ఇవి కాకుండా X-రేయ్స్ ట్యూబ్స్, సూపర్ అల్లాయన్ మరియు గ్లాస్‌టూ మెటల్ సీల్స్‌లో టంగ్స్టన్ యొక్క డెన్సిటీ, హార్డ్‌నెస్ క్యారెక్టర్ వల్ల దీనిని మిలటరీలో ఆర్మర్ పీయర్సింగ్ ఆర్డిలరీలో ఉపయోగిస్తారు. దీనిని మెషిన్ టూల్స్‌లో కూడా ఉపయోగిస్తారు.



ల్యూకో గ్రానైట్



పెగ్మా టైట్

టంగ్స్టన్ పృథ్విలో సహజంగా ప్యూర్ మెటల్ రూపంలో దొరకదు. ఇది వేరే మూలకాలతో కలిసి ఖనిజాలలో మరియు ఓర్స్‌లో దొరుకుతుంది. దీని యొక్క సహజమైన ఓర్స్ ముఖ్యంగా వోల్‌ఫ్రమైట్, శీలైట్, కొంత వరకు స్టోల్‌జైట్.

వోల్‌ఫ్రమైట్ - ఐరన్ - మాంగనీస్ టంగ్స్టేట్ ఖనిజం.

శీలైట్ - కాల్షియం టంగ్స్టేట్ ఖనిజం. ఇది అల్ట్రా వాయిలెట్ లైట్ గ్లో అవుతుంది.

వేరే ఖనిజాలు చిన్న మొత్తంలో స్టోల్‌జైట్, హుబ్నరైట్ మరియు ఫెర్‌బరైట్‌లో దొరుకుతుంది.




ప్రపంచంలో చైనా 80 శాతం టంగ్స్టన్ నిక్షేపాలు కలిగి యున్నది. మరియు మేజర్ ప్రొడ్యూసర్. టంగ్స్టన్ ప్రొడ్యూస్ చేసే వేరే దేశాలు వియేట్ నామ్, రష్యా, బొలివియా కజ్జిస్తాన్ మరియు రవాండా. టంగ్స్టన్ ఓర్ డిపాజిట్లు ముఖ్యంగా హైడ్రో థర్మల్ లేదా మాగ్మాటిక్ ఓరిజిన్‌తో ఫెల్‌సిక్ ఇంగ్నియస్ ఇన్‌రటూషన్స్‌తో అసోసియేట్ అయి ఉంటవి.

గ్లోబల్ టంగ్స్టన్ ప్రొడక్షన్ 25,000 టన్స్. 2025 సంవత్సరంలో ఇందులో 34 శాతం టంగ్స్టన్ రిచ్ స్క్రాప్ నుండి రీ సైకిల్ చేసి తీయబడినది. టంగ్స్టన్‌ను బయోలాజికల్‌గా కూడా ఉపయోగిస్తారు. దీన్ని కొన్ని బ్యాక్టీరియాలు మరియు ఆర్కియాలో వాడతారు. ఉదాహరణకు ఆక్సిడోరిడ క్ టే సేస్ అనే ఎన్‌జైమ్‌లో ఉపయోగిస్తారు. కార్బోలిక్ ఏసిడ్స్‌ను ఆల్డిహైడ్స్‌కు రెడ్యూస్ చేయటానికి ఈ మధ్య టంగ్స్టన్ జ్యువెలరీస్‌లో వాడటం మరియు పాప్యులర్ కావడం వల్ల పలు ప్రముఖ స్టోర్స్‌ల్లో దొరుకుతుంది.

మన దేశంలో టంగ్స్టన్ ముఖ్యంగా కర్ణాటకా, రాజస్థాన్ మరియు ఆంధ్రప్రదేశ్‌లో దొరుకుతుంది. కర్ణాటకాలో మన దేశం యొక్క 42 శాతం టంగ్స్టన్ రిసోర్స్ కలదు. రాజస్థాన్‌లో 27 శాతం రిసోర్స్ కలదు. ముఖ్యంగా చారిత్రాత్మక మైనింగ్ సైట్ డెగానీ అనే ప్రాంతం, నాగౌర్ జిల్లాలో ఆంధ్రప్రదేశ్‌లో 17 శాతం రిసోర్స్ ప్రముఖ ఎక్స్‌ప్లోరేశన్ బ్లాక్స్‌లో తూర్పుగోదావరి జిల్లాలో బూరుగుబండా - తపనికొండ బెల్ట్‌లో మరియు కొంత శ్రీ సత్యసాయి జిల్లాలో.

మహారాష్ట్రలో 9 శాతం రిసోర్స్ ముఖ్యంగా కోబ్నా-కుహి బెల్ట్‌లో. ఒక 5 శాతం రిసోర్స్ తమిళనాడు, హర్యాణ, ఉత్తరాఖండ్ మరియు పశ్చిమ బెంగాల్‌లో దొరుకుతుంది.

మనదేశంలో ఎస్టిమేటెడ్ టంగ్స్టన్ రిజర్వ్స్ 87.39 మిలియన్ టన్స్‌లో $Wo_3$ కంటెంట్ గల రిజర్వు 142, 094 టన్స్‌గా నిర్ధారించబడినది.

టంగ్స్టన్ ముఖ్యంగా పెగ్మటైట్స్‌లో క్వార్ట్జ్‌లో, గ్రానైట్స్‌లో, షీలైట్‌లో ఎల్లూవియల్స్‌లో శాలైట్‌తో కూడిన గోల్డ్ ఓర్స్‌లో అసోసియేట్ అయి ఉంటుంది. ముఖ్యంగా టంగ్స్టన్ స్కార్న్స్‌లో, గ్రీసెన్స్‌లో, ప్లూటోజెనిక్ మరియు వాల్కనొజెనిక్ హైడ్రోథర్మల్ డిపాజిట్స్‌లో ప్లేసర్స్‌లో దొరుకుతుంది. గ్రానైట్ రిలేటెడ్ డిపాజిట్స్ ముఖ్యంగా మాగ్మాటిక్ డిస్సెమినేశన్స్ పెగ్మాటైట్స్, పార్ఫిరీస్ మరియు వీన్స్ రూపంలో వేరే మూలకాలతో కూడి ఉంటుంది. ఉదాహరణకు టిన్ మాలిబ్డినం, టాంటలమ్, బిస్మత్ వగైరా. మన అవసరాలకు సరిపడా నిక్షేపాలు లేనందువల్ల కేంద్ర ప్రభుత్వ దీన్ని క్రిటికల్ మినరల్‌గా నోటిపై చేసి దీనికై అన్వేషణను విస్తృతం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎక్స్‌పోరేషన్ ఏజెన్సీల ద్వారా అన్వేషణ కొనసాగిస్తున్నారు.

- కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com






# తెలంగాణ సమాజాన్ని జాగృతం చేస్తున్న దక్కన్‌ల్యాండ్

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట సమయంలో అవిర్భవించిన దక్కన్‌ల్యాండ్ తెలుగు మాసపత్రిక 14 వసంతాలు పూర్తిచేసుకుందని తెలిసి సంతోషంగా ఉంది. నిర్విఘ్నంగా ఇప్పటివరకు 169 సంచికలు తీసుకురావడం వెనుక, పత్రిక సంపాదకులు, మణికొండ వేదకుమార్ గారి కృషి అభినందనీయం. తెలంగాణ చరిత్ర ఈ ప్రాంత ప్రత్యేకతలు తెలిపే అనేక వ్యాసాలు ఉన్న మాస పత్రికలు, 14 వార్షిక సంచికలు పాఠకుల కోరిక మేరకు బైండింగ్ చేసి ఉద్యోగార్ధులకు ఒక రిఫరెన్స్‌గా ఉండే ఈ సంకలనాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను.



తెలంగాణకు రావలసిన నికరజలాల నిగ్గు తేల్చి మన రైతులకు రావాల్సిన సాగునీటి కోసం, ఇక్కడి నిరుద్యోగులకు దక్కాల్సిన ఉద్యోగాల కోసం పోరాడిన మహానుభావుల గురించి ఈ మాస పత్రికలో అనేక వ్యాసాలు ప్రచురితమై తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయడంలో చేసిన కృషి అభినందనీయం.

తెలంగాణ పునర్నిర్మాణంలో తెలంగాణచరిత్ర, వారసత్వం, పురాతనకట్టడాలు, ధర్శనీయప్రదేశాల వెనుక దాగివున్న నిజాలు, శాస్త్ర విజ్ఞాన సముపార్జనకు ఎంతగానో తోడ్పడే అనేక అంశాలను "దక్కన్‌ల్యాండ్"లో పాఠకులకు అందించిన తీరు, మరే యితర మాసపత్రిక దీనికి తోడు రాదు. పత్రిక నిర్వాహకులు, సంపాదకులు, వేదకుమార్ గారిని మరోసారి మనసార అభినందిస్తున్నాను.


K. SREENIVAS REDDY
CHAIRMAN
Media Academy of Telangana

H.No. 5-9-166, Chapel Road
Nampally, Hyderabad - 500001.
Telangana.
Mobile: 9490952240
E-Mail: kalimekolans@gmail.com

**సందేశం**

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట సమయంలో ఆవిర్భవించిన దక్కన్ ల్యాండ్ తెలుగు మాసపత్రిక 14 వసంతాలు పూర్తిచేసుకుందని తెలిసి సంతోషంగా ఉంది. నిర్విఘ్నంగా ఇప్పటివరకు 159 సంచికలు తీసుకురావడం వెనుక, పత్రిక సంపాదకులు, మణికొండ వేద కుమార్ గారి కృషి అభినందనీయం. తెలంగాణ చరిత్ర ఈ ప్రాంత ప్రత్యేకతలు తెలిపే అనేక వ్యాసాలు ఉన్న మాస పత్రిక, 14 వార్షిక సంచికలు కలిపి పాఠకుల కోరిక మేరకు బైండింగ్ చేసి ఉద్యోగార్ధులకు ఒక రిఫరెన్స్ గా ఉండే ఈ సంకలనాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను.

తెలంగాణకు రావలసిన నికరజలాల నిగ్గు తేల్చి మన రైతులకు రావాల్సిన సాగునీటి కోసం, ఇక్కడి నిరుద్యోగులకు దక్కాల్సిన ఉద్యోగాల కోసం పోరాడిన మహానుభావుల గురించి ఈ మాస పత్రికలో అనేక వ్యాసాలు ప్రచురితమై తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయడంలో చేసినకృషి అభినందనీయం .

తెలంగాణ పునర్నిర్మాణంలో తెలంగాణచరిత్ర, వారసత్వం, పురాతనకట్టడాలు, దర్శనీయప్రదేశాల వెనుక దాగివున్న నిజాలు, శాస్త్ర విజ్ఞాన సముపార్జనకు ఎంతగానో తోడ్పడే అనేక అంశాలను "దక్కన లాండ్ " లో పాఠకులకు అందించిన తీరు, మరే యితర మాసపత్రిక దీనికి తోడు రాదు. పత్రిక నిర్వాహకులు, సంపాదకులు, వేదకుమార్ గారిని మరోసారి మనసార అభినందిస్తునాను.

(కే శ్రీనివాసరెడ్డి)

**-కే శ్రీనివాసరెడ్డి**

# హైదరాబాద్ చిరునామా

హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల సంస్కృతిలోనే ఎంతో గొప్ప నేపథ్యం గల దక్కన్ చరిత్ర, సాహిత్యం, సమాజం దాగి ఉంది. భాగ్యనగరానికి తలమానికం చార్మినార్, గోల్కొండ, గండిపేట, మూసీనదుల చుట్టూ ఉన్న చరిత్ర, సాహిత్యం, కట్టడాలు, ఖనిజాలు. ఆ వైభవాన్ని తిరిగి ప్రపంచానికి పరిచయం చేస్తూ, దక్కన్‌లో భాగమైన తెలంగాణనే కాక, రెండు తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక, కళారూపాలకి ఆదరణని ఇస్తూ, ప్రోత్సాహాన్ని ఇచ్చే పత్రిక దక్కన్‌ల్యాండ్ అనడంలో సందేహం లేదు. వేదకుమార్ గారి సంపాదకత్వం, పర్యవేక్షణలో వెలువడుతున్న మాసపత్రికలు బాల చెలిమి, దక్కన్‌ల్యాండ్. గత పదేళ్లుగా దక్కన్‌ల్యాండ్ పత్రిక పాఠకురాలినే కాదు. దక్కన్ సాహిత్యాభిమానిని.



దక్కన్ ల్యాండ్ పత్రిక నా తెలంగాణ పచ్చిపులుసు రుచిని, రాచిప్పలో చూపిస్తది. చరిత్రను ఒడిసి పట్టిన తేజో మూర్తి వెంకట్ గౌడ్‌తో ముచ్చట పెట్టిస్తది. కథలకి ముసలితనం లేదంటూ రావిశాస్త్రిని, శ్రీశ్రీని హాజర్ హై అంటూ తీసుకొస్తది. ఆర్కియాలజీ శీర్షికన కుర్యాల శాసనం, కృష్ణాతీరంలో మరుగున పడిన బృహత్ శిలాయుగపు శిథిలాల గాథలు వినిపిస్తది. ముద్రణ అంతగా అందుబాటులోకి రానప్పుడు ఇసుకలో అక్షరాలు దిద్ది, పెద్దబాల శిక్ష వల్లెవేసి, అమరాన్ని అవపోసన పట్టిన పండితుల పాటవాన్ని పాడుతుంది. మట్టితోనే మనిషి మనుగడ అంటూ మనిషికి మట్టితో అనుబంధాన్ని, పురాతన కట్టాడాలను పదిలపరుస్తుంది. మనం మరుస్తున్న కాపీరైటర్, నఖల్ నవీస్, వ్రాయసగాండ్ల కథలను తెలియజేస్తది. బహుభాషా వారసత్వం, అనేక సంస్కృతులను ఆదరించి మనదిగా చేసుకునే దక్కన్ పీఠభూమి గొప్పతనాన్ని నలుదెసల చాటే మేటి దక్కన్ ల్యాండ్. ఎంత చెప్పినా తరగని తెలుగు భాషా, సాంస్కృతిక, చారిత్రక, వైజ్ఞానిక పత్రిక. దీనిని విద్యార్థుల పోటీ పరీక్షలకు స్టడీ మెటీరియల్‌గా ఉపయోగిస్తున్నారు. పత్రిక ప్రామాణికతకు ఇది అద్దం పడుతోంది. ఎన్ని పత్రికలు వస్తున్నా దక్కన్ ల్యాండ్ అంటే హైదరాబాద్ చిరునామా.

**-డా.నీరజ అమరవాది, m : 9849160055**




# ఎడారిలో ఒయాసిస్ దక్కన్‌ల్యాండ్

## అందరిని కలుపుకొని సాగే ఏకైక ఉదాత్త పత్రిక
## "తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక డాక్యుమెంటేషన్
## బహుముఖీన చైతన్యంలో 'దక్కన్‌ల్యాండ్' పదిహేనేళ్ళ ప్రయాణం"

### 1. ఉపోద్ఘాతం: ఎడారిలో ఒయాసిస్ 'దక్కన్ లాండ్'

విజువల్ మీడియాతో ప్రింటింగ్ పత్రికా రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాలమిది. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఈనాడు వంటి పత్రికలు తమ అనుబంధ పత్రికలను మూసివేశాయి. కనీసం ఆన్‌లైన్ పత్రికలుగానైనా కొనసాగించలేక పోయాయి. సోషల్ మీడియా, విజువల్ మీడియా విస్తృతి, డిజిటల్ విప్లవం మరియు వాణిజ్య ప్రయోజనాలే పరమావధిగా మారిన ప్రస్తుత కాలంలో ఎన్నో సీరియస్ పత్రికలు, సాహిత్య సంచికలు ఆర్థిక నవాళ్లను తట్టుకోలేక మూత పడుతున్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో, గత 15 సంవత్సరాలుగా ఒక స్థిరమైన ప్రామాణికతతో, నిబద్ధతతో నిరంతరాయంగా వెలువడుతూ, అక్షర జగత్తులో ఎడారిలో ఒయాసిస్ లా నిలిచింది 'దక్కన్ లాండ్' మాసపత్రిక.



ఇంజనీర్, పర్యావరణవేత్త మరియు సాంస్కృతిక ఉద్యమకారుడైన మణికొండ వేదకుమార్ గారి సంపాదకత్వంలో నడుస్తున్న ఈ పత్రిక, తాత్కాలిక రాజకీయ సంచలనాలకు దూరంగా ఉంటూ, ఒక డాక్యుమెంటేషన్ కేంద్రంగా స్థిరపడింది. దక్కన్ పీఠభూమి చారిత్రక మూలాలను శాస్త్రీయంగా రికార్డు చేయడమే కాకుండా, సమకాలీన సమాజానికి ఒక బాధ్యతగా, కర్తవ్యంగా ఈ పత్రిక చేసిన కృషి అద్వితీయమైనది. 15 వసంతాల చారిత్రక మైలురాయిని అధిగమించిన సందర్భంలో, ఈ పత్రిక సంతరించుకున్న విశిష్ట వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని బహుముఖీన కృషిని గుర్తు చేయడం, విశ్లేషించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

### 2. మేధో విస్తృతి-ప్రామాణిక వ్యాసకర్తల శ్రేణి

వేదకుమార్ గారు ఒక చారిత్రక కర్తవ్యంగా "తెలంగాణ రిసోర్సు సెంటర్" (టిఆర్‌సి) పేరిట అనేక సెమినార్లు ప్రత్యేక ప్రసంగాలు నిర్వహించారు. వందలాది విషయ నిపుణులచే ప్రసంగాలు చర్చలు వెలువరింపజేసారు. అవి ఒక కాల నాళిక. వాటిని ప్రత్యేక పుస్తకాలుగా తెస్తే రేపటి యువతరానికి మూల వనరుగా పనికొస్తాయి. అదే కోవలో అందరిని విషయ నిపుణులను వెతికి పట్టుకొని చర్చించి రాయించిన పత్రిక దక్కన్‌ల్యాండ్ పత్రిక. పత్రికా రంగంలో ఎకనామికల్ అండ్ పొలిటికల్ వీక్లీ, సెమినార్ వంటి పత్రికల వల తన దైన విశిష్ట ప్రమాణాలను అనుసరించిన పత్రిక దక్కన్‌ల్యాండ్ పత్రిక.

'దక్కన్‌ల్యాండ్' పత్రికకు ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ రావడానికి కారణం వేదకుమార్ గారి సమగ్ర దృష్టి. వారి బహు ముఖీన ప్రావీణ్యం. ఈ విషయంలో ఎబికె ప్రసాద్, సురవరం ప్రతాపరెడ్డి గార్లతో పోల్చవచ్చు.

అందులో క్రమం తప్పకుండా రాసే అత్యున్నత ప్రమాణాలు కలిగిన పరిశోధకులు, రచయితల శ్రేణి. వారు కేవలం డెస్క్ జర్నలిస్టులు కారు, క్షేత్రస్థాయిలో నిరంతరం శోధించే సత్యాన్వేషకులు.

**పరవస్తు లోకేశ్వర్:** తెలంగాణ సంస్కృతి, హైదరాబాద్ జనజీవనం మరియు నిజాం కాలం నాటి సామాజిక మార్పులపై ప్రామాణికమైన, చదవాలనిపించే చారిత్రక కథనాలతో పత్రికకు సాహిత్య హంగులు అద్దారు.

**సంగిశెట్టి శ్రీనివాస్:** మరుగున పడిన తెలంగాణ తొలితరం కథలు, సాహిత్య చరిత్ర మరియు సామాజిక ఉద్యమాలను వెలికితీసి, దస్తావేజీకరణ చేయడంలో వీరు రాసిన వ్యాసాలు పరిశోధకులకు పాఠ్యపుస్తకాలుగా మారాయి.

**ఈమని శివనాగిరెడ్డి:** 'తెలంగాణ మేటి శాసనాలు' శీర్షిక ద్వారా ప్రతి నెలా క్షేత్రస్థాయిలో తాము కనుగొన్న నూతన శాసనాలను, శిల్పాలను, బౌద్ధ-జైన అవశేషాలను శాస్త్రీయ ఆధారాలతో ఈ పత్రిక ద్వారా ప్రజల ముందుకు తెచ్చారు.

**ద్యావనపల్లి సత్యనారాయణ:** తెలంగాణ ప్రాచీన చరిత్ర, శాతవాహనుల కాలం నాటి సామాజిక ఆచారాలు మరియు స్థానిక సంస్కృతులపై లోతైన చారిత్రక విశ్లేషణలు వీరి ప్రత్యేకత.

**శ్రీరామోజు హరగోపాల్:** 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' కన్వీనర్‌గా ఉంటూ, ఖమ్మం వేములవాడ-కుర్క్యాల శాసన విశేషాలు మరియు గ్రామీణ వీరగల్లుల చరిత్రను క్షేత్రస్థాయి చిత్రాలతో సహా రికార్డు చేశారు.

**వివేక్, సంకెపెల్లి నాగేంద్ర శర్మ:** జయధీర్ తిరుమల రావు పురావస్తు మ్యూజియంల పరిరక్షణ, నూతన చారిత్రక ఆధారాలపై సమకాలీన కోణంలో వీరు రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు పత్రిక స్థాయిని అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చాయి.

**బి.ఎస్.రాములు:** సామాజిక తత్వవేత్తగా సమాజ నిర్మాణాన్ని, రాజ్యాంగ హక్కులను, క్షేత్రస్థాయి అనుభవాల ఆధారంగా సామాజిక ఎదుగుదలకు అవసరమైన తాత్విక రోడ్‌మ్యాప్‌ను అందించే వ్యాసాలతో పత్రిక లోతును పెంచే ప్రయత్నం చేశారు.

### 3. భారత రాజ్యాంగం – సామాజిక న్యాయ తాత్వికత

'దక్కన్ లాండ్' పత్రికకు ఒక విలక్షణమైన స్వభావాన్ని తెచ్చిన వాటిలో భారత రాజ్యాంగ ముఖ్యాంశాలపై వచ్చిన వ్యాసాల ప్రత్యేక సంచికలు అత్యంత ప్రధానమైనవి.

**రాజ్యాంగ సంచికల విశిష్టత:** రాజ్యాంగం కేవలం చట్టాల పుస్తకం కాదు, అది అట్టడుగు వర్గాల విముక్తి పత్రం అనే సత్యాన్ని చాటుతూ... నా (బి.ఎస్. రాములు) వ్యాసాలతో ఒక ప్రత్యేక సంచికను పత్రిక వెలువరించింది. ఇందులో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, మరియు రిజర్వేషన్ల వెనుక ఉన్న సామాజిక న్యాయ సూత్రాలను సరళమైన భాషలో విశ్లేషించడం జరిగింది.




**క్షేత్రస్థాయి సామాజిక విశ్లేషణ:** సమాజంలో వెనుకబడిన వర్గాల సామాజిక స్థితిగతులు, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం మరియు చట్టబద్ధమైన హక్కుల సాధనపై క్షేత్రస్థాయి అనుభవాలను జోడిస్తూ పత్రిక ప్రచురించిన వ్యాసాలు మేధావుల్లో తీవ్రమైన మేధోమథనానికి దారితీశాయి. సామాజిక చైతన్యానికి మరియు తాత్వికతకు మధ్య వారధిగా ఈ పత్రిక నిలిచింది.

### 4. హైదరాబాద్ నగర పరిరక్షణ – పర్యావరణ బాధ్యత

ఈ పత్రిక యొక్క మరొక విశిష్ట కోణం– మన హైదరాబాద్ నగరాన్ని, దాని వారసత్వాన్ని పరిరక్షించడానికి చేసిన ప్రత్యేక కృషి. సంపాదకులు వేదకుమార్ గారు స్వయంగా ఇంటాక్ (INTACH) ప్రతినిధి కావడంతో, హైదరాబాద్ భౌగోళిక, సాంస్కృతిక సంరక్షణపై పత్రిక నిరంతరం పోరాడింది.

**మూసీ నది పునరుజ్జీవనం:** మూసీ నది కాలుష్యం, నది పరివాహక ప్రాంతాల విధ్వంసంపై పర్యావరణ నిపుణులతో సమగ్ర నివేదికలను పత్రిక ప్రచురించింది.

**హెరిటేజ్ కట్టడాల రక్షణ:** ఉస్మానియా జనరల్ హాస్పిటల్ పురాతన భవనం, కుతుబ్ షాహీ సమాధులు, పాతబస్తీలోని చారిత్రక కమాన్లు, ఖాజాగూడ రాతి గుట్టల పరిరక్షణ కోసం పత్రిక కేవలం వ్యాసాలకే పరిమితం కాకుండా, ఒక సామాజిక ఒత్తిడి సమూహంగా పనిచేసింది.

**విశ్వనగరం – జీవన వైవిధ్యం:** హైదరాబాద్‌ను కేవలం కాంక్రీట్ జంగిల్‌గా మార్చడం కాకుండా, దాని పచ్చదనాన్ని, చెరువులను, కుంటలను ఎలా కాపాడుకోవాలో వివరిస్తూ 'విశ్వనగరంగా హైదరాబాద్' వంటి శీర్షికలతో విస్తృతంగా అవగాహన కల్పించింది.

### 5. ప్రత్యేక శీర్షికలు, పుస్తక పరిచయాలు మరియు సృజనాత్మక సాహిత్యం

పత్రిక కేవలం చరిత్రకే పరిమితం కాకుండా వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి వీలుగా పలు శీర్షికలను డిజైన్ చేసింది:

**ఈస్తటిక్ స్పేస్ (Aesthetic Space):** కళలు, శిల్పకళ, చిత్రలేఖనం మరియు లలిత కళల విశేషాలను అందిస్తూ సమాజంలో కళాత్మక స్పృహను పెంచడానికి ఈ శీర్షిక ఎంతో తోడ్పడింది.

**అప్పుడప్పుడు కథలు:** సమకాలీన సామాజిక రుగ్మతలను, పల్లె జీవన సంఘర్షణలను, మానవీయ సంబంధాలను ప్రతిబింబించే అరుదైన, సీరియస్ కథలను కూడా పత్రిక ప్రోత్సహించింది.

**సభలు – సమావేశాల ఫొటో వార్తలు:** తెలంగాణ వ్యాప్తంగా జరిగే చరిత్ర సదస్సులు, పురావస్తు ఆవిష్కరణల సభలు, సాంస్కృతిక ఉత్సవాల సంక్షిప్త నివేదికలను ఫొటోలతో సహా ప్రచురించడం ద్వారా, రాష్ట్రంలో జరుగుతున్న సాంస్కృతిక కదలికలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తూ వస్తోంది.

### 6. వర్తమాన సంక్షోభం – తెలంగాణ సాహిత్య పత్రికల క్షీణత

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో అక్షరం ఒక మండుతున్న కరదీపికలా పనిచేసింది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, దురదృష్టవశాత్తూ విలక్షణమైన తెలంగాణ సాహిత్య ప్రచురణలకు అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ఎన్నో ప్రతిష్టాత్మక సాహిత్య, సాంస్కృతిక పత్రికలు ఆర్థిక భారంతో క్రమంగా మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో, నూతన తెలంగాణ సృజనాత్మక సాహిత్యానికి, కవులకు, కథకులకు ఒక బలమైన వేదిక కరువైంది.

మణికొండ వేదకుమార్ గారు ఇప్పటికే పిల్లల కోసం 'బాల చెలిమి' మాసపత్రికను అద్భుతంగా వెలువరిస్తూ బాలల్లో చైతన్యాన్ని నింపుతున్నారు. అదే రీతిలో, ఇప్పుడు మూతపడుతున్న సాహిత్య పత్రికల సంక్షోభాన్ని అధిగమించడానికి, తెలంగాణ సాహిత్యం కోసం 'దక్కన్‌ల్యాండ్', 'బాల చెలిమి' పత్రికల స్థాయిలో ఒక ప్రత్యేక సాహిత్య మాసపత్రికను వెలువరించడం ఒక చారిత్రక అవసరం. సాహిత్య రంగానికి ఊపిరి పోసే ఈ గురుతర బాధ్యతను మోయడం కేవలం మణికొండ వేదకుమార్ గారి వంటి నిబద్ధత, పట్టుదల గల సంపాదకుడితోనే సాధ్యం.

### 7. పత్రిక సమగ్రతకు నా నిర్దిష్ట తాత్విక సూచనలు:

పదిహేనేళ్ళు పూర్తి చేసుకుని ముందుకు సాగుతున్న




'దక్కన్‌ల్యాండ్' మరింత సమగ్రంగా, వర్తమాన సామాజిక అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకోవడానికి ఒక సామాజిక తత్వవేత్తగా నా నిర్దిష్ట ప్రతిపాదనలు ఇక్కడ ఉంచుతున్నాను:

**ఎ) 'దక్కన్ లాండ్' లోపల సాహిత్య విభాగానికి ప్రత్యేక పేజీలు**

కొత్త సాహిత్య పత్రికను తెచ్చే ప్రయత్నంతో పాటు, ప్రస్తుత 'దక్కన్ లాండ్' పత్రికలోనే తెలంగాణ సాహిత్య సాంస్కృతిక వేదిక కోసం కనీసం ఎనిమిది పేజీలు పెంచడం లేదా ఉన్న పేజీల్లోనే ఒక ప్రత్యేక విభాగాన్ని కేటాయించడం ఎంతో అవసరం. ఇది స్థానిక , కథకులకు తక్షణ ఊరటనిస్తుంది.

**బి) గ్రంథ సారాన్ని అందించే విశ్లేషణాత్మక పుస్తక వ్యాసాలు**

ప్రస్తుతం వస్తున్న పుస్తక పరిచయాలు కేవలం 'పుస్తకం పేరు-రచయిత పేరు' అనే పరిమిత పరిచయానికే పరిమిత మవుతున్నాయి. అలా కాకుండా, కొత్తగా వచ్చే ప్రామాణిక గ్రంథాలపై ఆ గ్రంథ సారాన్ని, అంతర్లీన తాత్వికతను విశ్లేషించే సమగ్ర విశ్లేషణాత్మక వ్యాసాలు (Analytical Book Essays) రాయించి ప్రచురించడం అవసరం. పుస్తకం పూర్తిగా చదవలేని పాఠకుడు కూడా ఆ వ్యాసం చదివితే గ్రంథం యొక్క మూల ఉద్దేశాన్ని, సారాన్ని పూర్తిగా గ్రహించేలా ఈ శీర్షిక సాగాలి.

**8. ముగింపు:** సమగ్రంగా పరిశీలిస్తే, 'దక్కన్‌ల్యాండ్' కేవలం ఒక మాస పత్రిక కాదు; అది తెలంగాణ నేల యొక్క ఆత్మగౌరవ ప్రతీక, ఒక నిశ్శబ్ద విప్లవం. 15 ఏళ్ళుగా ఎటువంటి వాణిజ్య ప్రలోభాలకు లొంగకుండా, ఒక స్థిరమైన ప్రామాణికతను కాపాడుకుంటూ రావడం "అక్షరాలా ఉద్యమం." నా ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని, సాహిత్య వేదికను మరియు గ్రంథసార విశ్లేషణలను తనలో మరింత బలంగా లీనం చేసుకుంటూ 'దక్కన్‌ల్యాండ్' మరిన్ని దశాబ్దాల పాటు దక్కన్ వైభవాన్ని, రాజ్యాంగ తాత్వికతను ఇలాగే రికార్డు చేయాలని ఆకాంక్షిస్తున్నాను. పదిహేనేళ్ళు పూర్తి చేసుకున్న ఈ సందర్భంలో సంపాదక వర్గానికి మరియు సహకరిస్తున్న మేధావులందరికీ నా హృదయపూర్వక తాత్విక అభినందనలు. అనేక వాగులను, ఉప నదులను కలుపుకొని సాగే గోదావరి నదిలా అందరిని కలుపుకొని సాగే ఈ ఎడారిలో ఒయాసిస్ నిరంతరం ప్రవహిస్తూనే ఉండాలి.

-డా॥ బి.ఎస్.రాములు,
*(సామాజిక తత్వవేత్త, రచయిత & తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తొలి చైర్మన్)*
m : 8331966987
e : bsramulu@gmail.com

# మాసపత్రికలకే తలమాణిక్యం




'యథారాజ-తథాప్రజ' అంటే ఎలాంటి రాజు ఉంటాడో - అలాంటి ప్రజలే ఉంటారు అనేది సామెత. ఈ సామెత దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మాన్యశ్రీ మణికొండ వేదకుమార్ గారికి చక్కగా అన్వయించబడుతుంది. ఒక విశిష్టమైన క్రమశిక్షణ, వినయ, విధేయతలతో, నిబద్ధత కలిగి ఉంటారు. శ్రీ వేదకుమార్ సంపాదకత్వంలో నెల, నెల కొంగ్రొత్త విశేషాలతో, ముద్రణలో భాషాపరమైన తప్పులు లేని ముద్రణ నన్ను పరవశింపజేసింది. ప్రధాన మాసపత్రికల్లో లేని, ఈ తరానికే కాదు, మా తరానికి కూడా తెలియనట్టి పూర్వ చరిత్రలు, పురాతన కట్టడాల వివరాలు, పరిశోధన పత్రాల వివరాలు. ప్రత్యేకంగా ఏ పత్రికల్లో ప్రచురించని వేల సంవత్సరాల ఇతిహాస, పురాణ, వేద, ఉపనిషత్తులు, భారతదేశ పూర్వ వైభవ శిలా ఖండాలు, ప్రాచీన కట్టడాలు, కోటలు, గుహలు, దేవాలయాల వైభవాలు, ఏళ్ల నాటి చరిత్ర నన్నిటిని తేదీలు, సంవత్సరాలు, క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంలో జరిగిన ఎన్నెన్నో ఘట్టాలను ఎవరు కూడా వేలెత్తి చూపించని సాక్ష్యాధారాలను లిఖితపూర్వకంగా నెల, నెల తమ సంపాదకత్వంలో అందిస్తున్నది. దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక రచయితలకు, పరిశోధకులకు, సాహితీవేత్తలకు కావలసినంత గత, ప్రస్తుత, భవిష్యత్ తరాలకు అందించే సాహిత్య, సాంస్కృతిక రాజకీయ, సామాజిక నైతిక విప్లవాన్ని సాంస్కృతిక, రాజకీయ, సామాజిక నైతిక విప్లవాన్ని విశ్లేషణలతో నవశకానికి నాంది పలుకుతుంది దక్కన్‌ల్యాండ్ పత్రిక.

ఈ పత్రిక సంపాదకత్వ కార్యవర్గం అంతా విద్యాధికులు, అనుభవజ్ఞులు, భాషా పరిజ్ఞానం గల సుశిక్షిత సీనియర్లచే తప్పొప్పులను సవరిస్తూ, నికార్సైన తెలుగు భాషా ప్రావీణ్యతను నిలబెడుతున్న ఎడిటోరియల్ టీంను అభినందిస్తున్నాను. గత 14 ఏండ్లుగా కొన్ని వేల మంది సాహితీవేత్తలను, కళాకారులను, సుశిక్షిత ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ ఆంధ్ర-తెలంగాణ ప్రాంత చదువరులకు పరిచయం చేస్తూ, కీర్తి ఘడిస్తున్న మాన్యశ్రీ వేదకుమార్ సార్‌కు కృతజ్ఞతాభివందనాలు.

-సంగీతపు రాజలింగం (కవి), ఫోన్: 63098 74728






# చరిత్రను అక్షర బద్ధం చేస్తూ..
# గతవైభవ ఆనవాళ్లను తెలుపుతున్న దక్కన్‌ల్యాండ్

దక్కన్‌ల్యాండ్ తెలుగు మాసపత్రిక 15వ సంవత్సరంలోకి అడుగుగిడుతున్న సందర్భంగా ముందుగా ఆ పత్రికా సంపాదకులు మణికొండ వేదకుమార్ గారికి హార్దికాభినందనలు తెలియ చేస్తున్నాను. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఆకాంక్షతో మలిదశ ఉద్యమానికి ముందు వీరి ఆధ్వర్యంలో ఎంతో కృషి జరిగింది. తెలంగాణా రిసోర్స్ సెంటర్ (టిఆర్‌సి)లో ప్రతి శనివారం సాయంత్రం సమావేశం జరిగేది. అందులో విభిన్న చర్చల ద్వారా ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను నొక్కిచెప్పారు. వారి ప్రయత్నం అంతటితో ఆగలేదు. తెలంగాణ ప్రాశస్త్యాన్ని సుస్థిరం చేయడానికి 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రికను తీసుకురావాలని నిర్ణయించారు. దక్కన్‌ల్యాండ్ పత్రిక రావడం వెనుక ఇంత విస్తారమైన చర్చ జరిగిందని చెప్పడమే నా ఉద్దేశం.

రాష్ట్రం సిద్ధించింది. అప్పుడే పుట్టిన చంటి బిడ్డను జాగ్రత్తగా, ఆరోగ్యంగా పెంచుకునే చందాన భవితవ్యాన్ని తీర్చిదిద్దవలసిన అవసరం ఎంతైనా ఉంది. బిడ్డ ఆరోగ్యంగా పుట్టడానికి తల్లి తీసుకున్న జాగ్రత్తలు ప్రధాన కారణం. రాష్ట్ర సాధనకు ముందే తెలంగాణలోని అభివృద్ధిని తల్లి తీసుకున్న జాగ్రత్తతో పోల్చవచ్చు. గత పద్నాలుగు వసంతాలుగా దక్కన్‌ల్యాండ్ మాస పత్రిక చేసింది అదే.. అంటే మరుగున పడిన తెలంగాణ చరిత్రను వెలికితీయడం, తెలంగాణ - దక్కన్ ప్రాంతాల చరిత్రను అక్షర బద్ధం చేయడం అన్నమాట. అందులో భాగంగా విభిన్న రంగాలకు చెందిన రచయితలు, మేధావులు, కళాకారులు, ఉద్యమకారులు, పరిశోధకులు, పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, చరిత్రకారుల సమన్వయంతో తెలంగాణ వైభవాన్ని పాఠకులముందు పెడుతున్నారు.




హైదరాబాదును మేమే అభివృద్ధి చేసామని భుజాలు ఎగరేసిన పెద్దమనుషులకు.. నిజాం పాలనలో ప్రజలు కొంత కష్టాలు పడ్డప్పటికీ ఆ కాలంలోని అనేక నిర్మాణాలను, రైల్వే, విమానయాన, నీటి వ్యవస్థల తీరును బయట పెట్టిన దక్కన్‌ల్యాండ్ పత్రిక చెంపపెట్టు లాంటిది. కేవలం గత వైభవాన్ని విప్పి చెప్పడంతో సరిపోదు. గతవైభవ ఆనవాళ్ళను భావితరాల కోసం పరిరక్షించుకోవడం అవసరం. అందుకొరకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టును ఏర్పాటు చేసారు. దానిద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపును సాధించారు. ముదుమాల్ గ్రామ పరిసరాల్లో ఉన్న పురాతన శిలాసంపద శాస్త్రీయతను బయటపెట్టారు. త్వరలోనే వీటిని కూడా యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించనుంది. హెరిటేజ్ నడకలను నిర్వహిస్తున్నారు. అంతేకాదు, మారుమూల గ్రామాలలోని ఆలయాల నేపథ్యం, శిల్పకళానైపుణ్యం, విశిష్టతలను దక్కన్‌ల్యాండ్ ప్రచురిస్తోంది. కాలానికి సాక్ష్యంగా నిలబడి, వర్తమానాన్ని అక్షరాలలో బంధించి, దక్కన్ పీఠభూమి చరిత్ర, సంస్కృతులను భావితరాలకు అందిస్తోంది. కాబట్టి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రిఫరెన్సుగా ఈ పత్రిక ఉపయోగపడుతుంది. మన మూలాలను తెలియజెప్పే ఈ పత్రిక పది కాలాలపాటు భద్రపరచుకోదగింది.

ఆధునీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి పేరుతో సహజ వనరుల విధ్వంసం, ఆదివాసీలను అభద్రతకు గురిచేయడం, పర్యావరణం దెబ్బతింటున్న విషయం అందరికీ తెలిసిందే. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునే అవసరాన్ని, మతరాజకీయాలు విస్తరిస్తున్న నేటి సందర్భంలో సైంటిఫిక్ టెంపర్‌ను, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచు కోవలిసిన అవసరాన్ని పత్రిక నొక్కి చెపుతోంది.

నేటి పిల్లలే రేపటి జాతి నిర్మాతలు. కాబట్టి భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదగాలి. అందుకొరకు చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీని ఏర్పాటు చేసి, సినిమాకు సంబంధించిన అన్ని రంగాలలో పాఠశాల విద్యార్థులకు కార్యశాలలు నిర్వహించారు. అందులో నేను పనిచేసిన లాలాపేట బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రాసిన స్క్రిప్టును ఐదు నిమిషాల నిడివి సినిమాగా చిత్రీకరించి, దానిని అంతర్జాతీయ పిల్లల పండగ సందర్భంగా హైదరాబాదులోని ఐమాక్స్ థియేటర్లో ప్రదర్శించడం ఒక ప్రభుత్వ పాఠశాలకు దక్కిన గౌరవం అని చెప్పాలి. అప్పట్లో వేదకుమార్ శ్రమ ఫలితంగా అంతర్జాతీయ పిల్లల సినిమా పండగకు హైదరాబాదు వేదికైంది.

పిల్లలలోని సృజనాత్మక శక్తులను వెలికి తీస్తున్నారు. నాణ్యత కలిగిన బాలసాహిత్యాన్ని ప్రోత్సహించడానికి బాలచెలిమి పేరుతో పిల్లల పత్రికను తీసుకు వస్తున్నారు. దీనికి ముందు "బాలచెలిమి ముచ్చట్లు" పేరుతో ప్రతినెలా చర్చావేదికను నిర్వహించారు.




## పౌరస్పృహను మేల్కొల్పుతున్న
# దక్కన్‌ల్యాండ్




**2012** సెప్టెంబర్‌లో తొలి సంచిక వెలువడిన దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక 15వ వసంతంలోకి అడుగిడు తున్న శుభ సమయంలో పాఠకుడిగా ఎంతో సంతోషంగా ఉంది. దీనివెనుక సాహితీ మిత్రులు, మానవతావాది మరియు స్నేహశీలి మాన్య మణికొండ వేదకుమార్ గారి కృషి వేరుగా చెప్పనవసరం లేదు. అన్నీ తానై ఈ సామాజిక రాజకీయ మాస పత్రిక ను సాంస్కృతిక, సభ్య సమాజాన్ని నిర్మించే దిశగా ముందుకు తీసుకు పోతున్న వేద గారికి మనః పూర్వక అభినందనలు. హార్దిక శుభాకాంక్షలు.

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC), ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్, బాల చెలిమి పిల్లల పత్రిక మాధ్యమంగా మేధావుల, నిపుణుల, సామాజిక కార్యకర్తల ద్వారా సలహాలు, సూచనలు స్వీకరించి ప్రభుత్వాలకు తెలియజేయడంలో దక్కన్‌ల్యాండ్ కృషి అమోఘం.

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, అన్ని వ్యవస్థలు స్వేచ్ఛగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం. మనందరిలో ఆ స్పృహను మేల్కొల్పుతున్న దక్కన్ ల్యాండ్ సంపాదక వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తూ....

**-డా. దాసరి శ్రీనివాసులు**

ఇందులో బాలసాహితీ వేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులు, చిత్రకారులు, పిల్లలు పాల్గొనేవారు. పిల్లలకు కథారచన పోటీలు నిర్వహించి, ఉత్తమ కథలను సంకలనాలుగా తీసుకు వచ్చారు. తెలంగాణా పాత పది జిల్లాల వారీగా పిల్లలు రాసిన కథలను కూడా పది సంకలనాలుగా తీసుకువచ్చారు. అందులో హైదరాబాదు జిల్లా పాఠశాలల విద్యార్థులు రాసిన కథాసంకలనం కూడా ఉండడం విశేషం. సెల్ ఫోన్ పుస్తకాన్ని కబళించిన నేటి సందర్భంలో పుస్తక పఠనం ఆవశ్యకతను నొక్కి చెపుతూ వంద గ్రంథాలయాలను స్థాపించడంలో భాగంగా సుమారు నలభై ఐదు గ్రంథాలయాలను ఏర్పాటు చేసారు.

## వైవిధ్య అంశాలపై సమగ్ర సమాచారం
# దక్కన్‌ల్యాండ్



**హై**దరాబాద్ నుండి వెలువడుతున్న 'దక్కన్‌ల్యాండ్' ఒక అద్భుతమైన మాసపత్రిక. ఇది సమాజం, సంస్కృతి, భూగోళశాస్త్రం మరియు సైన్స్ వంటి వైవిధ్యమైన అంశాలపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ పత్రికలో ప్రచురితమయ్యే ఆయా రంగాల నిపుణులచే రాయబడిన వ్యాసాలు, కథనాలు ఎంతో విజ్ఞాన భరితమైనవి. కేవలం ప్రజాదరణ కోసం కాకుండా, జర్నలిజం విలువలని ఎక్కడా తగ్గించకుండా ఈ పత్రిక ఎల్లప్పుడూ ఉన్నతమైన వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తోంది.

ఈ పత్రికలోని సమాచారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరియు ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణ పత్రికలు స్పృశించని విలక్షణమైన అంశాలను సైతం వెలుగులోకి తెస్తూ, సమాజంలో పర్యావరణ స్పృహను, సంస్కృతి మరియు వారసత్వ సంపదపై అవగాహనను పెంచడానికి 'దక్కన్‌ల్యాండ్' చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయం. ఈ మంచి ప్రయత్నం ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ, ఈ పత్రికకు మరియు వారి బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**-వేణుగోపాల్ రావు చకిలం**
డెప్యూటీ డైరెక్టర్ జనరల్ (రిటైర్డ్)
జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

దక్కన్‌ల్యాండ్ మాస పత్రికతో నా అనుబంధాన్ని చెప్పాలంటే దానితో అనుసంధానమై వేదకుమార్ చేస్తున్న ఈ కార్యక్రమాలను ప్రస్తావించకుండా చెప్పడం సాధ్యం కాదు. వీటన్నింటిలో నేను కూడా ఉడతా భక్తిగా పాలుపంచుకుంటున్నందుకు గర్వంగా ఉంది. ఈ విధంగా పత్రిక నిర్వహణ ద్వారా యావత్ సమాజాన్ని జాగృతం చేస్తున్నారు. భవిష్యత్తులో దక్కన్‌ల్యాండ్ పత్రిక మరిన్ని వసంతాలను విజయవంతంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**-గిరిజ పైడిమర్రి**
m :9949443414




### నాగరికతలను మింగేసిన మహాకరువుకు సాక్ష్యం

# కాలపురుషుడి డైరీ:

# మేఘాలయన్ యుగం గుహలు

UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2021

Serial Nomination for MEGHALAYAN AGE CAVES

East Khasi Hill, Meghalaya or Region India. Category: Natural

**భూ**గర్భ ప్రపంచపు అద్భుతాలుగా పేరొందిన మేఘాలయా యుగం గుహలు భూమి భౌగోళిక చరిత్రలో అత్యంత కీలకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఈ గుహల్లోని ప్రత్యేక నిర్మాణాలు శాస్త్రవేత్తలు భూమి సరికొత్త భౌగోళిక యుగాన్ని గుర్తించడానికి సహాయపడ్డాయి. 2025 ఆగస్టులో భారతదేశం తరఫున ఈ మేఘాలయన్ యుగం గుహలను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో చేర్చారు.

**సమర్పణ తేదీ:** 27/08/2025

**ప్రమాణాలు:** (vii)(viii)(ix)

**వర్గం:** నేచురల్

**సమర్పించిన వారు:** యునెస్కో భారత శాశ్వత ప్రతినిధి బృందం

**ప్రాంతం:** తూర్పు ఖాసీ కొండ, మేఘాలయ

**రిఫరెన్స్ నెం:** 6892

**మేఘాలయన్ యుగం గుహలు:**

1. మౌమ్లూ గుహ
2. అర్వా గుహ
3. మౌస్మాయి గుహ
4. క్రెమ్ పురి గుహ

ఈశాన్య భారతదేశంలోని మేఘాలయ రాష్ట్రంలో షిల్లాంగ్





పీఠభూమిపై అనేక విశేష గుహలు చెల్లాచెదురుగా ఉన్నాయి. ఈ గుహలు హోలోసీన్ కాలానికి చెందిన ఒక ప్రత్యేకమైన ఆనవాళ్లను కలిగి ఉన్నాయి. అటువంటి గుహలు గారో, ఖాసీ, జైంతియా కొండలలో సున్నపురాయి సమృద్ధిగా ఉన్న ప్రాంతంలో కనీసం 12 దాకా ఉన్నాయి. ఇవి స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్ల (ఈ గుహల లోపల పైకప్పు నుండి కిందకు వేలాడే సున్నపురాయి నిర్మాణాలను స్టాలక్టైట్లు అని, కింద నేలపై నుండి పైకి పెరిగే స్తంభాలను స్టాలగ్మైట్స్ అని అంటారు.) ప్రత్యేక, అరుదైన నిర్మాణానికి ప్రసిద్ధి చెందాయి. వాటి పరిమాణం, భౌగోళిక లక్షణాలు, అందుబాటును దృష్టిలో ఉంచుకుని, తూర్పు ఖాసీ కొండలలోని 4 గుహలను మిగిలిన వాటి కంటే ప్రత్యేకమైనవిగా ఎంపిక చేశారు.

మౌమ్లూ గుహలో ఏర్పడిన స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్లను, హోలోసీన్ శ్రేణిలోని మేఘాలయ యుగ దశకు చెందిన గ్లోబల్ బౌండరీ స్ట్రాటోటైప్ సెక్షన్ అండ్ పాయింట్‌గా గుర్తించారు. మేఘాలయ ఇప్పుడు ప్రపంచంలోని అత్యంత సంక్లిష్ట గుహల వ్యవస్థలకు నిలయంగా ప్రసిద్ధి చెందింది; భారతదేశంలోని మరే ఇతర ప్రదేశంలో కంటే కూడా ఈ తరహాలో ఇక్కడ ఎక్కువ గుహలు ఉన్నాయి.

ఈ గుహలలో లభించిన అరుదైన స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్లలో కనుగొనబడిన సాక్ష్యాధార గుర్తులు, ప్రసిద్ధ అంతర్జాతీయ క్రోనోస్ట్రాటిగ్రాఫిక్ చార్ట్‌ను మేఘాలయ యుగం అనే కొత్త, ప్రస్తుత యుగంతో సవరించడానికి కారణమయ్యాయి. ఈ గుహలలో చాలా వాటిని ఇప్పటికీ అన్వేషించలేదు లేదా పాక్షికంగా మాత్రమే అన్వేషించారు. ఇవి మానవ చరిత్ర కాలమానంలో ఒక ముఖ్యమైన వారసత్వాన్ని కలిగి ఉన్నాయి.

### అత్యుత్తమ సార్వత్రిక విలువ యొక్క సమర్థన

సుమారు 4,200 సంవత్సరాల క్రితం, ఒక మహా కరువు సంభవించింది. అది అనేక నాగరికతలను నాశనం చేసి, వ్యవసాయ ఆధారిత సమాజాల పతనానికి కారణమైంది. 4.2 ఖ సంఘటనగా పిలిచే ఈ కాలం ప్రపంచవ్యాప్తంగా సంభవించింది. దీనిని ఒక కాలస్తర సూచికగా పరిగణిస్తారు. మేఘాలయ యుగపు గుహలలో ఒకటైన మౌమ్లూ గుహ నుండి లభించిన స్టాలగ్మైట్ నమూనా, అవి డయాజెనిసిస్, క్రమక్షయానికి గురికాలేదని తెలియజేస్తోంది. అంతేకాదు ఈ సంఘటన రసాయన గుర్తులను భద్రపరచడానికి అనువుగా ఉన్నాయని చూపించింది.

విస్తృతమైన ఆక్సిజన్ ఐసోటోప్ విశ్లేషణలో, ఈ స్టాలగ్మైట్ హోలోసీన్ కాలపు పురాతన శీతోష్ణస్థితి, పురాతన రుతుపవనాల కాలానికి సంబంధించిన అత్యంత స్పష్టమైన రికార్డును భద్రపరిచిందని వెల్లడైంది. ప్రపంచంలో హోలోసీన్ కాలానికి చెందిన ఈ విధమైన గుర్తులు ఉన్న కొన్ని గుర్తింపు పొందిన ప్రదేశాలలో ఈ గుహలు ఒకటి. ఈ ప్రాంతంలో అత్యధిక వర్షపాతం, సమృద్ధిగా ఉన్న సున్నపురాయి నిర్మాణాలతో కలిసి, మేఘాలయ గుహలలో ఇటువంటి విశిష్టమైన స్టాలక్టైట్లు మరియు స్టాలగ్మైట్లు ఏర్పడటానికి దోహదపడింది.

**ప్రమాణం (vii):** మేఘాలయ (ఈశాన్య భారతదేశం) ప్రపంచంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలలో ఒకటి. ఈ విలక్షణమైన వాతావరణ పరిస్థితులు, తీవ్రమైన ద్రావణ శిథిలీకరణ కారణంగా, భారతదేశంలోని ఈ భాగంలోని అనేక సున్నపురాయి ప్రాంతాలలో కార్స్టిక్ గుహలు విస్తృతంగా ఉన్నాయి. అదేవిధంగా, అత్యధిక వర్షపాతం, ఉష్ణమండల రుతుపవన వాతావరణం సిలికేట్-సమృద్ధిగల శిలాజాలలో అనేక గుహల ఏర్పాటును ప్రోత్సహించాయి. మేఘాలయ యుగపు గుహలు ప్రపంచంలోనే ఈ రకమైన పొడవైన గుహలలో ఒకటి. సముద్ర మట్టానికి 4,025 అడుగుల (1227 మీటర్లు) ఎత్తులో, ఒక లోతైన లోయకు అభిముఖంగా, దీని ముఖద్వారం ఒక నిటారుగా ఉన్న కొండ అంచు దిగువన ఉంది. భారతదేశంలోని అత్యంత పొడవైన, లోతైన గుహలలో చాలా వరకు మేఘాలయలోని ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. భూమిపై అత్యంత తేమతో కూడిన ప్రదేశంగా పేరుగాంచిన పచ్చని మాసిన్‌రామ్‌లో ఉన్న క్రెం పూరి గుహ 24.5 కిలోమీటర్ల (15 మైళ్ళు) పొడవు, 13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ గుహ వందలాది చిన్న మార్గాలు, పొడవైన కారిడార్లతో కూడిన ఒక అత్యంత సంక్లిష్టమైన చిక్కుదారి. ఇవి ఒక పెద్ద జాలకంలో పరస్పరం అనుసంధానించబడి ఉంటాయి. ఈ చిక్కుదారి నమూనా చాలా ప్రత్యేకమైనది. ఇది



గుహను ఒక నిజమైన గారడీగా మారుస్తుంది. ఈ గుహలలో చాలా వాటిలో షాండిలియర్లు, స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్ల వంటి అందమైన అలంకార శిలా నిర్మాణాలు, నీటి కొలనులు, భూగర్భ నదులు ఉంటాయి, ఇవన్నీ కలిసి ఒక అసాధారణ, అరుదైన గుహ ప్రకృతి దృశ్యాన్ని ఏర్పరుస్తాయి.

**ప్రమాణం (viii):** మేఘాలయ యుగపు గుహలు ప్రపంచంలో కొనసాగుతున్న భూగర్భ ప్రక్రియలు అత్యంత స్పష్టంగా కనిపించే కొన్ని ప్రదేశాలలో ఒకటి. ఇక్కడ స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్లు నిరంతరం ఏర్పడుతూ ఉంటాయి. ఇది శాస్త్రవేత్తలు దాదాపుగా భంగం కలగని వాతావరణంలో భూగర్భ ప్రక్రియలను, కాల శ్రేణులను అధ్యయనం చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ గుహలలో భద్రపరచబడిన స్టాలగ్మైట్లు హోలోసీన్ కాలానికి సంబంధించిన అత్యంత స్పష్టమైన రికార్డును కలిగి ఉన్నాయి. క్రెం పూరి, ఇతర గుహలు పగుళ్లచే నియంత్రించబడిన ఒక చిక్కైన నిర్మాణంతో కూడి ఉంటాయి. ఇది ఎక్కువగా భూగర్భ జలమయ (ఫ్రియాటిక్) స్వరూపాలను, కొన్ని ఇటీవలి, ఇంకా క్రియాశీలకంగా ఉన్న వాడోస్ కందకాలను కలిగి, ద్విమితీయ చిక్కైన మార్గాన్ని ఏర్పరుస్తుంది. శిలలపై జరిపిన ఒక వివరణాత్మక పెట్రోగ్రాఫిక్ అధ్యయనం ప్రకారం, ఈ గుహ ఎక్కువగా సిలికాక్లాస్టిక్ అవక్షేప శ్రేణిలో క్వార్ట్జ్ అరెనైట్, హైబ్రిడ్ అరెనైట్, కాల్కరేనైట్ పొరల సముదాయం వెంబడి ఏర్పడిందని తేలింది. గుహలో ప్రవహించే నీటిపై జరిపిన భూరసాయన విశ్లేషణల ప్రకారం, క్రెమ్ పూరి నీటిలోని ద్రావణాలకు కార్బోనేట్ విలీనం అనేది ప్రధాన రసాయన శిథిలీకరణ ప్రక్రియ అని తేలింది. క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్‌లు, బంకమట్టిల విలీనం శిలా శిథిలీకరణలో కేవలం ద్వితీయ పాత్ర పోషిస్తాయి.

2018 జూలైలో అంతర్జాతీయ భూగర్భ శాస్త్రాల సంఘం హోలోసీన్ యుగాన్ని మూడు యుగాలుగా, అనగా గ్రీన్‌లాండియన్, నార్త్‌గ్రిప్పియన్, మేఘాలయన్ యుగాలుగా (ఇవి వరుసగా తొలి, మధ్య, చివరి హోలోసీన్‌లకు అనుగుణంగా) విభజించడాన్ని ఆమోదించినప్పటి నుండి, మేఘాలయ పీఠభూమి ప్రపంచవ్యాప్త విద్యావేత్తల దృష్టిని ఆకర్షిస్తోంది. మేఘాలయ యుగం స్తరవిన్యాస సరిహద్దును నిర్ధారించడానికి ఆధారాలు చిరపుంజి సమీపంలోని 'క్రెమ్ మావ్మ్లూహ్' గుహ నుండి సేకరించబడ్డాయి. మేఘాలయ యుగం ప్రస్తుతానికి 4,200 సంవత్సరాల ముందు ప్రారంభమైంది. దీనిని సంక్షిప్తంగా '4.2 ka BP ఈవెంట్' అని పిలుస్తారు. ఆకస్మిక, భారీ స్థాయి శీతోష్ణస్థితి మార్పు యొక్క ఈ సంఘటన నాలుగు ప్రధాన ప్రాచీన నాగరికతల పతనానికి కారణమని చెప్పబడింది. మేఘాలయ యుగం అనేది మానవ–పర్యావరణ పరస్పర చర్యల తీవ్రమైన కాలాన్ని, భూమి పర్యావరణ వ్యవస్థలు, జీవావరణ శాస్త్రం, జీవవైవిధ్యం, శీతోష్ణస్థితి, వాతావరణ నమూనాలపై వాటి ప్రభావాన్ని సూచిస్తుంది. అనధికారికంగా 'ఆంత్రోపోసీన్' అని పిలువబడే యుగంలో ఒక ముఖ్యమైన దశను ఏర్పరుస్తుంది. అంతేగాకుండా, ఈ గుహలలోని అనేక నిర్మాణాలను పూర్తిగా అన్వేషించలేదు. ఇంకా పూర్తిగా అన్వేషించని భౌగోళిక సమాచార నిధిగా దీన్ని పరిగణించవచ్చు.

**ప్రమాణం (ix):** మేఘాలయ యుగపు గుహలు సంక్లిష్ట సున్నపురాయి భూదృశ్యాన్ని కలిగి ఉంటాయి. ఇవి మేఘాలయ భూభాగం విశిష్ట శీతోష్ణస్థితి లక్షణాల కారణంగా ఏర్పడ్డాయి. మేఘాలయ యుగపు గుహలలో చాలా పెద్ద భూగర్భ నదులు, విశిష్ట శీతోష్ణస్థితి, జలసంబంధ, పర్యావరణ పరిస్థితులు ఉన్నాయి. ఇవి స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్‌ల ఏర్పాటుకు, సంరక్షణకు దోహదపడతాయి. ఫలితంగా అత్యంత అధిక రిజల్యూషన్ గల టైమ్ సిరీస్‌లను సంగ్రహించడం సాధ్యమవుతుంది. మేఘాలయ యుగపు గుహలు కొన్ని స్థానిక జాతులకు, అరుదైన రకాల జంతుజాలానికి కూడా నిలయంగా ఉన్నాయి. మేఘాలయ గుహలలో స్కిస్టురా లార్కెటెన్సిస్, స్కిస్టురా సిజుయెన్సిస్, స్కిస్టురా పాపులిఫెరా, నియోలిస్సోచిలస్ ప్నార్ వంటి అరుదైన రకాల చేప జాతులను గుర్తించారు.

**ప్రామాణికత మరియు/లేదా సమగ్రతకు సంబంధించిన ప్రకటనలు**

మేఘాలయ యుగపు గుహలలో ఒకటైన మౌమ్లూ గుహను ఇప్పటికే ఐయూజీఎస్ జియోసైట్‌గా గుర్తించి, ప్రపంచంలోని





మొదటి 100 భౌగోళికంగా ముఖ్యమైన ప్రదేశాలలో ఒకటిగా చేర్చారు. చాలా మేఘాలయ యుగపు గుహలలోని పర్యావరణం బాగా రక్షించబడింది. తద్వారా స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్లు ఏర్పడటానికి, వాటి పరిరక్షణకు వీలు కలుగుతుంది. ఈ ప్రదేశాలలో చాలా వరకు మారుమూల ప్రాంతాలలో ఉండటం వలన సహజంగానే రక్షించబడ్డాయి. చైతన్యవంతమైన కొండ జాతులు వాటి సంరక్షకులుగా వ్యవహరిస్తున్నాయి. సోహ్రా (చిరపుంజి) పర్యాటక సర్క్యూట్‌లో వేగంగా ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చెందుతున్న క్రెమ్ అర్వాగా ఈ గుహను ఇటీవల మార్చడం వలన, సున్నితమైన గుహ జంతుజాలం ఇప్పటికే ప్రభావితమైంది.

భారత ప్రభుత్వం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ద్వారా, ఇప్పటికే రెండు ప్రదేశాలను (మౌమ్లూ గుహ, అర్వా గుహ) భారతదేశ జాతీయ భౌగోళిక వారసత్వ ప్రదేశాలుగా గుర్తించింది. చాలా గుహలను వివరంగా మ్యాప్ చేశారు. ఈ స్టాలక్టైట్లు, స్టాలగ్మైట్ల నిర్మాణాలు అత్యంత పెళుసుగా ఉంటాయి. గుహలోని పర్యావరణంపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఈ గుహలు ప్రధానంగా సున్నపురాయి నిర్మాణాలలో ఉన్నందున, సున్నపురాయి తవ్వకం పరిశ్రమ వల్ల వీటికి ముప్పు వాటిల్లవచ్చు. అయితే, జియోహెరిటేజ్ బిల్లు భారత ప్రభుత్వం పరిశీలనలో ఉంది. ఇది ఆమోదం పొందిన తర్వాత, భవిష్యత్తులో నిర్దేశిత ప్రదేశాల రక్షణను బలోపేతం చేస్తుంది. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జియోసైట్‌లకు కంచె వేయవచ్చు. ప్రజలలో అవగాహన కోసం వివిధ ప్రచార కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

**ఇతర సారూప్య లక్షణాలతో పోలిక**

అంతర్జాతీయ స్ట్రాటిగ్రఫీ కమిషన్ నిర్వచించిన ప్రకారం, హోలోసీన్ యుగంలోని అత్యంత తక్కువ వయస్సు కలిగిన మేఘాలయ దశకు చెందిన GSSPతో మౌమ్లూ గుహకు ఉన్న అనుబంధం దాని ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ఈ ప్రత్యేకమైన గుర్తింపు, అధికారికంగా గుర్తించబడిన ప్రపంచ క్రోనోస్ట్రాటిగ్రాఫిక్ సరిహద్దును కలిగి ఉన్న ప్రపంచంలోని కొన్ని గుహలలో మౌమ్లూ గుహను ఒకటిగా నిలుపుతుంది, ఇది దాని అత్యుత్తమ సార్వత్రిక విలువను బలపరు స్తుంది. యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడానికి దాని తులనాత్మక యోగ్యతలను అంచనా వేయడానికి, ఇప్పటికే జాబితాలో చేర్చబడిన సారూప్య కార్స్ట్ గుహ వ్యవస్థలతో ఈ క్రింది పోలిక చేయబడింది: స్కోక్జాన్ గుహలు, స్లోవేనియా (1986లో చేర్చబడింది – ప్రమాణాలు vii, viii). స్కోక్జాన్ గుహలు అద్భుతమైన భూస్వరూప లక్షణాలతో కూడిన ఒక విశాలమైన సున్నపురాయి గుహ వ్యవస్థను సూచిస్తాయి, ఇందులో ప్రపంచంలోనే అతిపెద్ద భూగర్భ గదులు (78 మిలియన్ క్యూబిక్ అడుగులు), భూగర్భ నదులు, డోలిన్‌ల విస్తృతమైన నెట్‌వర్క్ ఉన్నాయి. ఈ ప్రదేశం దాని దృశ్య వైభవానికి, కార్స్ట్ దృగ్విషయాల సమృద్ధికి ప్రసిద్ధి చెందింది, ఇది కార్స్ట్ భూభాగం, ప్రక్రియలను అర్థం చేసుకోవడానికి ఒక కీలకమైన ప్రాంతంగా నిలుస్తుంది. ఈ గుహలో అన్వేషించిన పొడవు 6,200 మీటర్లు.

స్కోక్జాన్ బృహత్తర స్థాయిలో కార్స్ట్ భూభాగ పరిణామం, భూగర్భ భూస్వరూప శాస్త్రానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. 7200 మీటర్ల పొడవైన మామ్లూ గుహ ప్రాముఖ్యత, దాని శిలాస్తర శాస్త్ర, పురాశీతోష్ణస్థితి రికార్డులను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక భూకాలక్రమ సరిహద్దుకు GSSP మార్కర్‌గా గుర్తించడంలో ఉంది. ఈ రెండు ప్రదేశాలు, భూస్వరూప శాస్త్రం, భూకాలక్రమం అనే ప్రాధాన్యతలలో విభిన్నంగా ఉన్నప్పటికీ, భూమి సహజ చరిత్రను అర్థం చేసుకోవడంలో రెండూ అనివార్యమైనవి.

హంగరీ/స్లోవేకియాలోని అగ్టెలెక్ కార్స్ట్, స్లోవాక్ కార్స్ట్ గుహలు (1995లో నమోదు చేయబడింది – ప్రమాణం viii) ఈ వరుస సరిహద్దు ప్రదేశంలో సమశీతోష్ణ మండల కార్స్ట్ ప్రక్రియలకు ప్రాతినిధ్యం వహించే 700 కంటే ఎక్కువ గుహలు ఉన్నాయి. ఇందులో ఉష్ణమండల, హిమానీనద శీతోష్ణ పరిస్థితులలో ఏర్పడిన స్పెలియోథెమ్‌లు ఉన్నాయి, ఇవి కోట్లాది సంవత్సరాల పురాతన శీతోష్ణస్థితికి సంబంధించిన నిరంతర రికార్డును అందిస్తాయి.

అదేవిధంగా మామ్లూ కూడా, ముఖ్యంగా దానిలో చక్కగా సంరక్షించబడిన స్పెలియోథెమ్ క్రమాల ద్వారా, దీర్ఘకాలిక శీతోష్ణస్థితి మార్పులపై అంతర్దృష్టులను అందిస్తుంది. అయితే, దీని విశిష్ట విలువ, మేఘాలయ యుగానికి చెందిన GSSP (గ్లోబల్ స్పెలియోథెమ్ పాయింట్)గా గుర్తించబడటంలో ఉంది. ఇది దాని స్పెలియోథెమ్ పొరలలో సంరక్షించబడిన "4.2 ka సంఘటన" అనే కచ్చితంగా నిర్వచించబడిన శీతోష్ణస్థితి సంఘటనపై ఆధారపడి ఉంది. అగ్టెలెక్ వ్యవస్థ విస్తృతమైన, సాధారణీకరించబడిన పురాతన శీతోష్ణస్థితి రికార్డుకు భిన్నంగా, మౌమ్లూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

### మేఘాలయన్ యుగం

మనం ప్రస్తుతం జీవిస్తున్న భౌగోళిక కాలఖండాన్ని శాస్త్రవేత్తలు అధికారికంగా 'మేఘాలయన్ యుగం' అని పిలుస్తున్నారు. సుమారు 4,200 సంవత్సరాల క్రితం భూమిపై అకస్మాత్తుగా సంభవించిన ఒక తీవ్రమైన ప్రపంచవ్యాప్త కరవు వల్ల కాంస్య యుగ నాగరికతలు (సింధు లోయ నాగరికత వంటివి) అంతరించిపోయాయి. ఈ చారిత్రక వాతావరణ మార్పులకు సంబంధించిన రసాయన ఆధారాలు మేఘాలయాలోని గుహలలో లభించిన స్టాలగ్‌మైట్స్ (నేలపై పెరిగే సున్నపురాయి స్తంభాలు) ద్వారా రుజువయ్యాయి. అందుకే ఈ యుగానికి మేఘాలయా పేరు పెట్టారు.

**గ్లోబల్ మార్కర్:** ఈ గుహలో లభించిన స్టాలగ్‌మైట్‌ను భూగర్భ కాలక్రమాన్ని నిర్ణయించే అంతర్జాతీయ ప్రామాణిక మార్కర్‌గా గుర్తించారు. భారతదేశంలో ఇటువంటి గుర్తింపు పొందిన మొదటి భౌగోళిక ప్రాంతం ఇదే.




**అద్భుత నిర్మాణాలు:** ఈ గుహ లోపల ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన స్టాలక్టైట్లు, స్టాలగ్‌మైట్లు, రాతి నిలువు వరుసలు, గుహ ముత్యాలు వంటి ఎన్నో ఆశ్చర్యకరమైన ఆకారాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

**భూగోళ శాస్త్రపరంగా ఈ గుహల ముఖ్య ప్రాధాన్యతలు ఇవే:**

**1. కొత్త భౌగోళిక యుగానికి పునాది:** భూమి యొక్క 4.6 బిలియన్ సంవత్సరాల చరిత్రను శాస్త్రవేత్తలు వేర్వేరు కాలఖండాలుగా విభజించారు. మౌమ్లూ గుహలో లభించిన ఆధారాల వల్ల, మనం ప్రస్తుతం బతుకుతున్న కాలానికి 'మేఘాలయన్ యుగం' అనే కొత్త పేరు పెట్టారు. భూమి చరిత్రలో భారతదేశంలోని ఒక ప్రాంతం పేరు మీద ఒక యుగాన్ని నామకరణం చేయడం స్టాలక్టైట్లు ఇదే మొదటిసారి.

**2. స్టాలగ్‌మైట్స్ –కాలపురుషుడి డైరీలు:** ఈ గుహల లోపల పైకప్పు నుండి కిందకు వేలాడే సున్నపురాయి నిర్మాణాలను స్టాలక్టైట్లు అని, కింద నేలపై నుండి పైకి పెరిగే స్తంభాలను స్టాలగ్‌మైట్స్ అని అంటారు. ఇవి వేల ఏళ్లుగా గుహ పైకప్పు నుండి కార్బొనేట్ ద్రవాలు చుక్కలు చుక్కలుగా పడటం వల్ల ఏర్పడతాయి. ఈ స్తంభాలలో చెట్ల కాండంపై ఉండే రింగుల వలె 'పొరలు' ఉంటాయి. ఈ పొరలలోని ఆక్సిజన్ ఐసోటోపులను శాస్త్రవేత్తలు విశ్లేషించి, వేల సంవత్సరాల క్రితం భూమిపై వర్షపాతం ఎలా ఉండేదో ఖచ్చితంగా లెక్కగట్టారు.

**3. గ్లోబల్ మార్కర్ గుర్తింపు:** మౌమ్లూ గుహలోని ఒక నిర్దిష్ట స్టాలగ్‌మైట్‌ను అంతర్జాతీయ భూగర్భ శాస్త్రాల యూనియన్ "గ్లోబల్ బౌండరీ స్ట్రాటోటైప్ సెక్షన్ అండ్ పాయింట్" లేదా 'గోల్డెన్ స్పైక్' గా అధికారికంగా గుర్తించింది. భూమి చరిత్రలో ఒక యుగం ముగిసి, మరో యుగం ప్రారంభమైంది అనడానికి అంతర్జాతీయంగా అంగీకరించే భౌగోళిక సరిహద్దు రేఖే ఈ GSSP. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి గోల్డెన్ స్పైక్ సైట్లు చాలా తక్కువగా ఉన్నాయి, అందులో మన దేశం నుండి నిలిచింది ఈ మౌమ్లూ గుహే.

**4. కరవు-రసాయన ఆధారాలు:** 4200 సంవత్సరాల క్రితం నాటి 'మహా కరవు' సాక్ష్యం సుమారు 4,200 సంవత్సరాల క్రితం (క్రీ.పూ. 2200 ప్రాంతంలో) భూమిపై అకస్మాత్తుగా తీవ్రమైన వాతావరణ మార్పులు సంభవించాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 సంవత్సరాల పాటు వర్షాలు పడకుండా మహా కరవు ఏర్పడింది. ఈ కరవు కారణంగానే ఈజిప్ట్, మెసొపొటేమియా, గ్రీస్ మరియు భారతదేశంలోని సింధు లోయ నాగరికతలు కుప్పకూలాయి. ఈ మహా కరవు ఎందుకు వచ్చింది, ఎలా వ్యాపించింది అనే విషయానికి సంబంధించిన రసాయన ఆధారాలు మౌమ్లూ గుహలోని స్టాలగ్‌మైట్ పొరల్లో శాశ్వతంగా లిఖించబడి ఉన్నాయి.

**5. కాల యంత్రాలు:** ప్రపంచంలోని మొదటి 100 భౌగోళిక వారసత్వ ప్రదేశాలలో ఒకటిభూగర్భ శాస్త్ర రంగానికి ఈ గుహ చేసిన అపారమైన సహకారానికి గాను, IUGS మరియు యునెస్కో సంయుక్తంగా మౌమ్లూ గుహను ప్రపంచంలోని మొదటి 100 అత్యంత ముఖ్యమైన భౌగోళిక వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే, అంతరిక్షంలో ఖగోళ శాస్త్రవేత్తలకు టెలిస్కోప్‌లు ఎంత ముఖ్యమో, భూమి యొక్క గత వాతావరణ రహస్యాలను, రుతుపవనాల చరిత్రను తెలుసుకోవడానికి భూగర్భ శాస్త్రవేత్తలకు ఈ మేఘాలయన్ గుహలు అంతటి అమూల్యమైన కాల యంత్రాలు.





పొందిన ఒక యుగ పరివర్తనకు అధికారిక భౌగోళిక సూచన స్థానంగా పనిచేస్తుంది.

అమెరికాలోని కార్ల్స్‌బాడ్ కేవర్న్స్ నేషనల్ పార్క్ (1995లో నమోదు చేయబడింది – ప్రమాణాలు vii, viii) కార్ల్స్‌బాడ్ గుహలు వాటి నిరంతర గుహా నిర్మాణ ప్రక్రియలకు, అరుదైన జీవజనిత గుహ నిర్మాణాలతో సహా అసాధారణ గుహా శిలా నిర్మాణాలకు ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రదేశం భూగర్భ సూక్ష్మజీవుల కార్యకలాపాలు, రసాయన నిక్షేపణను అధ్యయనం చేయడానికి ఒక సహజ ప్రయోగశాలగా మిగిలి ఉంది.

ఈ రెండు ప్రదేశాలు సజీవ ప్రయోగశాలలుగా పనిచేస్తాయి; అయినప్పటికీ, వాటి దృష్టి వేర్వేరుగా ఉంటుంది. కార్ల్స్‌బాడ్ నిరంతర భూస్వరూప, సూక్ష్మజీవుల ప్రక్రియలపై దృష్టి సారిస్తుండగా, మౌమ్లూ గుహ గత శీతోష్ణస్థితి సంఘటనల స్తరవిన్యాసపరంగా కీలకమైన రికార్డుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. మౌమ్లూ గుహ, నిరంతర జీవజనిత లేదా భూస్వరూప ప్రక్రియల కంటే, మానవ, పర్యావరణ చరిత్రను రూపొందించిన ఆకస్మిక శీతోష్ణస్థితి సంఘటనలతో సహా, భూమి ఇటీవలి భౌగోళిక గతంపై మన అవగాహనకు దోహదపడుతుంది.

ఫోంగ్ నా–కే బాంగ్ జాతీయ ఉద్యానవనం, వియత్నాం (2003లో నమోదు – ప్రమాణాలు viii, ix) ఫోంగ్ నా–కే బాంగ్ ఆసియాలోని అత్యంత విస్తృతమైన కార్ట్స్ భూభాగాలలో ఒకదానిని సంరక్షిస్తుంది, ఇందులో పెద్ద గుహల నెట్‌వర్క్, భూగర్భ నదులు, స్థానిక జీవవైవిధ్యం ఉన్నాయి. ఈ ప్రదేశం దాని కార్ట్స్ వ్యవస్థ పరిమాణం, పర్యావరణ సంపదకు ప్రసిద్ధి చెందింది.

భూస్వరూప పరిణామం, జీవవైవిధ్యం పరంగా ఫోంగ్ నా కార్ట్స్ వ్యవస్థలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. దీనికి ప్రాముఖ్యతను సంతరించుకుంది. అంతేకాకుండా, ఇది అధిక జనాభా, శీతోష్ణస్థితి సున్నితత్వం గల ప్రాంతమైన దక్షిణ ఆసియాలో క్వాటర్నరీ వాతావరణ వైవిధ్యంపై అవగాహనకు దోహదపడుతుంది.

మౌమ్లూ గుహ పైన పేర్కొన్న ప్రదేశాలకు భిన్నంగా, ప్రత్యేక, పరిపూరక విలువల సముదాయాన్ని అందిస్తుంది. పైన పేర్కొన్న గుహలు ప్రధానంగా వాటి వైభవం, గుహల నిర్మాణ వైవిధ్యం, భూ స్వరూప అభివృద్ధి లేదా జీవసంపదకు ప్రసిద్ధి చెందినప్పటికీ, మేఘాలయ దశ యొక్క ప్రపంచ కాలక్రమానుసార సరిహద్దును నిర్వచించడంలో మౌమ్లూ గుహ పోషించిన పాత్రకు ఇది ప్రత్యేకంగా ప్రసిద్ధి చెందింది.

– ఎన్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com








## దక్కన్‌ల్యాండ్ పది వసంతాలు (అక్టోబర్ 2022) పూర్తి చేసుకున్న వేళ..

# ప్రముఖుల అభిప్రాయాలు

***దక్కన్‌ల్యాండ్ అక్టోబర్ 2022తో 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సమయంలో వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు తమ అమూల్య అభిప్రాయాలను, సూచనలను వ్యాసాలుగా రాసారు. వాటిని దక్కన్‌ల్యాండ్‌లో సంవత్సరం పాటు వరుసగా ప్రతి నెలా ప్రచురించాం. ఆ వ్యాసాల్లోని ప్రధాన అంశాలను 'బైట్లు'గా మీ కందిస్తున్నాం.***

## దక్కన్ చైతన్య వాహిని దక్కన్ ల్యాండ్



ఈ నూటా ఇరవై ఒకటి సంచికలను చూస్తుంటే ఒక అద్భుతాన్ని అక్షరరూపంలో చదువుకున్నట్లుగా అనుభూతి చెందుతాం. పత్రికా రంగంలో నెలకొన్న కొన్ని మూసధోరణులను బద్దలు కొట్టింది దక్కన్‌ల్యాండ్. మానవ జీవితం చుట్టూ ఆవరించిన అనేక అంశాలపై లోతైన సమాచారాన్ని, జ్ఞానాన్ని, ఆలోచనల్ని ప్రేరేపించే వ్యాసాలను అందించే ప్రయత్నంలో సఫలీకృతం అయింది. సమాజంలో నెలకొన్న భిన్న సమస్యలలోని బాగోగులను చర్చించింది. సాంస్కృతికంగా తెలంగాణ ఎంత విలక్షణమైందో, ఇక్కడి సంప్రదాయాల, జీవన విధానాల్లోని ప్రత్యేకతలను దృశ్యమానం చేసేలా ప్రచురించిన ప్రత్యేకవ్యాసాలు ఈ నేలఋణం తీర్చుకునేలా అనిపిస్తాయి. విస్మృతికి, విస్మరణకు గురైన సాహితీవేత్తలను, రచనలను వెలుగులోకి తెచ్చిన వ్యాసాలు సాహిత్య చరిత్రలోని ఖాళీలను పూరిస్తాయి. దక్కన్‌ల్యాండ్ సంపాదకులు ఒక పరిధి పరిమితి పెట్టుకున్నట్లుగా అనిపిస్తారు. కాని సమాజానికి అవసరమైన ప్రతి విషయాన్ని రికార్డ్ చేసే తపన కనిపిస్తుంది. మనిషి కంట్లో పడని. నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన ప్రదేశాలను పరిచయం చేయడం ఒక చారిత్రక స్పృహగా వేదకుమార్‌గారిలో ప్రతిఫలిస్తుంది. శిధిలమైన కట్టడాలు, అనామకంగా పడివున్న శాసనాలను, కనుమరుగవుతున్న మానవజీవన ఆనవాళ్ళను సాంస్కృతిక ఆధారాలను ఎంతో పదిలంగా కాపాడే ప్రక్రియ దక్కన్‌ల్యాండ్‌లో ప్రదర్శిత మైంది.

– డా. ఎస్. రఘు,
m : 9848208533
e: raghusr17@gmail.com

## ఈ దశాబ్ది 'తెలంగాణ' మాస పత్రిక దక్కన్ ల్యాండ్

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను చర్చించడానికి, 'నీళ్ళు, నిధులు, నియామకాల' వినియోగంలో తెలంగాణ ప్రజలకు కలిగిన నష్టాన్ని చాటడానికి దక్కన్ లాండ్ అక్షరవేదికగా నిలబడ్డది. అంశాల వారీగా విశ్లేషణాత్మక వ్యాసాలను ప్రచురించింది. తెలంగాణ సాధన కొరకు ఉద్యమిస్తున్న ప్రజాసంఘాల పోరాటాలకు మద్దతుగా నిలిచింది దక్కన్ లాండ్. ఉద్యమకారుల చర్చలకు పెద్దపీట వేసింది.



నిర్లక్ష్యంచేయబడ్డ తెలంగాణా చరిత్ర, సంస్కృతుల ఔన్నత్యాలను చాటడానికి దక్కన్ లాండ్ తనవంతు కృషి చేసింది. మరుగునవడ్డ తెలంగాణ చారిత్రక ప్రదేశాలను, సాంస్కృతిక అంశాలను వ్యాసాల రూపంలో, కథనాల రూపంలో ప్రచురిస్తూ వస్తున్నది. సామాజికవేత్తలకు, వైజ్ఞానిక శాస్త్ర, సాంకేతిక నిపుణులకు, పర్యావరణ, జీవావరణ వేత్తలకు పారిశ్రామిక, వ్యావసాయిక, పురావేత్తలకు, శాసన పరిశోధకులకు, సాహిత్యకారులకు, సాంస్కృతిక కళాకారులకు 'రచనావేదిక' దక్కన్ లాండ్ తెలుగు మాసపత్రిక. తెలంగాణా అస్తిత్వప్రతీకగా, విస్తృత ప్రజాభిప్రాయ వేదికగా కొనసాగుతున్న దక్కన్ లాండ్ పత్రిక చిరస్థాయిగా నిలవాలని, పత్రికనొక ఉద్యమంగా నడిపిన పత్రికాసంపాదకులు మణికొండ వేదకుమార్ గారి ఆశయ పతాకగా జేజేయమానం కావాలని శుభాకాంక్షలు.

– శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698
e: akshara25@gmail.com




# తెలంగాణ బ్రాండ్ మన దక్కన్ ల్యాండ్



స్త్రీలు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు, కవులు, కళా కారులు, రచయితలు, మేధావులు, సంస్కృతి, సాహిత్యం, రాజకీయం అంశం ఏదైనా నిపుణుల అభిప్రాయాలతో ప్రత్యేక కథనాలు ప్రచురించి ఆదర్శవంతమైన సమాజం కోసం ఆరాటపడుతున్న పత్రిక దక్కన్ ల్యాండ్. కొండలు, గుట్టల సంరక్షణ, పర్యాటక కేంద్రాలు, పుణక్షేత్రాలు విశిష్టతలు, అడవులు, ఆదివాసీలు, పురాతన గుళ్ళు, గోపురాలు, శాసనాల సమాచారాన్ని, పురాతత్వ లోలోతుల్ని ప్రజలకు అందించడంలో దక్కన్ల్యాండ్ కృషి ఎనలేనిది. వివిధ రంగాల్లోని ప్రముఖుల పరిచయాలు, దక్కన్ సినిమా చరిత్ర వంటి ఆహ్లాదకరమైన ఎన్నో అంశాలను కథనాలుగా అందించిన ఘనత దక్కన్ల్యాండ్. ఎన్నికల సమయంలో పత్రికలు ఎట్లుండాలి. ప్రజలు ఎట్లుండాలి. ఓటు చైతన్యాన్ని పెంచడానికి ఎవరేంచేయాలి? వంటి ఎన్నో అంశాలతో దక్కన్ల్యాండ్ పత్రిక సమగ్రంగ రూపుదిద్దు కున్నది. నిరంతరం తెలంగాణ సంస్కృతిని ఇక్కడి జీవనవిధానాన్ని కండ్ల ముందుంచుతూ, వాటి సంరక్షణ కోసం పరితపించే విధానాన్ని గనుక మనం గమనించినట్లయితే దక్కన్ ల్యాండ్ తెలంగాణ బ్రాండ్ అనిపిస్తది.

–అంబటి వెంకన్న, m : 94927 55448
e : varji.ambati@gmail.com

# అస్తిత్వ భావవ్యాప్తికి అద్దం పట్టిన పత్రిక



నీళ్ళు, నిధులు, నియామ కాలంటూ మనవి మనకు కావాలని మన చరిత్ర, సంస్కృతి, భాష, జీవన సుఖ దుఃఖాలు మనవంటూ రక్షించుకునే అస్తిత్వంలోంచే 'దక్కన్ల్యాండ్' పత్రిక ఆవిర్భవించింది. మణికొండ వేదకుమార్ వస్తేరానీ కష్టాల్ నష్టాల్ అంటూ అడుగువేస్తున్నందుకు రోజూ హృదయా లింగనం చేసుకోవాలని పిస్తుంది. దక్కన్ల్యాండ్ తెలంగాణ ఉద్యమ కాలంలో తల్లి పాత్రను పోషించింది. నేటికీ మన అస్తిత్వాన్ని కాపాడడానికే శ్రమిస్తుంది. ఈ పత్రిక ఉద్యమకారులకూ కార్యకర్తలకు ఒక ఆయుధంగా నిలిచింది. వివిద విధాలైన మేధావుల ద్వారా విస్తృతమైన ఆలోచనల్ని పంచింది. సంఘటిత స్వరం కోసం శ్రమించింది.

దక్కన్ల్యాండ్ను చూస్తే మన అమ్మను మనం చూసుకుంటున్నట్లుంటది. మనదైన శిల్పం, కట్టడాలు, ఆలయాల నిర్మాణం వంటి ఎన్నింటినో దక్కన్ల్యాండ్ సగర్వంగా ఎత్తిచూపుతుంది. మన హైదరాబాదు సోయగాల్ని దక్కన్ల్యాండ్ ఎన్నెన్ని కథలు కథలుగా నానమ్మ అమ్మమ్మ చెప్పినట్టు మన జాతికి చెబుతుందో ఒక్కసారి ఊహించుకుంటే ప్రతి తెలంగాణ పాఠకుడు పరవశానికి గురవుతాడు. పార్కుల్ని చెరువుల్ని, బౌద్ధారామాల్ని, మన శాసనాల్ని పిల్లలకు అక్షరాల్ని నేర్పుతున్నట్లు నేర్పుతుంది. నిజాం కాలం నాటి విద్యావ్యవస్థనే కాదు సకల విద్యావ్యవస్థల్ని పూలదండగా గుచ్చి పాటకున్ని అలంకరింప చేస్తుంది. తెలంగాణకున్న ఖనిజ సంపదపైన ఎన్నెన్ని విశ్లేషణలు చేసిందో. ఒగ్గు కథల్ని, చిందు భాగోతాల్నీ, పిల్లల కథల్ని ఒకటారెండా తెలంగాణలోని సమస్తాన్ని అద్దం ముందు నిలిపింది.

–డా॥ నాళేశ్వరం శంకరం, m : 9440451960

# తెలంగాణ బ్రాండ్ దక్కన్ ల్యాండ్



డిసెంబర్ 9 ప్రజా స్వామ్యాన్ని వెనక్కి నెట్టిన కాలం. ఇచ్చిన తెలంగాణను తిరిగేసిన కాలం. పత్రికలన్ని సీమాంధ్ర గోడలకే సున్నాలేస్తున్న కాలం. చానళ్లన్ని పెట్టుబడిదారుల గొంతులై కూస్తున్న కాలంలో దక్కన్ ఆశయంతో, దక్కన్ పీఠభూమి సంస్కృతిని ప్రతిబింబించే తెలంగాణ అగ్గికలమై అక్షర పతాకమై ఉదయించిన మాసపత్రిక దక్కన్ ల్యాండ్.

తెలంగాణ ఉద్యమంలో నిలువెత్తు మొగురంలా నిలబడ్డది. అణువణువూ సాహిత్యాన్ని మశాల్ లా మండించింది. నెలనెల విభిన్న శీర్షికలతో దక్కన్ పత్రిక ఎప్పుడొస్తదా అని ఆనాటికాలం నుంచి ఈనాటి వరకు ఎదురుచూస్తున్న వాకిళ్ళు గనుమలు.

పత్రిక పదేళ్లపాటు జీవనదిలా, అఖండజ్యోతిలా పత్రికను ముద్రించి విశాలవేదికగా సామాజిక సాంఘిక రాజకీయ ఆలోచనలు పంచుతూ సాంస్కృతిక వారసత్వ అభివృద్ధికి పాటుపడుతూ ఈ నేల పునర్వికాసానికీ, పునర్వైభవానికి కంకణం కట్టుకొని పనిచేస్తున్న ఏకైక పత్రిక దక్కన్ ల్యాండ్. తెలంగాణలో విశేషమైన స్థానాన్ని సంపాదించుకున్న దక్కన్ పత్రిక పది వసంతాలు దశాబ్ది ఉత్సవాలు జరుపు కుంటున్న శుభసందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు.

– వనపట్ల సుబ్బయ్య m : 9492765358
e : vanapatlasubbaiah1972@gmail.com

## మండోదరి (రావణాసురుని భార్య) పూజించినది

# కొలనుపాక తీర్థంకరుడినా!

భారతదేశ ఆధ్యాత్మిక వైవిధ్యానికి జైన త్యాగం, జైన ధ్యానం, ఆత్మ నియంత్రణ పద్ధతులు మరియు జైన సంప్రదాయం మరింత వైభవాన్ని సంతరింపజేశాయి. ప్రధానంగా జైనం అహింస సూత్రాన్ని ముఖ్యమని భావించింది. ఇది ఇతర మతాలపై సైతం తన ప్రభావాన్ని చూపించింది అనుటలో ఎలాంటి సంశయం లేదు. భారతదేశం నందు సర్వత్ర జైన యిజం వ్యాపించినప్పటికీ ప్రత్యేకించి గుజరాత్, రాజస్థాన్ మరియు కర్ణాటక ప్రాంతం నందలి రాజులు జైనయిజంను ఆదరించారు మరియు ప్రోత్సహించారు.ఈ ప్రాంతాల్లో అనేక జైన బసదులను లేదా దేవాలయములను ఏర్పాటు చేశారు. ఆ దేవాలయములనందే విద్యాసంస్థలను ఏర్పర్చినారు. దానివల్ల అనేక పురాతన గ్రంధాలు మరియు సంప్రదాయాలను రక్షించగలిగారు. అతి పురాతనమైనదిగా గుర్తించబడ్డ ఈ జైనయిజం, 24 తీర్థంకరుల వల్ల నేటికీ సజీవంగా ఉంది. మొట్టమొదటి తీర్థంకరుడు ఆదినాథుడు లేదా వృషభనాథుడు కాగా చివరి 24వ తీర్థంకరుడుగా మహావీరుని గురించి చెబుతారు. అయితే వృషభనాథుడు త్రేతాయుగము కన్నా ముందు వాడని చెబుతారు అదేవిధంగా మహావీరుడు 540-468 BCE కాలంనాటి వాడని చెబుతారు. 22వ తీర్థంకురుడైన నేమినాథుడు కృష్ణుని కాలం నాటివాడని చెబుతారు.



తీర్థంకరుడు అనగా మోక్షానికి మార్గం చూపేవాడు అని అర్థం. మోక్షానికి మార్గం చూపిన 24 తీర్థంకర్ల పేరిట భారతదేశంలో అనేక జైన దేవాలయాలు వెలిసినాయి. అని ప్రధానంగా భక్తి, ధ్యానం మరియు ఆత్మశుద్ధి కోసం నిర్మించబడ్డాయి, ప్రత్యేకించి ఈ ఆలయముల నందలి విగ్రహం ముందు ధ్యానం చేయడం ద్వారా మనస్సు నిర్మలంగా మరియు ప్రశాంతంగా ఉంటుందని జైనుల విశ్వాసం. అంతేకాకుండా అహింస, సత్యం మరియు అపరి గ్రహం వంటి ముఖ్యమైన సిద్ధాంతాలను తెలియజేసేందుకు ఈ జైన దేవాలయాలు దోహద కారణమైనాయి. ఈ జైన దేవాలయాలు ఆధ్యాత్మికత మాత్రమే కాక విద్యా కేంద్రాలుగా సైతం పనిచేసాయి. అంతేకాకుండా శిల్పకళ సంస్కృతితో పాటు పర్యాటక రంగాల్లో సైతం ప్రముఖ పాత్రను పోషించినాయి.

జైన గ్రంథాల అనుసరించి అది నాథునికి ఎందరో సంతానం కలిగినప్పటికీ ప్రధానంగా ఇద్దరు పేర్లు తెలియచేస్తారు. మొదటివాడు భరతుడుకాగా రెండవ వాడు బాహుబలి. ఆదినాథుని కుమారుడైన భరతుడు రాజ్యమేలడం వలన భారతదేశానికి భారత అన్న పేరు వచ్చిందని జైనుల విశ్వాసం. అది నాథుడు సంసారాన్ని వదిలేసి సర్వసంగ పరిత్యాగిగా మారి దీర్ఘకాల తపస్సు చేసి సర్వజ్ఞత్వం పొందారు. అనేక మందికి బోధనలు చేసి చిట్టచివరకు అష్టపద పర్వతంగా పిలవబడే కైలాస పర్వతము నందు నిర్యాణం చెందినారని జైన పండితులు తెలియజేస్తారు. ప్రథమ తీర్థంకరుడుగా గుర్తించబడ్డ ఆదినాధుని గుర్తు ఎద్దు.

24 మంది తీర్థంకర్లలో అధిక భాగం 20 మంది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నందు జన్మించగా, నలుగురు తీర్థంకర్లు బీహార్ మరియు నేపాల్ సరిహద్దుల్లో జన్మించినట్లు తెలుస్తుంది. అలాగే చివరి తీర్థంకరుడైన మహావీరుడు బీహార్ రాష్ట్రం నందు జన్మించాడు. అలాగే మొదటి తీర్థంకరుడు అయిన ఆదినాథుడు కైలాస పర్వతంలో నిర్యాణం చెందగా, 20 మంది తీర్థంకరులు ఝార్ఖండ్ రాష్ట్రం నందలి సమ్మేద శిఖరంలో నిర్యాణం చెందారు. మిగిలిన ముగ్గురు తీర్థంకర్లలో ఒకరు గుజరాత్ నందలి గిరినారులో నిర్యాణం చెందగా మిగిలిన ఇద్దరు తీర్థంకర్లు బీహార్ నందలి చంపాపురి మరియు పావపురి నందు నిర్యాణం చెందారు. 12వ తీర్థంకరుడైన వసుపూజ్య చంపాపురు నందే జన్మించి చంపాపురు నందే నిర్యాణం చెందారు. 24వ తీర్థంకరుడు అయిన మహావీరుడు బీహార్ నందలి కుందగ్రామంలో జన్మించి పావపూరీలో నిర్యాణం చెందారు.

24 మంది తీర్థంకర్ల యందు ఆధినాథుడు, వ్యవసాయంను మాత్రమే నేర్పడంగాక కలలు కూడా నేర్పించారు మిగిలిన వారు త్యాగం, జ్ఞానం, దానం, దయ, వినయం, నియమం, ధర్మం, పవిత్రత, శాంతి, మంగళకరం, శాంత స్వభావము, ధర్మ ప్రచారం, నిర్మలత్వం, అనంత జ్ఞానం, ఉపదేశం, వైరాగ్యం, తపస్సు, శుద్ధి, ఆత్మజ్ఞానం మరియు త్యాగం నందు దృష్టి సాగించారు.

24 జైనతీర్థంకరుల గొప్ప లక్షణములను పరిరక్షించేందుకు భారతదేశం నందలి రాజస్థాన్, గుజరాత్ మరియు కర్ణాటక ప్రాంతం రాజులు తమ ప్రాంతం నందు జైన దేవాలయములు లేదా జైన బసదులను నిర్మించారు.

హిందూ దేవాలయ నిర్మాణశైలికి జైన దేవాలయ నిర్మాణ

ఈ క్రింది పట్టిక 24 తీర్థం కొర్ల గురించి సంక్షిప్తంగా తెలియజేస్తుంది.

| వ.నెం. | తీర్థంకరుని పేరు | తందండ్రుల పేర్లు | జన్మ స్థలము & రాష్ట్రము | గుర్తు | నిర్యాణ స్థలము & రాష్ట్రము |
|---|---|---|---|---|---|
| 1 | ఆదినాథుడు | నాభి రాజు, మరుదేవి | అయోధ్య-ఉత్తర్‌ప్రదేశ్ | ఎద్దు | కైలాశ్ పర్వతము ప్రస్తుతము చైనాలో వుంది |
| 2 | అజితనాథ | జితశత్రు, విజయ | అయోధ్య-ఉత్తర్‌ప్రదేశ్ | ఏనుగు | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 3 | శాంబవంత | జితాలి, సేన | శ్రావస్తి - ఉత్తర్‌ప్రదేశ్ | గుర్రం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 4 | అభినందననాథ | సమ్వర, సిద్ధార్థ | అయోధ్య -ఉత్తర్‌ప్రదేశ్ | కోతి | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 5 | సుమతినాథ | మేఘ, మంగళ | అయోధ్య -ఉత్తర్‌ప్రదేశ్ | హంస | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 6 | పద్మప్రభ | శ్రీధర, సుశీమ | కౌశాంబి - ఉత్తర్‌ప్రదేశ్ | కమలం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 7 | సుపార్శ్వనాథ | ప్రతిష్ట, పృథ్వి | వారణాశి - ఉత్తర్‌ప్రదేశ్ | స్వస్తిక | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 8 | చంద్రప్రభ | మహాసేన, లక్ష్మణ | చంద్రపురి- ఉత్తర్‌ప్రదేశ్ | చంద్రుడు | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 9 | పుష్పదంత | సుగ్రీవ, రమా | కాఖండి- ఉత్తర్‌ప్రదేశ్ | మొసలి | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 10 | శీతలనాథ | ధృడరథ, నంద | భక్తలాపురం-ఉత్తర్‌ప్రదేశ్ | శ్రీవత్స | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 11 | శ్రీయంశనాథ | విష్ణు, విష్ణ | సింహపురి- ఉత్తర్‌ప్రదేశ్ | ఖడ్గమృగం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 12 | వసుపూజ్య | వసుపూజ్య, జయ | చంపాపురి -బీహార్ | మహిశం | చంపాపురి, బీహార్ |
| 13 | విమలనాథ | కృతవర్మ, శ్యామ | కాంపిల్య -ఉత్తర్‌ప్రదేశ్ | పంది | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 14 | అనంతనాథ | సింహసేన, సుయాశ | అయోధ్య -ఉత్తర్‌ప్రదేశ్ | ఫాల్కన్ పక్షి లేదా గ్రద్ధ | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 15 | ధర్మనాథ | భాను, సువ్రత | రత్నపురి- ఉత్తర్‌ప్రదేశ్ | వజ్రం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 16 | శాంతినాథ | విశ్వసేన, అబీర | హస్తినాపుర-ఉత్తర్‌ప్రదేశ్ | జింక | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 17 | కుంతునాథ | శూరసేన, శ్రీదేవి | హస్తినాపుర -ఉత్తర్‌ప్రదేశ్ | మేక | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 18 | అరనాథుడు | సుదర్శన, దేవి | హస్తినాపుర-ఉత్తర్‌ప్రదేశ్ | చేప | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 19 | మల్లీనాథ | కుంభ, ప్రభావతి | మిథిల-బీహార్ & నేపాల్ సరిహద్దులు | కలశం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 20 | మునిసువర్తనాథ | సుమిత్ర, పద్మావతి | రాజగీర్-బీహార్ | తాబేలు | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 21 | నామినాథ | విజయ, విప్ర | మిథిల-బీహార్ & నేపాల్ సరిహద్దులు | నీలకమలం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 22 | నేమినాథ | సముద్రవిజయ, శివదేవి | శౌరీపురి- ఉత్తర్‌ప్రదేవ్ | శంఖం | గిరినార్, గుజరాత్ రాష్ట్రం |
| 23 | పార్శ్వనాథుడు | అశ్వసేన, వామ | వారణాశి-ఉత్తర్‌ప్రదేశ్ | సర్పం | సమ్మేత పర్వతం-జార్ఖండ్ |
| 24 | మహావీరుడు | సిద్ధార్థ, త్రిశల | తుంగగ్రామం-బీహార్ | సింహం | పవపూరి, బీహార్ రాష్ట్రం |

శైలికి పెద్దగా బేధం ఉండదు. జైన దేవాలయము నందు గర్భగృహం, అంతరాళం, అర్ధమండపం, ముఖమండపం, రంగమంటపం, సభామంటపం కలిగి ఉంటాయి. అయితే ధ్వజస్తంభమునకు గాని గాలిగోపురంనకు గాని పెద్దగా ప్రాముఖ్యత ఉండదు. ఒకవేళ వున్నప్పటికి హిందూ దేవాలయం గాలిగోపురం అంత పెద్దగా ఉండదు.

ఉత్తర భారతంలోని జైన దేవాలయంలో, చలువరాయి ఉపయోగించి దేవాలయ నిర్మాణాన్ని కావిస్తారు. తీర్థంకర్ల విగ్రహాలను సైతం చలువ రాయితో నిర్మిస్తారు. ఆ తరువాత ప్రాధాన్యత తీసుకున్నటువంటిది గ్రానైట్ రాయి మరియు బెసాల్ట్ రాయి. జైన దేవాలయములను గమనిస్తే సమమితితో (perfect symmetry) నిర్మించబడి ఉంటుంది. అంతేకాకుండా సూర్యుని గమనమును

అనుసరించి సహజ కాంతి వచ్చే విధంగా దేవాలయ నిర్మాణం కావిస్తారు. సాధారణ నిర్మాణ శైలికి అత్యధిక ప్రాధాన్యత, నియంత్రణ కలిగిన సున్నితమైన అలంకార నిర్మాణాలను దేవాలయం నందు గమనించగలము. గాఢమైన రంగులు వేయకుండా మరియు శిఖరం నందు ఎక్కువ బొమ్మలు (Stucco) లేకుండా నిర్మాణం గావిస్తారు. అందమైన తోరణాలతో పైకప్పు గుమ్మటాలతో విభిన్నమైన డిజైన్లు కలిగిన స్తంభాలతో చూడ చక్కని జైన దేవాలయంలను భారతదేశము నందు గమనించగలం. దీని ఆర్కిటెక్చర్‌కు ప్రత్యేకత కలిగి ఉంటుంది. యక్ష మరియు యక్షిణి అనబడే సహాయ దేవతలతో అందమైన మరియు పుష్పాలంకృతమైన తోరణ ద్వారాలతో నిర్మాణం కలిగి ప్రధాన విగ్రహముల నందు శాంతి మరియు సమత ప్రతిబింబించే విధంగా తీర్థంకర్ల విగ్రహాలను గమనించగలము. ప్రత్యేకించి ఈ తీర్థంకరుల విగ్రహాలను పద్మాసనం నందు గాని అర్థ పద్మాసనం నందు గాని కయోత్సర్గ ఆసనం నందు గాని గమనించగలం. మరో ప్రత్యేకత ఏమిటంటే విగ్రహాల యందు ఎక్కువ అలంకారంలను గమనించము.



ఇటువంటి జైన దేవాలయంలు భారతదేశము నందు ఎన్నో ఉన్నప్పటికీ కొన్నింటికి మాత్రమే ప్రత్యేకత సంతరించుకున్నవి అవి(1) దిల్‌వాలా జైన దేవాలయం (2) గుజరాత్ నందలి పాలిటానా దేవాలయం, (3) కర్ణాటక నందలి శ్రావణ బెళగొళ దేవాలయం (4) గుజరాత్ నందలి గిరినాథ్ దేవాలయం, (5)మధ్యప్రదేశ్ నందలి మహావీర్ దేవాలయం, (6) ఆంధ్రప్రదేశ్ నందలి పచ్చ పార్శ్వనాథ దేవాలయం (పెనుగొండ) (7) తెలంగాణ నందలి కొలనుపాక దేవాలయం. ఆంధ్రప్రదేశ్ పెనుగొండ నందలి పచ్చ పార్శ్వనాథ దేవాలయం మరియు తెలంగాణ నందలి కొలనుపాక జైన దేవాలయంలో తప్ప మిగిలిన రాష్ట్రంలలోని దేవాలయముల నందు తీర్థంకర్లను చలువ రాయి, గ్రానైట్, బెసాల్ట్ మరియు పంచలోహ విగ్రహంతో తయారు చేయడం జరిగినది.

### కొలనుపాక – జైన దేవాలయం ప్రత్యేకత

జైన సంప్రదాయ ప్రకారం ఆదినాథుడు లేదా వృషభనాథుడు చాలా పురాతన కాలంలో జీవించాడని, త్రేతాయుగం కన్నా ముందువాడని (కృతయుగం) జైన గ్రంథాలు తెలియచేస్తాయి .ఇక్ష్వాకు వంశస్థుడైన నాభి మరియు మరుదేవులకు ఆదినాథుడు అయోధ్య నందు జన్మించాడు అని జైన పండితులు చెబుతారు. పంటలు పండించడం, వ్యాపారం చేయడం, విద్య, కళలు మరియు సామాజిక జీవన నియమాలు మానవులకు మొదటిగా నేర్పిన మహానుభావుడుగాను మొదటి గురువుగాను ఆదినాథుని గురించి చెబుతారు. అందుకే జైనులు అతనిని మొదటి మానవ నాగరికత గురువుగా భావించడమేకాక పూజిస్తారు.

### మండోదరి పూజించిన ఆదినాథుడు

పురాణాలను అనుసరించి మయాసురుని కూతురు, లంకాధిపతి రావణాసురుని భార్య అయిన మండోదరి తనతో పాటు తను పూజించిన ఆదినాథుని విగ్రహమును లంకకు చేరవేసిందనే కథ ఎక్కువగా ప్రాబల్యంలో ఉంది. రామ, రావణ యుద్ధం అనంతరం మండోదరి ఆదినాథుని విగ్రహమును సముద్రంలో విడిచివేసిందని అది చివరకు కొలనుపాక చేరిందనే కథ చెబుతారు. మరియొక కథానుసారం మండోదరి కోరిక మేరకు రావణబ్రహ్మ ఇంద్రునితో పోరాడి ఆదినాథుని విగ్రహమును తన భార్యకు కానుకగా ఇచ్చాడనే కథ సైతం వాడుకలో ఉంది. రావణాసురుని మరణాంతరం మండోదరి విగ్రహమును సముద్రంలో వదిలేసిందని చెబుతారు. ఆ విగ్రహాన్ని మత్స్యకారులు లేదా వ్యాపారాలు కనుగొని, కొలనుపాక ప్రాంతానికి చేర్చారనే కథ సైతం వాడుకలో ఉంది. మరియొక కథ అనుసరించి ఒక రాజు తన రాజ్యంలోని ప్రజలు భయానకమైన విషజ్వరాలతో తల్లడిల్లి పోతుండగా సముద్రము వద్ద ప్రార్థన చేయమని అతనికి కలలో అశరీరవాణి తెలిపిందని, సముద్రము వద్ద ప్రార్థించిన రాజుకు ఆదినాథుని విగ్రహం దొరికిందని, దానిని తన రాజ్యంలో ప్రతిష్ఠ చేయదలచి రథంలో విగ్రహమును తీసుకొని వస్తుండగా తిరిగి చూడవద్దన్న అశరీరవాణి హెచ్చరికను మరిచి ఒక సమయములో, రాజు వెనక్కి తిరిగి చూడగా అక్కడే రథము ఆగిపోయిందని, ఆ ప్రదేశము నందే ఆ విగ్రహమునకు దేవాలయ నిర్మాణమును గావించినారని చెబుతారు. ఆ ప్రదేశమే కొలనుపాక.

చారిత్రక ఆధారాలు కొలనుపాక గురించి ఏమి చెబుతాయో గమనిద్దాం. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో మౌర్యసామ్రాజ్యం తర్వాత శాతవాహనులు, ఆ తర్వాత ఇక్ష్వాకులు కీలక పాత్ర వహించారు. ఇక్ష్వాకులు విజయపురిని (నాగార్జునకొండ) రాజధానిగా చేసుకుని పరిపాలించారు. వీరు 225–300 CEలో పరిపాలించారని చరిత్రకారులు చెబుతారు. ఈ కాలంలోనే కొలనుపాక ఏర్పడి ఉండవచ్చన్న అభిప్రాయం కూడా ఉంది. అంతేగాక జైనయిజం మరియు బౌద్ధయిజం సైతం వీరి కాలంలో అభివృద్ధి చెందాయి అని కూడ పేర్కొన్నారు.

విష్ణు కుండినులు క్రీస్తు శకం ఐదు మరియు ఆరో శతాబ్దంలో ప్రధానంగా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించారు. వీరు ఇంద్రపాలనగరం (నల్గొండ జిల్లా)నుండి అమరావతి వరకు మరియు విజయవాడను సైతం పరిపాలించారు. విష్ణుకుండినలు, చాళుక్య రాజులను సైతం ఓడించినారని చెబుతారు. ఉండవల్లి మరియు విజయవాడలో ఉన్న మొగల్రాజాపురం గుహలు వీరి కాలానివే.

*(తరువాయి వచ్చే సంచికలో)*

–డా॥ జి.యస్.రామయ్య
INTACH సభ్యులు – కర్నూలు జిల్లా చాప్టర్,
ఆంధ్రప్రదేశ్, m : 898 555 0007




# ఘనంగా మాదారపు వాణిశ్రీ 'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ

ప్రముఖ రచయిత్రి మాదారపు వాణిశ్రీ రచించిన 'పూటకూళ్ళవ్వ' నవల పుస్తకావిష్కరణ సభ దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22న హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హిమాయత్ నగర్‌లోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్.రఘు అధ్యక్షత వహించగా, నవతెలంగాణ అసోసియేట్ ఎడిటర్ కె.ఆనందాచారి నవలను ఆవిష్కరించారు. 'దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్' (డిటిహెచ్) చైర్మన్ మణికొండ వేదకుమార్ ఆత్మీయ వాక్యాలు అందించగా, ప్రముఖ కవయిత్రి, విమర్శకురాలు డా. కొండపల్లి నిహారిణి నవలపై సమీక్ష చేశారు. కార్యక్రమాన్ని డా. ఇడికోజు శ్రీనివాసాచారి సమన్వయం చేశారు.

**డా. ఎస్. రఘు** మాట్లాడుతూ... 'పూటకూళ్ళవ్వ' నవల తనకు ఆర్.కె.నారాయణ్ 'మాల్గుడి డేస్'ను గుర్తు చేసిందన్నారు. సాధారణ జీవితం, మానవ సంబంధాలు, అనుబంధాలు, సంతోషాలు, సంఘర్షణలను రచయిత్రి సహజత్వంతో, కళాత్మకంగా చిత్రించారని పేర్కొన్నారు. పాత్రల మధ్య సంబంధాల ద్వారా మానవీయ విలువలను ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయ మని, జీవితం పట్ల అవగాహన కలిగించే సందేశాత్మకమైన నవలగా 'పూటకూళ్ళవ్వ' నిలిచిందని పేర్కొన్నారు.

**కె. ఆనందాచారి** మాట్లాడుతూ... పుస్తకాలు సమాజాన్ని ప్రతిబింబించడంతో పాటు దానితో సంభాషిస్తాయని అన్నారు. రచయిత చుట్టూ ఉన్న జీవితాన్ని నిశితంగా పరిశీలించినప్పుడే సహజమైన పాత్రలు, విశ్వసనీయమైన సంఘటనలు సాహిత్యంలో రూపుదిద్దు కుంటాయని పేర్కొన్నారు. 'పూటకూళ్ళవ్వ'లో జీవన వాస్తవికతకు, మానవ సంబంధాలకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రత్యేకంగా నిలిచిందన్నారు.

**మణికొండ వేదకుమార్** మాట్లాడుతూ... సాహిత్య సృజనను ప్రోత్సహించడం, కొత్త రచనలను పాఠకులకు పరిచయం చేయడం సాహిత్య సంస్థల బాధ్యతల్లో భాగమని అన్నారు. సమాజంలోని అనుభవాలను సాహిత్యంగా మలిచే రచయితలకు ప్రోత్సాహం అవసరమని పేర్కొంటూ, 'పూటకూళ్ళవ్వ' పాఠకాదరణ పొందాలని ఆకాంక్షించారు.

**డా. కొండపల్లి నిహారిణి** నవలపై సమీక్ష చేస్తూ... ఇతివృత్తం, పాత్రల నిర్మాణం, కథన పద్ధతి, భాష, శైలి, మానవ సంబంధాల చిత్రణను విశ్లేషించారు. పాత్రలు కథను ముందుకు నడిపించే సాధనాలుగా కాకుండా స్వతంత్ర వ్యక్తిత్వంతో రూపుదిద్దుకున్నాయని అన్నారు. పాత్రల మధ్య సంబంధాలు, వాటి ద్వారా వ్యక్తమయ్యే భావోద్వేగాలు, ఆనందాలు, సంఘర్షణలు నవలకు జీవం పోశాయని పేర్కొన్నారు.

రచయిత్రి **మాదారపు వాణిశ్రీ** మాట్లాడుతూ... తన చుట్టూ కనిపించిన జీవితం, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులు, జీవన అనుభవాలే 'పూటకూళ్ళవ్వ' రచనకు ప్రేరణగా నిలిచాయని తెలిపారు. నవలను ప్రచురించి పాఠకుల ముందుకు తీసుకువచ్చిన దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్‌కు, సభకు హాజరైన సాహితీవేత్తలు, కవులు, రచయితలు, పరిశోధకులు, సాహిత్యాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ సభకు పలువురు ప్రముఖ రచయితలు, సాహితీవేత్తలు, పరిశోధకులు హాజరయ్యారు. కూరెళ్ల శ్రీనివాస్, అంబటి వెంకన్న, మందరపు హైమవతి, జుగాష్ విలి, డా. నీరజ అమరవాది, లలిత, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధకులు పల్లె సతీష్, నరేష్ భూక్యా, మధుసూదన్ తదితరులు పాల్గొని రచయిత్రికి అభినందనలు తెలిపారు.

–సైయ్యద్ ఖైజర్
కోఆర్డినేటర్–దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్
m : 9030 626288





# రాయలసీమ ఆకాంక్షలకు నిలువెత్తు రూపం
# పప్పూరు రామాచార్యుల 'శ్రీ సాధన పత్రిక'

పప్పూరు రామాచార్యులనగానే అనంతపురం నుంచి వెలువడి చరిత్ర సృష్టించిన 'శ్రీ సాధన పత్రిక' గుర్తుకు రావడం కద్దు. ఉజ్వలమైన సామాజిక పూర్వరంగంతోనే పప్పూరు రామాచార్యులు (1896-1972) స్వాతంత్ర్య యోధుడిగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా, కళాకారుడుగా పరిణమించాడు. పప్పూరి వారి ఐదు దశాబ్దాల సంపాదక జీవితంలో మొదటి మూడున్నరేళ్లు 'పినాకిని' పత్రికను నడిపినా, రెండవదైన 'శ్రీ సాధన పత్రిక'ను రాయలసీమ ప్రాంతపు గుండెచప్పుడుగా 1926 నుంచి నాలుగున్నర దశాబ్దాలకు పైబడి విజయవంతంగా నిర్వహించారు. తొలి పత్రిక నామకరణంలో ప్రాంతీయ అస్తిత్వం ప్రతిఫలించినా, రెండవ దానిలో అప్పటికి అత్యంత అవసరమైన కార్యసాధనా దృష్టి ప్రతిబింబించింది.



రామాచార్యులు అనంతపురంలో 1896 నవంబరు 8న నరసింహాచార్యులు, కొండమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి దగ్గరే తెలుగు, సంస్కృతాలు నేర్చుకుని, రాజమండ్రిలో మెట్రిక్యులేషన్, మద్రాసు పచ్చియప్ప కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుకున్నారు. రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం, వద్దాది సుబ్బారాయుడు వంటి వారు, మదరాసులో చదువుతున్న కాలంలో 'ఆంధ్ర పత్రిక' సంపాదకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్ఫూర్తి. రామాచార్యులు అనంతపురం కళాశాలలో బి.ఏ. చదువు కోసం ప్రవేశించినప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణయ్య అక్కడ తత్వశాస్త్ర అధ్యాపకులుగా ఉన్నారు. 1920 మార్చిలో బి.ఏ. చదువును పేదరికం కారణంగా మధ్యలో వదలి కలెక్టరు కచేరీలో గుమాస్తాగా చేరిన రామాచార్యులు స్వతంత్ర భావాలతో ఆ బ్రిటీషు కొలువును సంవత్సరం మించి చేయలేదు. అనంతపురం కళాశాలలో బి.ఏ. చదువుతున్నప్పుడు పప్పూరు మిత్రులు వర్తమాన సంఘపు దురాచారాలను ఖండిస్తూ 'వదరుబోతు' పేరున పక్షానికో కరపత్రం వేసేవారు. ఈ వ్యంగ్యరచనలకు 'టాట్లరు' రచనలు మార్గదర్శకం. ఇందులో వెలువడిన కొన్ని వ్యాసాలు అదే పేరుతో పుస్తకంగా ప్రచురింపబడినాయి. ఇంగ్లీషు వారి ఉద్యోగాన్ని 1921 మార్చిలో వదలివేసిన రామాచార్యులు బాలురుగా ఉన్న నీలం సంజీవరెడ్డి, రాజశేఖరరెడ్డి ఇంకా మరో ఇద్దరు పిల్లలకు ట్యూటరుగా అనంతపురం సమీపంలో ఉండే ఇల్లూరుకు వెళ్లారు. ఆ గ్రామంలో కైపా సుబ్రహ్మణ్య శర్మ, కైపా మహానందయ్య, పాలకొండ రామచంద్రశర్మ గార్లతో కలసి పప్పూరు రామాచార్యులు ఒక పత్రికను వెలువరించడానికి ప్రణాళిక వేశారు. తొలుత ఆ పత్రికకు 'స్వరాజ్యోదయం'అని భావించినా, రామాచార్యుల సలహా మీద ఆ పత్రిక 'పినాకిని' పేరుతో 1922 సెప్టెంబరు 16న మొదలైంది. అయితే ఇది ఎంతో కాలం సాగలేదు, ఆ మిత్రులు విడిపోయారు.

అనంతపురంలోని సొంత ముద్రణాలయంలో ప్రతి శనివారం 12 పుటలతో వచ్చేట్టు, వారపత్రికగా 1926 ఆగస్టు 14న 'శ్రీ సాధన పత్రిక' మొదలైంది. "దత్త మండలంల స్థితిగతుల నరసి వెల్లడించుటకు ఇప్పుడు తగిన పత్రిక లేని లోపమును బాపుటకై మరల ఒక వారపత్రిక నెలకొల్ప ప్రయత్నించు మమ్ము మండల వాసులు చాలామంది ప్రోత్సహించిరి..." అని తొలి సంచికలో వివరమైన ఆశయాలను ప్రకటిస్తూ రాజకీయ అంశాలే కాకుండా సాంఘిక, నైతిక, సారస్వత విషయాలు తమ పత్రిక అజెండాలో ఉన్నాయని పేర్కొంటూనే; సాంఘిక జీవనమే, నైతికవర్తనమే ప్రధానమని విస్పష్టంగా చెప్పడం విశేషం. "రాజకీయం ప్రజలకు సంబంధించినది కాదా? ప్రజలతో సంబంధంలేని రాజకీయ ముంటుందా? సహకారమూ రాజకీయమే! ప్రభుత్వము, ప్రజలు వేరుగా ఉన్నంతవరకూ భారతజాతి యొక్క ప్రతి విషయమూ రాజకీయమే అవుతుంది. మనం తినే తిండి, త్రాగే నీరు, కట్టే గుడ్డ, కట్టుకున్న పెండ్లాము, కన్నబిడ్డలు అంతా రాజకీయమే. కానీ దృష్టి మార్చుకుని చూస్తే ఏదీ రాజకీయము కాజాలదు. అప్పుడు ప్రతిదీ సాంఘిక సమస్య అవుతుంది. ఈ దృష్టి మార్పుకే స్వరాజ్య సంపాదనమని పేరు..." అని ఆ పత్రికా సంపాదకులు పప్పూరు రామాచార్యులు 1929 మే 11వ తేదీ 'శ్రీ సాధన పత్రిక' సంచికలో ఒక విమర్శకు జవాబుగా రాశారు . ప్రకటనలు లేకపోతే పత్రికల నిర్వహణ కష్టమని 1926 నవంబర్ 24న అభిప్రాయం రాసిన వీరు, తర్వాత 10 నెలలకు దత్తమండలంలోని పత్రికలు అన్నింటినీ ఏకం చేసి, ఒక బలమైన పత్రిక నడిపిస్తే బాగుంటుందని, ఎవరైనా ప్రయత్నిస్తే మంచిదని చెప్పడమే కాకుండా; ఎవరైనా అలా ముందుకు వస్తే తాము కలిసి పని చేస్తామని ప్రకటించుకున్నారు. అలాంటి ప్రయత్నం ఏది ఫలించినట్టు లేదు. కార్యరూపం దాల్చకపోయినా సహకారం ప్రాతిపదికగా చేయబడిన ఈ సూచన చాలా విలువైనదే.

వేమనను తెలుగువారికి కొత్తగా సమగ్రంగా పరిచయం చేస్తూ రఘుపతి వెంకటరత్నం నాయుడు పూనికతో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ఆధ్వర్యంలో 1928 అక్టోబర్ 25 నుండి 31 దాకా ఒక వారం రోజులపాటు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ అనంతపురం లోని సీడెడ్ డిస్ట్రిక్ట్స్ కాలేజ్ (ఇప్పటి ఆర్ట్స్ కాలేజ్) భవనంలో ప్రఖ్యాతమైన ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగానే రాళ్లపల్లి వారిని ప్రస్తుతిస్తూ చిలుకూరు నారాయణరావు చెప్పిన పద్యాలు ఈ పత్రిక 1928 నవంబర్ 17 సంచికలో కనబడతాయి, వాటిలోనిదే "రాళ్లపల్లి యందు రాళ్ళెన్నో పుట్టెను..." అనే పద్య పాదం. 1929-1936 మధ్యకాలంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాల విశేషాలు, ఉపన్యాసాలు ఈ

పత్రికలోనే నిక్షిప్తమయ్యాయి. ఇంకా శివశంకర పిళ్ళై 1930 ఇంగ్లాండ్ యాత్ర విశేషాలు 1930 మే నెల నుండి లేఖల రూపంలో ఈ పత్రికలో ప్రచురింపబడ్డాయి. తన పత్రికలో తొలినుంచి కవిత్వం, కథలు, ఉపన్యాసాలు, నాటికలు, వ్యాసాలు, లేఖలు, నాటక విమర్శలు, మాండలిక వృత్తాంతాలు, యాత్రాచరిత్రలు, భాషా విషయాలు, శాసన విషయాలు, సాహిత్య విమర్శ, పుస్తక సమీక్షలు, నీతి కథలు వంటివి ఎన్నో రాజకీయ వార్తలు, వ్యాఖ్యలతో పాటు ప్రచురించేవాడు. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర వంటి విద్వాంసుల తొలి రచనలు ఈ పత్రిక కుదురు నుంచి వెలువడినవే. కనుక పప్పూరు రామాచార్యులను రాయలసీమ ఆధునిక సాహిత్య నిర్మాతగా కూడా పరిగణించాలి. మొదటి పదేళ్ల సాహిత్య ప్రధానంగా సాగిన తర్వాత, శ్రీ సాధన పత్రికను రామాచార్యులు రాజకీయ పోరాటపు ఆయుధంగా మలిచాడు. ఆయన ఆర్థిక పరమైన సమస్యలతో పాటు ఆంక్షల ఇబ్బందులతో ముందుకు సాగినా లక్ష్యాన్ని, వ్యూహాన్ని వదలలేదు. 1932లో సంపాదకుడు జైలు పాలైనప్పుడు రెండున్నర సంవత్సరాలకు పైగా పత్రిక ఆగిపోయింది. అలాగే 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో సంపాదకుడు రాజకీయ ఖైదీ కావడంతో తిరిగి మరల కొంతకాలం పత్రిక ఆగిన ఉద్యమ చరిత్ర ఈ పత్రికకుంది. రాజకీయాలలో గాంధీజీ స్ఫూర్తిగా మొదలై, ప్రకాశం అనుయాయిగా కొనసాగిన వాస్తవికవాది పప్పూరు. కల్లూరు సుబ్బారావు తొలినాటి నుంచీ మిత్రుడే అయినా వారితో రాజకీయపరమైన అభిప్రాయ బేధాలుండేవి. నీలం సంజీవరెడ్డి రాజకీయాలలో కీలకంగా ఉన్నప్పుడు, అలాగే ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు గురువైన రామాచార్యులు తీవ్రంగా విభేదించేవాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కాంగ్రెస్‌కు దూరంగా జరిగిన ఈ స్వేచ్ఛావాది 1963 సెప్టెంబరు 28 నుంచి తీవ్ర నిరాశలో తన పత్రికలో రాజకీయ విమర్శలు చేయడం మానివేశారు.




1889లో మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో కట్టమంచి రామలింగారెడ్డి రాసిన 'ముసలమ్మ మరణము' కావ్యం రంగయ్య శెట్టి స్థాపించిన బహుమతి పొందింది. 1900లో ప్రచురణ అయిన ఈ కావ్యం తొలి ఆధునిక తెలుగు కావ్యం. ఈ వస్తువుతోనే నారాయణరావు 'ముసలమ్మ' అనే గేయాన్ని 300 పాదాలతో రాయడం దీన్ని సాధన పత్రిక 1928 సెప్టెంబరు 15 సంచికలో ప్రచురించింది.

*"అన్నలారా! తమ్ములారా!*
*అక్కలారా! చెల్లెలారా!*
*తనయులుగన్న తల్లులారా! విన్నారా మీరీ కథని*
*కథ అంటే అది కథ కాదు మరి*
*కన్నుల యెదుటను గడిచిన సంగతి..."* అంటూ మొదలవుతుంది.

*"కనులకు చెలువయి కనబడు పొలముల*
*మనసుకు చలువయి తనిపెడు తరువుల*
*వినుటకు విందయి వినబడు ఖగముల"* అంటూ కొన్నిపాదాలు రమణీయమైన నడకతో గేయం మధ్యలో తారసపడతాయి.

1928 నవంబర్ 17, 18 తేదీలలో నంద్యాలలో సర్వేపల్లి రాధాకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలలోనే డా.చిలుకూరు నారాయణరావు 128 పాదాల 'దత్తగేయం చదివి దత్త మండలానికి 'రాయలసీమ' అనే పేరు ప్రతిపాదించారు.

*"... ఇచ్చిన దెవ్వరో పుచ్చినదెవరో*
*పుచ్చుకొన్నట్టియా పురుషులు నెవరో*
*'తురక బిడ్డం డిచ్చె దొరబిడ్డ పట్టె*
*మరదలా' యని యిటు మరియద మరి*
*"పరిహాసములు సేయ తరిగాదు నేడు*
*వెర వేరిగించుడీ యిరవుగా మీరు*
*అత్త సొమ్మనుగొని యల్లుండు దాన*
*మమర జేసెనటన్న యట్లులిన్నదిది"*

ఇలా 5 నుంచి 12 పాదాలు సాగుతాయి. చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కాదంబులు, బాణరాజులు, కాకతీయులు ఈ ప్రాంతాన్ని పాలించారని కవి ఈ గేయంలో పేర్కొంటారు. ఈ ప్రాంతపు ప్రఖ్యాత దేవాలయాలు, చారిత్రక వ్యక్తులు, సాహితీవేత్తల పేర్లు ప్రస్తావించి –

*"దత్త గానమ్ము నే దత్తను కాను*
*ఉత్త దబ్బరలివి చిత్తమ్ము కలదు*
*దత్తతయన్ దూడు తొలగించరేని*
*దరిచేర్చినా నేమి మరసిరయేని*
*ఇరుగువారలు మన పొరుగు వారలును*
*సరిజూచి మన్నించి సఖ్యంబు నేరపి*
*గౌర సబుద్ధితో గాంతురు మనల*
*నంతలో జూపట్టు నాంధ్రాభ్యుదయము"* అని ముగుస్తుంది.

ఆ సభలలో చివరి రోజున దత్తమండలాలకు 'రాయలసీమ' అని నామకరణం చేస్తూ ప్రతిపాదించిన తీర్మానం చేశారు. తొలుత 'శ్రీ సాధన పత్రిక' మకుటంలో ఉన్న 'వాయిస్ ఆఫ్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్' అనే మాటలను పప్పూరు రామాచార్యులు 1929 మార్చి 16 నుంచి 'వాయిస్ ఆఫ్ రాయలసీమ'గా మార్చారు. రాయలసీమకు గుండెకాయవంటి 'శ్రీ సాధన పత్రిక'ను ఉజ్జ్వలంగా నడిపిన పప్పూరు రామాచార్యులు 1972 మార్చి 21న గతించినా సదా చిరస్మరణీయుడే!

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com


రాష్ట్రకూటశైలి పాత చెన్నకేశవుని గుడి మంటప స్థంభాలు


రాష్ట్రకూటుల నాటి శివలింగం వెనక గణపతి


రాష్ట్రకూటశైలి నంది

# చరిత్రలో... నాటి మునిగండ్లే నేటి మనిగిళ్ళ

### గ్రామ నేపథ్యగాథ

మనిగిళ్ళ వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలంలోని గ్రామం. జిల్లాకేంద్రం వనపర్తికి 8 కి.మీ.ల దూరంలో ఉంది. పూర్వం ఈ గ్రామానికి 'మునిగండ్ల' అని పేరు. ఇక్కడ మునులు తపస్సు చేసుకుంటూ ఉండేవారని మునులున్న గండ్ల(గుహలు) ప్రదేశం కనుక వారిపేరు మీద మునిగండ్ల అయింది. ఈ గ్రామం పాటిగడ్డ మొదట బుగ్గపల్లి తండా దగ్గర, రెండవది చౌదరుపల్లె బురుజు దగ్గర, మూడోది చెన్నరాయునిపేట దగ్గర ఉన్న వంటరు. అనంతర కాలంలో ఇపుడున్నచోట ఊరు నిర్మించబడ్డది. ఒకప్పటి లింగాయతుల జాగీర్. తర్వాత బ్రాహ్మణుల అగ్రహారమయ్యింది. ఈ ఊళ్లో ఉన్న జంగమయ్య బావి, బాపనయ్య బావులే అందుకు సాక్ష్యం. ఇక్కడ చెన్నకేశవ, శివాలయాలు ఉండేవి. గ్రామస్తుల కథనం ప్రకారం ఈ చెన్నకేశవస్వామి ఆలయానికి ఆగ్నేయం వైపు "చింతలగిద్ద" అనే బావి ఉంది. పూర్వం ఈ మెట్లబావిలో మునులు స్నానం చేసి వెళ్లేవారని, రాత్రులలో వారు భజనలు చేస్తున్నట్లు వినిపించేదని, వారు వెళ్ళిన తర్వాత ఆ ప్రాంతమంతా సువాసనాభరితంగా ఉండేదని ప్రజలు చెప్పుకుంటారిప్పటికి. ఇపుడా బావి శిథిలమై ఉంది.

### మనిగిళ్ళ గుడులు

### 'చెన్నకేశవాలయం'

గ్రామానికి పశ్చిమంగా చెన్నకేశవాలయం ఉంది. అది భూగర్భంలో కట్టబడింది. ఈ ఆలయం సువిశాలంగా రాష్ట్రకూటశైలి స్తంభాలతో కట్టబడింది. దాని లోపలికి మెట్లుదిగి దివిటీ సహాయంతో వెళ్ళవలసి వచ్చేది. శిల్పకళా శోభితమైన గుడిలోపల స్వామి కూడా నయనాభిరామంగా ఉన్నాడు. ఈ చెన్నకేశవస్వామి గుడి దగ్గర అప్పట్లో మట్టి త్రవ్వినపుడు చిన్న వినాయకుల అర్చామూర్తులు దొరికేవని గ్రామస్తులు తెలిపారు.


ఆదిత్యుడు

స్వామిగుడి సమీపంలో శివాలయం చాలాకాలం క్రిందటిది ఉండేదట. అది శిథిలం అయిపోయిందని ప్రస్తుతం పానవట్టం ఒకటి ఉంది. శివలింగం లేదు. ఆ పాత ఆలయానికి వెనుక వైపు ఒక బురుజు ఉండేది. అది పూర్తిగా శిథిలమైపోయింది. ఈ ప్రాంతాన్ని ఇపుడు కూడా బురుజు అనే పిలుస్తారు. ఇక్కడి రెండు ఆలయాలు రెండు ప్రత్యేకతలు కలిగి ఉండేవి. ఈ గ్రామానికి పశ్చిమాన ఒక వాగు ఉంది. ఈ వాగు శంకర సముద్రం నుండి పారుతుంది. వాగుదాటితే 'స్కూల్ బాల్ రెడ్డి' పొలంలో వ్యక్తమైన (వెలసిన) 'వెంకటేశ్వర స్వామి' భావనాశిల్పం ఉంది. పూర్వం ఇక్కడ సదానంద స్వామి అనే యోగి ఉండేవాడు. "చిరతరోల్లాస సంతత శ్రీనివాస విగత భవపాశ మునిగండ్ల వెంకటేశ!" అని వేంకటేశ్వరస్వామిపై చక్కటి శతకం రచించాడు. సదానంద స్వామి వనపర్తి సంస్థానాధీశులు మొదటి రామకృష్ణరాయల (పాలనాకాలం 1807–1822) గురువు.

శంకర సముద్రం రిజర్వాయర్ నిర్మించినపుడు ఈ ఆలయాలు నీటిలో మునిగిపోయాయి. ఆక్కడికి సమీపాన చౌదరుపల్లి ఊరు ఉండేదని, ఊరి ఆనవాలుగా అక్కడ 'ఆంజనేయ' విగ్రహం ఇప్పటికి అక్కడి చేలలో కనబడుతుంది.

### 'శివాలయం'

ప్రస్తుత గ్రామంలో శివాలయం ఏకశిలా నిర్మితం. గుడికి మూడు వైపుల గోడలు మూడు అఖండ శిలలతో కట్టబడ్డది. కనుక దీన్ని ఏకశిలా నిర్మితమైనదంటారు. గుడిలో నున్నని, పెద్దశివలింగం ఉండేది. హారతి ఇచ్చినపుడు దీనిలో దీప ప్రతిబింబం కనిపిస్తుండేది.


ఆంజనేయస్వామి గుడి


కొత్త చెన్నకేశవాలయం

(కపిలవాయి లింగమూర్తి-పాలమూరు జిల్లా దేవాలయాలు, పేజి నెం. 126) ప్రస్తుత గ్రామంలోని శివాలయం రెండువందల సంవత్సరాల కింద నిర్మించినది. ఈ ఆలయం పక్కనే 'ఆంజనేయస్వామి' గుడి ఉన్నది.

**మహిషాసురమర్ధిని:** ఊరికి పడమరదిశలో ఉన్న దర్గాకు ఎదురుగా 'మేకల నడిపి రాముడు' ఇంటి పడమరగోడకు ఆనుకొని అష్టభుజి సింహవాహినియైన 'మహిషాసురమర్ధిని' విగ్రహం ఉంది. ఈ శిల్పం పొడవు ఒకటిన్నర అడుగులు, వెడల్పు 1 అడుగు, ఐదు అంగుళాల మందంతో ఉన్న నల్లరాతిమీద చెక్కిన ఉల్బణశిల్పం. దేవత నిజహస్తాలతో మహిషాసురుడిని చంపుతున్నట్లుగా ఉంది.

**కొత్త చెన్నకేశవస్వామి గుడిలో ఆదిత్యుడు:**

గ్రామంలో కొత్తగా చెన్నకేశవస్వామి గుడిని 2021లో నిర్మించారు. శంకర సముద్రంలో మునిగిపోవడానికి సిద్ధంగా ఉన్న గుడిలో ఉండే చెన్నకేశవస్వామి దేవతామూర్తిని తెచ్చి, కొత్తగుడిలో ప్రతిష్ఠించారు. ఈ నూతన ఆలయంలోని మీసాల చెన్నకేశవస్వామి మూలవిరాట్ నల్లరాతిశిల్పం. అధిష్ఠానపీఠం మీద గరుడవాహనం చెక్కబడివుంది. శైలిరీత్యా 16వ శతాబ్దానికి చెందింది. నాలుగున్నర అడుగుల ఎత్తు ఉంటుంది. దీనికి ఆనాటిదే చక్కటి అధిష్ఠానపీఠం ఉన్నది.

**ఆదిత్య శిల్పం:** ఈ ఆలయంలో గర్భగుడికి ఎడమవైపున ద్వారపాలకుని పక్కన 'ఆదిత్యుని' నాలుగున్నర అడుగుల స్థానక విగ్రహం ప్రతిష్ఠించబడి ఉంది. ఇది పురాతన విగ్రహమే. రెండు చేతులలో కమలాలు ధరించి ఉన్నాడు. విగ్రహం నల్లరాతితో తయారు చేసినట్లు కనబడుతుంది. ఈ విగ్రహానికి ప్రత్యేకంగా సిమెంట్ తో మండపం కట్టారు. ఈ విగ్రహాన్ని సూర్యనారాయణ స్వామి అని గ్రామస్తులు పిలుస్తారు. ప్రభావళితో, మణికిరీటంతో, పెద్దకుండలాలతో, హార, గ్రైవేయకాలతో, వక్షబంధంతో, జంధ్యంతో, మణిమేఖలతో, ఉరుదాలతో, రెండు చేతుల్లో తామర మొగ్గలతో ఉన్న ఆదిత్యశిల్పాన్ని పాతగుడి దగ్గర నుండి ఇక్కడికి తరలించారని చెప్పారు. ఆ పాతగుడి దగ్గర కూడా ఈ విగ్రహం బయటనే ఉండేదని, ఇది అక్కడి క్షేత్ర పాలకుడని అంటారు.

**వీరగల్లులు**

ఈ ఊరికి పశ్చిమాన దర్గా ఉంది ఈ దర్గాకి ఎదురుగా నడిపి రాముడు ఇంటికి ఆనుకొని రెండు విగ్రహాలున్నాయి. వీటిని గ్రామస్తులు 'తిక్కద్యావర్లు' అంటారు. వాటిలోని ఒక వీరగల్లు శిల్పంలో వీరుడు భార్యతో కలిసి ఉత్తరాభిముఖుడై నిలబడి అగుపిస్తున్నాడు. వెనక కట్టిన సిగతో ఉన్న వీరుడు కుడిచేతిలో కత్తిని ధరించి, ఎడమచేత తన నతిని ఆలింగనం చేసుకుంటున్నాడు. ఇది దాదాపు రెండు అడుగుల ఎత్తు 16 అంగుళాల వెడల్పు 4 అంగుళాల మందం రాతిలో చెక్కి ఉన్న ఉల్బణశిల్పం. ఈ వీరగల్లు సతిశిల. యుద్ధంలో మరణించిన


మీసాల చెన్నకేశవస్వామి


ముంపుకు గురైన చెన్నకేశవాలయం


శివాలయంలోని శివలింగం


మహిషాసురమర్ధిని


అశ్వారూఢ వీరగల్లు


చౌదర్‌పల్లి హనుమాండ్లు


వీరగల్లు


సతీశిల


బల్లెంతో వీరుడు

భర్తతో ఆమె సహగమనం చేసింది.

ప్రాచీన చెన్నకేశవగుడికి వెళ్లే దారిలో దాసరి చెన్నయ్య చేనుగట్టులో రెండు వీరగల్లు శిల్పాలు ఉన్నాయి. స్థానికులు వీటిని ‘ఈర్లు’ అంటారు. ఈర్లంటే వీరులే. ప్రజల పలుకుబడిలో పిలుపు మారింది. దాదాపు ఐదు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పు, ఐదు అంగుళాల మందంగల ఒక వీరగల్లు ప్రతిమ ఉంది. ఈ వీరుడు గుర్రం ఎక్కి కుడిచేతిలో ఖడ్గం ఎడమచేతిలో గుర్రంకళ్లెం పట్టుకుని ఉన్నాడు. గుర్రం ముందరికాళ్ళతో పరుగు ఆపి నిల్చున్నది. యుద్ధంలో ఈ వీరుడు మరణించాడు. అతని స్మారకంగా వేసిన ఈ విగ్రహం వీరగల్లు. ఈ విగ్రహానికి శిఖ ఉంది. మోకాళ్ళ వరకు పంచకట్టు ఉంది. రెండో వీరగల్లు విగ్రహం దాదాపు నాలుగు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పు, ఐదు అంగుళాల మందం రాతిపైచెక్కి ఉంది. రెండు చేతులతో ఇతడు ఈటెను పట్టుకొని ఉన్నాడు. మోకాళ్ళ వరకు పంచకట్టు ఉంది. ఈ రెండు కాశరాయిలో చేసిన విగ్రహాలు.


ఆంజనేయస్వామి గుడి


చెన్నకేశవ ప్రతిష్టితాలయం


మీసాల చెన్నకేశవస్వామి

నూతనంగా నిర్మించిన చెన్నకేశవగుడి దగ్గర బయట కుడివైపున రెండు కాశరాతి వీరగల్లు విగ్రహాలు ఉన్నాయి. ఒకటి నాలుగు అడుగుల ఎత్తు, ఒకటిన్నర అడుగు వెడల్పు, ఐదు అంగుళాల మందంతో రాతిపైన చెక్కి ఉంది. కుడి చేతిలో కత్తి శత్రువుపైకి దూయబడి ఉన్నది. పైకెత్తిన ఎడమచేతిలో డాలు ఛాయ కనిపిస్తున్నది. నడుముకు కుడివైపున బాకు ధరించి ఉన్నాడు. రెండవ విగ్రహం సగం మాత్రమే చెక్కబడి ఉంది. ఇది దాదాపు మూడడుగులు ఉండవచ్చు. కుడిచేతిలో కత్తి ధరించి ఉంది. ఎడమచేతిలో బహుశా డాలు కావచ్చు. ఈ వీరగల్లులు మామూలు వనితంలోనే ఉన్నాయి. ఈ విగ్రహాలు పూర్వపు పాత చెన్నకేశవస్వామి గుడి దగ్గర నుండి ఇక్కడికి తెచ్చిపెట్టారు. అక్కడ ఇవి ధ్వజం కట్ట దగ్గర ఉండేవట.

**జానపద వీరుడు మండ్లోళ్ళ కురుమన్న**

ఈ గ్రామం మండ్లోళ్ళ కురుమన్న అనే బోయ కులస్థుడైన జానపదవీరునికి జన్మస్థలం. ఈయన 150 సం క్రితం వాడు. ఈయన పేదలచే వెట్టిచాకిరి చేయించే ధనవంతుల ఇండ్లను దోచి, పేదలకు పంచి పెట్టేవాడట. ఆనాడు ఆయన ద్వారా సహాయం పొందినవారు కథలుగా చెప్పుకుంటుంటారు. ఆర్థికభారంతో వివాహానికి నోచుకోని ఎందరో పేద మహిళలకు ఆర్థికంగా చేయూత నందించడమే కాకుండా వారి వివాహాలకు సహాయంచేసినట్లు గ్రామస్తులు తెలియజేసారు. ఆయన వారసులు గ్రామంలో ఇప్పటికీ ఉన్నారు.

**ధన్యవాదాలు:**

తేది: 25-07-2022 కొత్తతెలంగాణ చరిత్రబృంద సభ్యులు భైరోజు చంద్రశేఖర్, డాక్టర్ భైరోజు శ్యామసుందర్ చేసిన క్షేత్ర పరిశోధనకు, మనిగిళ్ళ గ్రామ వయోవృద్ధులు ఇచ్చిన సమాచార సహకారానికి..

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

– డా. భైరోజు శ్యామసుందర్,
m : 9441612629

# కొత్త తెలంగాణచరిత్ర బృందం ఆధ్వర్యంలో

# ఘనంగా నందికంది యాత్ర

తెలంగాణ చరిత్ర, పురావస్తు, దేవాలయ వాస్తు, శిల్పకళ, శాసనాలు, సాంస్కృతిక వారసత్వాన్ని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, శాస్త్రీయపద్ధతుల్లో భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న కొత్త తెలంగాణచరిత్ర బృందం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న 'బొమ్మలపల్లకి–తెలంగాణ దృశ్యవైభవం' వీడియోగ్రఫీ పోటీ, నందికంది యాత్ర, ప్రతిభాపురస్కార ప్రదానసభ ఘనంగా నిర్వహించారు. నందికంది శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి చరిత్రకారులు, పరిశోధకులు, స్థపతులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, చరిత్రాభిమానులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాహిత్య, సాంస్కృతిక ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధప్రాంతాల నుంచి పరిశోధకులు, చరిత్రాభిమానులు ఒకే వేదికపైకి రావడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. తెలంగాణ చారిత్రక, వాస్తు, సాంస్కృతిక వైభవాన్ని వీడియో చిత్రీకరణ ద్వారా ప్రజలకు చేరువ చేయడం, చారిత్రక కట్టడాలను కేవలం సందర్శించే స్థాయిని దాటి, వాటి నిర్మాణం, శిల్పకళ, చారిత్రక ఆధారాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలనే అవగాహన కల్పించడం 'బొమ్మలపల్లకి' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.




**ఉచిత బస్సు సౌకర్యంతో భారీగా హాజరు**

దక్కన్‌ల్యాండ్ పత్రిక సంపాదకులు, ఇంటాక్ జాతీయస్థాయి కౌన్సిల్ సభ్యులు మణికొండ వేదకుమార్ సమకూర్చిన ఉచిత బస్సుల సౌకర్యంతో హైదరాబాద్ నుండి సుమారు 60 మంది నందికందికి చేరుకున్నారు. మరో 50మందికి పైగా సభ్యులు, చరిత్రాభిమానులు తమ స్వంతవాహనాల్లో హాజరయ్యారు.

**నందికంది భూమిజవాస్తు దేవాలయ సందర్శన:**

ప్రముఖస్థపతి, చరిత్రకారుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం గౌరవ సలహాదారుడు డా. ఈమని శివనాగిరెడ్డి సుమారు గంటపాటు ఆలయాన్ని చుట్టూ ప్రదక్షిణమార్గంలో చూపిస్తూ దాని వాస్తునిర్మాణం, శిల్పకళ, ఐకనోగ్రఫీ, శాసనాలు తదితర అంశాలను శిల్పశాస్త్ర ప్రమాణాల ఆధారంగా వివరించారు.

ఆలయం ముందు ఉన్న శాసనాల పరిశీలనతో ప్రారంభించారు. శిల్పశాస్త్రం, దేవాలయ వాస్తు, ఐకనోగ్రఫీ పై అధ్యయనం, క్షేత్రానుభవంతో డా. శివనాగిరెడ్డి చేసిన వివరణలు పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

**తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఆతిథ్యం**

ఆలయ సందర్శన అనంతరం పాల్గొన్న వారికి తెలంగాణ సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. సర్వపిండి, పచ్చిపులుసు, చల్ల, రెండు రకాల తొక్కులు, రెండు రకాల బువ్వలు తదితర వంటకాలతో ఏర్పాటు చేసిన భోజనాన్ని అందరూ ఆస్వాదించారు. మఠం వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విందు తెలంగాణ ఆహార సంస్కృతిని ప్రతిబింబించేలా సాగింది.

**'బొమ్మలపల్లకి' విజేతలకు ప్రతిభా పురస్కారాలు**

మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రధాన సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సభ్యుల రిజిస్ట్రేషన్, ఐడీ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బైరోజు చంద్రశేఖర్ అధ్యక్షతన సభ ఉత్సాహంగా సాగింది. తెలంగాణలో మరుగునపడిన చారిత్రక సంపద, ప్రాచీన దేవాలయాలు, శాసనాలు, శిల్పాలు, పురావస్తు ఆనవాళ్లు, స్థానిక సంస్కృతి సంప్రదాయాలను పరిశోధించి డాక్యుమెంటరీల రూపంలో ప్రజలకు పరిచయం చేస్తున్న వారిని ప్రోత్సహించేందుకు కొత్త తెలంగాణ చరిత్రబృందం ఆధ్వర్యంలో 'బొమ్మలపల్లకి ప్రతిభాపురస్కార ప్రదానోత్సవం' నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటాక్ జాతీయస్థాయి కౌన్సిల్ సభ్యుడిగా, చారిత్రక వారసత్వ పరిరక్షణ రంగంలో పనిచేస్తున్న మణికొండ వేదకుమార్, నందికంది సర్పంచ్ శ్రీమతి స్రవంతి రాచర్ల, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయకమిటీ నిర్వాహకులు శ్రీనివాస్ తదితర ప్రముఖులు పాల్గొని 'బొమ్మలపల్లకి–తెలంగాణ దృశ్యవైభవం' వీడియోగ్రఫీ పోటీ విజేతలను సత్కరించారు.

**రవీందర్ రెడ్డికి ప్రథమ పురస్కారం**

చారిత్రక ప్రదేశాన్ని పరిశోధనాత్మకంగా చిత్రీకరించి 'సీతమ్మలొద్ది యాత్ర' అంశంపై రూపొందించిన డాక్యుమెంటరీకి ప్రముఖ ఫోటోగ్రాఫర్ డి.రవీందర్ రెడ్డికి ప్రథమ ప్రతిభా పురస్కారంతో పాటు నగదు బహుమతిని అందించి, అభినందించారు. శ్రీరంగాపురం రంగనాయకుల ఆలయచరిత్రపై రూపొందించిన డాక్యుమెంటరీకి నక్క విష్ణు ద్వితీయ ప్రతిభాపురస్కారం అందుకున్నారు. వనపర్తి జిల్లా ప్రతినిధుల సహకారంతో ఈ పురస్కారాన్ని అందజేశారు. 'తెలంగాణ చరిత్ర'

అంశంపై రూపొందించిన డాక్యుమెంటరీకి యూనస్ ఫర్హాన్ తృతీయ ప్రతిభాపురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ చరిత్రలోని విభిన్న అంశాలను పరిశోధించి డాక్యుమెంటరీలుగా రూపొందించిన పలువురికి ప్రత్యేక, ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు. కెవిజెకే ఆచార్య మాదారం, ఇబ్రహింపూర్ గ్రామాల చరిత్రపై చేసిన పరిశోధనకు ప్రత్యేక సత్కారం అందుకున్నారు. ఎస్.ఎస్. రంగాచార్యులు దామెరవాయి సమాధులు, పాండవుల గుట్ట చరిత్రపై చేసిన పరిశోధనలకు గుర్తింపుగా పురస్కారం స్వీకరించారు. సామలేటి రోహిత్ 'దేవరయాంజల్ – వెయ్యేళ్ల చరిత్ర'పై రూపొందించిన డాక్యుమెంటరీకి, చొల్లేటి శ్రీనివాస్ కొత్తకొండ గిరిదుర్గం చరిత్రపై రూపొందించిన డాక్యుమెంటరీకి ప్రోత్సాహక పురస్కారాలు అందుకున్నారు. కొల్లూరి సాయికుమార్ మేడారం జాతర విశేషాలపై, జి. కిషోర్ గొల్లపల్లి జైన బస్తి ప్రాధాన్యంపై రూపొందించిన డాక్యుమెంటరీలకు సత్కారాలు అందుకున్నారు. అలాగే అహోబిలం కరుణాకర్ వృక్ష శిలాజాల ప్రాచీనతపై, కరిపే రాజ్‌కుమార్ 'అస్త్రాల వీరన్న' అంశంపై, దేవా రమేష్ శర్మ 'శనిగరం చరిత్ర ఆనవాళ్లు' అంశంపై రూపొందించిన పరిశోధనాత్మక చిత్రాలకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు.

### రెండు దశాబ్దాలుగా తెలంగాణ చరిత్ర అన్వేషణ– శ్రీరామోజు హరగోపాల్

కొత్త తెలంగాణ చరిత్రబృందం గత రెండున్నర దశాబ్దాలకు పైగా తెలంగాణచరిత్రపై క్షేత్రస్థాయి పరిశోధన, డాక్యుమెంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఇప్పటి వరకు 60 నెలలపాటు ఆన్‌లైన్ జూమ్ సమావేశాలు, రెండు ద్వైవార్షిక సదస్సులు, రెండు చారిత్రక యాత్రలు, పది కంటే ఎక్కువ చరిత్రసభలను నిర్వహించి పరిశోధకులు తమ అధ్యయనాలు, పరిశోధనా ఫలితాలను పరస్పరం పంచుకునే వేదికను బృందం కల్పించిందన్నారు. బృందసభ్యులు తెలంగాణవ్యాప్తంగా సుమారు 2,000 దేవాలయాలను సందర్శించి, వాటి వాస్తు,శిల్పకళ, విగ్రహాలు, ఐకనోగ్రఫీ తదితర అంశాలను నమోదు చేశారని తెలిపారు. బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ సంప్రదాయాలకు సంబంధించిన చారిత్రక ఆధారాలను అధ్యయనం చేయడంతో పాటు 100కు పైగా కొత్త శాసనాలను గుర్తించినట్లు వివరించారు. కొద్దిమందితో ప్రారంభమైన కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రస్తుతం 200 మందికి పైగా క్రియాశీలసభ్యులతో విస్తరించిందని హరగోపాల్ తెలిపారు. వైద్యులు, పరిశోధకులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన చరిత్రాభిమానులు తమ విద్య, వృత్తి నేపథ్యాలకు అతీతంగా ఒకే వేదికపై కలిసి పనిచేస్తున్నారని చెప్పారు. వ్యక్తిగత గుర్తింపు లేదా ఆర్థిక లాభం కోసం కాకుండా తెలంగాణచరిత్రపై అభిమానంతో స్వచ్ఛందంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సభ్యులే మా బృందానికి వెలుగు అని ప్రశంసించారు.

### డిజిటల్ మాధ్యమాలతో తెలంగాణ చరిత్రను భావితరాలకు చేరవేయాలి: కట్టా శ్రీనివాస్

తెలంగాణకు చెందిన వేల ఏళ్ల చరిత్ర, పురావస్తు సంపద, శాసనాలు, శిల్పాలు, దేవాలయాలు, చారిత్రక కట్టడాల వైభవాన్ని ఆధునిక డిజిటల్ సాంకేతికత సహాయంతో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ 'బొమ్మల పల్లకి' వీడియోగ్రఫీ పోటీ నిర్వహణ వెనుక ఉన్న లక్ష్యాలను వివరించారు.

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పురావస్తు సంపదను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే 'బొమ్మల పల్లకి' కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన వివరించారు. గతంలో రాజరిక, సాంస్కృతిక సందర్భాల్లో పల్లకిని ఊరేగించినట్లుగా, నేడు తెలంగాణ విశిష్ట చరిత్రకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు, దృశ్య సమాచారాన్ని డిజిటల్ ప్రపంచంలో విస్తృతంగా ప్రచారం చేయడమే 'బొమ్మల పల్లకి' ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రస్తుత తరంలో ముఖ్యంగా యువత దృష్టి డిజిటల్, విజువల్ మాధ్యమాల వైపు ఎక్కువగా ఉందని, అందువల్ల చారిత్రక



సమాచారాన్ని ఆకర్షణీయమైన వీడియోలు, చిత్రాలు, డిజిటల్ కథనాల రూపంలో అందించడం అవసరమని చెప్పారు.

### తెలంగాణ చరిత్ర అన్వేషణకు క్షేత్ర పరిశోధనే పునాది– అరవింద్ ఆర్య

తెలంగాణ చరిత్రలో ఉన్న ఈ ఖాళీలను ప్రామాణిక ఆధారాలతో పూరించాలంటే నిరంతర క్షేత్ర పరిశోధన, శాస్త్రీయ అధ్యయనం, సమగ్ర డాక్యుమెంటేషన్ అవసరమని టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర అనేక సందర్భాల్లో విస్మరణకు గురైందని, ఇంకా పరిశోధించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో భారత పురావస్తు సర్వే (Archaeological Survey of India - ASI) ఆధీనంలో ఉన్న జాతీయ ప్రాధాన్యమున్న రక్షిత స్మారకాల సంఖ్య తక్కువగా ఉందని అరవింద్ ఆర్య పేర్కొన్నారు. తెలంగాణలో ప్రాచీన దేవాలయాలు, కోటలు, శిలా చిత్రాలు, మెగాలిథిక్ సమాధులు, బౌద్ధ–జైన అవశేషాలు, పురాతన నివాస ప్రాంతాలు వంటి అనేక పురావస్తు ప్రాధాన్యమున్న ప్రదేశాలు ఉన్నప్పటికీ, వాటిలో చాలావరకు ఇంకా జాతీయ స్థాయి గుర్తింపు, పరిరక్షణ పరిధిలోకి రావాల్సి ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతమైన క్షేత్ర పరిశోధన చేపట్టి, చారిత్రక ప్రదేశాల ప్రామాణిక సమాచారాన్ని శాస్త్రీయంగా నమోదు చేయాలన్నారు. పరిశోధకులు, చరిత్ర బృందాలు, విశ్వవిద్యాలయాలు, పురావస్తు నిపుణులు గుర్తించిన ముఖ్యమైన ప్రదేశాల వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి వాటిని రాష్ట్ర రక్షిత స్మారకాలుగా లేదా జాతీయ ప్రాధాన్యమున్న స్మారకాలుగా గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని

దృశ్య వైభవం



తెలిపారు. చారిత్రక ప్రదేశాన్ని గుర్తించడం పరిశోధనలో తొలి దశ మాత్రమేనని, దానిని పరిరక్షించడం మరింత ముఖ్యమని అరవింద్ ఆర్య అన్నారు. తెలంగాణలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన అనేక ప్రదేశాలు ఆక్రమణలు, విధ్వంసం, అభివృద్ధి పనులు, అక్రమ తవ్వకాలు, నిర్లక్ష్యం కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

**తెలంగాణ వారసత్వ సంపదను ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలి: వేదకుమార్**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన దక్కన్ హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్, ఇంటాక్ జాతీయస్థాయి కౌన్సిల్ సభ్యుడు వేదకుమార్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఆధారాలను గ్రామీణ ప్రాంతాల నుంచి వెలికితీస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పరిశోధకులు స్వచ్ఛందంగా కలిసి పనిచేస్తూ వేలాది గ్రామాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించి సమాచారాన్ని సేకరిస్తున్నారని తెలిపారు. చారిత్రక అంశాలను గుర్తించిన వెంటనే వాటి వివరాలను పత్రికలు, సామాజికమాధ్యమాల ద్వారా ప్రజలతోపాటు ప్రభుత్వదృష్టికి తేవడంవల్ల వాటిపరిరక్షణ కలిగే అవకాశాలు పెరుగు తున్నాయన్నారు.

నారాయణపేట జిల్లాలోని ముడుమాల మెగాలిథిక్ సైట్ తెలంగాణ ప్రాచీన చరిత్రకు అత్యంత విలువైన నిదర్శనమని వేదకుమార్ పేర్కొన్నారు. అక్కడ ఉన్న భారీ నిలువురాళ్ళు, మెగాలిథిక్ సమాధులు, కప్ మార్కులు తదితర పురావస్తు ఆనవాళ్లు ఆ ప్రాంత ప్రాచీనతను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ఒక దశలో ఈ ప్రాంతంలోని చారిత్రక ఆనవాళ్లు ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడినప్పటికీ,స్థానిక పరిపాలన, రెవెన్యూ యంత్రాంగం, చరిత్రాభిమానుల సహకారంతో వాటిని పరిరక్షించే చర్యలు చేపట్టడం ముఖ్య పరిణామమన్నారు. ముడుమాల ప్రాముఖ్యతను దేశీయ స్థాయికే పరిమితం చేయకుండా అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. ×జూమీూ, ఖచీజూజూ సంబంధిత వేదికల్లో ముడుమాల చారిత్రక విశిష్టతను వివరించడం, పరిశోధన పత్రాలు సమర్పించడం వంటి చర్యలు ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో దోహదపడ్డాయని పేర్కొన్నారు.

**'తెలంగాణ చరిత్రలో మైలురాళ్లు' ఆవిష్కరణ**

తెలంగాణ చరిత్రలోని వివిధ ముఖ్య ఘట్టాలు, చారిత్రక ఆధారాలను పరిచయం చేసే వ్యాసాలను కలిగిన ప్రముఖ స్థపతి, చరిత్రకారుడు డా. ఈమని శివనాగిరెడ్డి రచన 'తెలంగాణ చరిత్రలో మైలురాళ్లు' రెండోసారి నందికంది సభా వేదికపై ఆవిష్కరించారు. ఈ గ్రంథం గత నెల అమెరికాలో జరిగిన ఆటా సభల్లో తొలిసారిగా ఆవిష్కరించబడింది.

**సాహిత్య, సాంస్కృతిక సంస్థల సహకారం**

కార్యక్రమానికి సాహితీ కళావేదిక, వనపర్తితో పాటు పలువురు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక ప్రముఖులు సహకరించారు. సాహితీ కళావేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుసు శంకర్ గౌడ్, కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం, నాగర్‌కర్నూల్ కార్యదర్శి కపిలవాయి అశోక్ బాబు తదితరులు కార్యక్రమానికి తమ సహకారం అందించారు.

**చరిత్ర పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే**

కార్యక్రమంలో పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణలోని గ్రామాలు, దేవాలయాలు, కోటలు, శాసనాలు, శిల్పాలు, జానపద సంప్రదాయాలు, స్థానిక మౌఖిక చరిత్రలను నమోదు చేయాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు.

**భవిష్యత్‌లో మరిన్ని చారిత్రక యాత్రలు**

గ్రామాలు, దేవాలయాలు, శాసనాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తూ ఆధారాలను నమోదు చేసే కార్యక్రమాలను కొనసాగించాలని, క్షేత్ర అధ్యయనం, పరిశోధనా పత్రాలు, సదస్సులు, చారిత్రక యాత్రలను, వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీలను సమన్వయం చేస్తూ భవిష్యత్ పరిశోధకులకు ఉపయోగపడేలా ఒక శాస్త్రీయ డాక్యుమెంటేషన్ నమూనాను అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని బృందం వ్యక్తం చేసింది. 'బొమ్మలపల్లకి-నందికందియాత్ర సభ' కళాత్మక దృశ్య డాక్యుమెంటేషన్‌ను క్షేత్రస్థాయి చరిత్ర పరిశోధనతో అనుసంధానించిన కార్యక్రమంగా నిలిచింది.

- అరవింద్ ఆర్య పకిడె,
m : 7097270270
e: aravindarya.pakide@gmail.com

# మచిలీపట్నంలో సిపాయీల తిరుగుబాటు-1780

**బందరులో అధికార్ల తిరుగుబాటు (ఆఫీసర్స్ మ్యూటనీ) 1806**

1806 సంవత్సరం మచిలీపట్నం మిలట్రీ 'అధికార్ల తిరుగుబాటు' (Officers Mutiny) జరిగింది. బందరు నగరం, బందరు కోటలోని మిలట్రీ స్థానిక అధికారులు, చేత తుపాకులు ధరించి బయటకు వచ్చి తమ విధుల నిర్వహణకు నిరాకరించారు. 'పోష్టల్ రన్నర్స్' పేరుతో మారు వేషాలలో సిపాయీలు మచిలీపట్నం నుండి పులికాట్ మీదుగా 'సెయింట్ థామస్ మౌంట్' వరకు పహారా నిర్వహించారు. ఈ కాలములో మచిలీపట్నం 'మిలట్రీ స్టేషను'గా కొనసాగుతూ ఇంకనూ కొంత ప్రాముఖ్యత కలిగి ఉన్నది. బందరు ఓడరేవుగానే కాక, సికిందరాబాద్ నాగపూర్ - కాంప్టి - జిల్లాలకు బందరు సైన్య కమీషనరేట్‌గా ఉంటూ వచ్చింది. 1806లో, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర ఆర్కాటు జిల్లా 'రాయవేలూరు'లో 1806, జులై నెల పదవ తేదీన జరిగిన అధికార్ల తిరుగుబాటు ప్రభావం, మచిలీపట్నం మిలట్రీ స్టేషన్ మీద కూడా పడింది. ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయవేలూరు సైనికులు అసాధారణ రీతిలో స్పందించి తిరగబడి సైనికాధికార్లను కాల్చి చంపినప్పుడు, మచిలీపట్నం సైనిక బ్రిగేడ్ స్పందించి, మద్రాస్ ప్రభుత్వాన్ని ఎదిరించి పడదోయాలనే తలంపుతో తిరుగుబాటు దార్లకు సహాయకారిగా రాయవేలూరు బయలు దేరటానికి సిద్ధపడింది. ముందుగా అనుమానించిన 'సర్‌జాన్ మాక్‌లామ్' సముద్ర మార్గాన బందరు నగరం వచ్చి సిపాయీలను, అధికారులను సైనిక స్థావరాల్లోకి తేవటానికి చాలా కష్టపడవలసి వచ్చింది. (బందరు సిపాయీలు మచిలీపట్నంలోని సైనికాధికారుల మాటలు విననందున, మద్రాసు నుండి మాక్‌లామ్ రావలసి వచ్చింది).



**తిరుగుబాటు కారణాలు:**

'సర్‌జాన్ క్రాడ్డాక్' అను పేరుగల బ్రిటిష్ చీఫ్ కమాండర్ సిపాయీలు ధరించవలసిన యూనిఫాం గురించిన విధి నిషేధాలు తప్పని సరిగా అమలు పర్చాలని ఉత్తర్వులిచ్చాడు. అప్పట్లో భారతీయ (హిందూమత) సిపాయీలు, అధికార్లు చెవులకు 'పోగులు', తలపాగా ధరించేవారు. ముసల్మాన్ సిపాయీలు గడ్డం ఉంచుకొనేవారు. హిందూ, ముస్లిం అనే బేధం లేకుండా అందరు సిపాయీలు గడ్డం నున్నగా గీయించుకోవాలని, చెవిపోగులు తలపాగాలు ధరించరాదనే ఉత్తర్వు జాన్ క్రాడ్డాక్ ఇచ్చాడు. సిపాయీలు అందరూ తలపాగాలు తీసివేసి, ఇంగ్లీషు సైనిక హ్యాట్ ధరించాలని ఇంకొక ఆజ్ఞ ఇచ్చాడు క్రాడ్డాక్. ఇంగ్లీషు కమాండర్-ఇన్-చీఫ్ ఇచ్చిన ఇలాంటి ఉత్తర్వులు హిందూ, మహమ్మదీయ స్థానిక ఆర్మీ అధికారులను, సిపాయీలను తీవ్ర మనస్థాపానికి గురిచేశాయి. 'యూరోపియన్ సైనికాధికార్లు తమ వేషభాషల మీద, సంస్కృతీ సంప్రదాయాల మీద కావాలని దాడి చేస్తున్నారని హిందూ, ముస్లిం సిపాయీలు అధికార్లు గట్టిగా తలపోశారు.

**నోబుల్ దొర స్థానిక క్రైస్తవ మతాధికారులతో ఘర్షణ:**

ప్రారంభ రోజుల్లో, నోబుల్ ప్రజలను క్రైస్తవ మత మార్పులు చేసినప్పుడల్లా, స్థానిక కులీన కులస్తులు ఆయన మీద భౌతిక దాడులు జరిపేవారు. మతాంతీకరణ విషయంలోనూ, దళిత హిందువులను క్రైస్తవమతంలో చేర్చుకొనే విషయంలోనూ స్థానిక మతాధిపతులు, నోబుల్ దొరతో ఘర్షణ వైఖరి అవలంభించారు. తన పాఠశాలలో దళితుల పిల్లలను విద్యార్థులుగా చేర్చుకొనుటకు, నోబుల్ దొర అయిష్టత చూపేవాడు. ముందుగా ఉన్నత కులాల వారికే క్రైస్తవం ఇవ్వాలనే నోబుల్ వాదనను, రెండు సంవత్సరాలపాటు నాన్చిన మద్రాస్ మిషన్ కమిటీ వారు, "విద్యార్థులను (నోబుల్) పాఠశాలలో చేర్చుకోవటానికి కులం అడ్డురాకూడదు, కాని ప్రియ సోదరుడు నోబుల్ మీద ఉన్న గౌరవ మర్యాదల కొద్దీ మసులీపటాం స్కూలుకు మాత్రం ఈ విషయంలో మినహాయింపు ఇవ్వబడుతున్నది" అని నిర్ణయం ప్రకటించారు. నోబుల్ దొర ఈ నిర్ణయానికి నిరసనగా రాజీనామా ఇచ్చారు, కాని రాజీనామా తిరస్కరింప బడింది. నోబుల్ దొరను ఇంగ్లీషు చర్చిగా పిలవబడే సెయింట్ మేరీస్ చర్చి శ్మశానవాటికలో సమాధి చేశారు. షార్కీ దొర 1866లో చనిపోగా, నోబుల్‌దొర ప్రక్కనే సమాధి చేశారు. నోబుల్ కాలేజి భవనం, నాటి వాస్తు నిర్మాణానికి ఒక మచ్చుతునక.

**బందరు 'బెనాన మిషన్':**

ఉన్నత కులాల వాళ్ళకు మతం ఇవ్వటం, వాళ్ళ పిల్లలకోసం ప్రత్యేక పాఠశాలలు నడపటం, నోబుల్ దొర అనంతరం బందరుకు

చెందిన ఇతర క్రైస్తవ ముఖ్యులు కూడా కొనసాగించారు. 1883 నాటికి 'జెనాన మిషన్' పేరుతో బందరులో ఒక క్రొత్త క్రైస్తవ మిషన్ ఏర్పడి, నల్గురు యూరోపియన్ మహిళలతోనూ, ముగ్గురు సహాయకులతోనూ, మొత్తం పదిమంది టీచర్లతో సంపన్నకులాల పిల్లలకు 5 స్కూళ్ళు నడుపబడినవి. 218 మంది హిందువుల పిల్లలతో, 60 మంది మహమ్మదీయ పిల్లలతో ఒక ప్రత్యేక పాఠశాల ఏర్పడింది. 145 మంది పెద్దకులాల స్త్రీలకు ఇండ్ల వద్దనే రోజువారీ చదువు చెప్పటం, వ్రాయటంలో శిక్షణ ఇవ్వబడింది. ఈ క్రమంలో ఇద్దరు ఉన్నత వర్గాల స్త్రీలు కూడా క్రైస్తవ మతం పుచ్చుకున్నారు.

**బందరులో రత్నం క్రైస్తవ పాఠశాల:**

సెంట్‌మేరీస్ (ఇంగ్లీషు) చర్చి వెనుక వైపు గంటస్థంభం నానుకొని, ఒక శిథిల భవనపు పునాదుల దిబ్బ ఈ నాటికీ ఉన్నది. అది ఆనాటి స్కూలు మిషనరీ నివాస గృహం. చర్చి ఆవరణలో ఒక స్కూలు నడపబడేది. బందరులో 30 మంది ముస్లిం బాలికల నిమిత్తం రెవ॥ రత్నం ఒక పాఠశాల; ఇతర కులస్థుల పిల్లలు మొత్తం 180 బాలికలతో మూడు పాఠశాలలు రెవ॥ 'మిసెస్ పీల్' నిర్వహించారు. 'మిసెస్ పడ ఫీల్డ్' నడిపిన స్కూలులో ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చేవారు. దళితజనం నుండి క్రైస్తవంకు మారిన వారితో మాచవరంలో ప్రత్యేకించి 'ఆనందపేట' అను పేరుతో ఒక దళితపేట ఏర్పడింది. ఈ పేటకు దక్షిణంగా 'డాబిన్ తోటలో' యూరోపియన్ల నివాస బంగళాలు ఉండేవి. ఈ భవనాల నానుకొని 'ఇంగ్లీష్ గార్డెన్స్' (ఆంగ్లేయుల తోట) ఉండేది. మాంచాలరత్నం క్రైస్తవ మతం పుచ్చుకొని మత వ్యాప్తికు గొప్ప కృషి చేశాడు.

**క్రైస్తవం తీసుకొన్న వారికి ప్రత్యేక విడాకుల చట్టం-1866:**

మతాంతీకరణ చెందిన క్రైస్తవుల జీవిత భాగస్వాములైన భార్యకానీ, భర్తగానీ, మత మార్పిడికి ఇష్టపడని జీవిత భాగస్వామితో విడిపోవటానికి వీలుకల్పిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వం 1866లో క్రైస్తవ విడాకుల చట్టం చేసింది. నోబుల్ దొర ద్వారా బాప్తిజం పొందిన బ్రాహ్మణ భర్తలను వారి బ్రాహ్మణ స్త్రీలు వదిలేశారు. అట్టి పురుషులు చట్టప్రకారం విడాకులు పొంది, తిరిగి వివాహాలు చేసుకొనే ఈ చట్టం బ్రిటిష్ అధికారులు చేశారు.

1879 నాటికి, నాటి కృష్ణాజిల్లా మసులీపటాంలో 1414 మంది, బెజవాడలో 516 మంది, నందిగామ రాఘవాపురంలో 756 మంది, మొత్తం మీద 2,686 మంది క్రైస్తవులు ఉన్నట్లు గణాంక వివరాలు చెప్తున్నవి. మెకంజీ జిల్లా మాన్యువల్ ప్రకారం, 1881 నాటికి ఆనాటి కృష్ణాజిల్లాలో 14,250,013 మంది హిందువులు, 87,161 మంది మహమ్మదీయులు, 36,194 మంది క్రైస్తవులు, 8 మంది జైనులు, తాము ఏమతమో తెలుపని వారు 104, మొత్తం మీద జిల్లా జనాభా 15,48,480గా ఉన్నది.

**సెయింట్ జాన్ చర్చ్ - బందరుకోట, 1842:**

నాటి బిషప్ వైట్‌హెడ్, 1842 జనవరిలో బందరుకోటలో 'సెయింట్ జాన్ చర్చి' నిర్మించాడు. 1864, నవంబరు 1వ నాటి ఉప్పెనలో ఈ చర్చ్ నామ రూపాల్లేకుండా పడిపోయింది. చర్చ్ ప్రారంభపు శిలాఫలకం ఊడదీసుకు వచ్చి, 1907లో మాచవరం ఇంగ్లీష్ చర్చ్ ప్రధాన తలుపు పైగోడకు బిగించారు. సెయింట్ జాన్ చర్చినే 'ఈస్ట్ ఇండియా కంపెనీ చర్చ్' అని పిలిచేవారు. ఈ చర్చ్ మద్రాస్ బిషప్ వారిచే అనుమతించబడి, రైట్ రెవ॥ 'జార్జ్ ట్రెవార్ స్పెన్సర్'చే పవిత్ర పరచబడి, 1842, జనవరి 11వ తేదీన ఆవిష్కరింప బడినది. రెవ॥ యి.పి. లెవీస్, యు.ఎ. ఛాప్లిన్, కలెక్టరు పి. గ్రాంటు, సైనికకేంద్ర కమాండరు మేజర్ జె. డాండ్రైలు, ఆనాటి ఈ చర్చ్‌కు ట్రస్టీలు. బందరుకోట సెయింట్ జాన్ చర్చ్



కట్టకముందు నుంచీ చర్చ్ స్థలం యూరోపియనుల శ్మశానవాటికగా వాడబడినది. ఇందులో 1602 సం॥ నుండి యూరోపియనుల, ఆర్మేనియనుల తదితర యూరోపియనుల సమాధులు కలవు.

**పరిశుద్ధ ఆంధ్రేయ దేవాలయము (తెలుగు చర్చ్):**

ప్రారంభము నుండి యూరోపియనులకు సెయింట్ మేరీస్ చర్చి ప్రార్ధనా మందిరము కాగా, ఆంద్రూస్ చర్చ్ అనే 'ఆంధ్రేయ దేవాలయము' (తెలుగు చర్చి) స్థానిక తెలుగువారికి పూజా మందిరము. 1913లో ప్రారంభింపబడి, 1928 నాటికి నిర్మాణం పూర్తి చేసుకున్నది. రెవ॥ గుడ్‌మన్, దేవానంద్, కాంతయ్య, గోవాడ నతానియేల్, మొదలగు వారు ఈ దేవాలయమునకు బహు విధముల సేవలందించిరి. ఈ చర్చి ప్రాంగణము 8 ఎకరములు. బహు విశాలమైనది, అందమైనది కూడా. చర్చి ప్రాంగణంలో 'బిషప్' నివసించుటకు ఒక భవనము కట్టబడి, బిషప్ ఇందు నివసిస్తున్నారు. ఇవికాక బందరు పట్టణంలో నోబుల్ హైస్కూల్ దగ్గర్లో 'నోబుల్ మిషనరీ' చర్చి, 1988, డిసెంబరు 5న ఫాదర్ టి.బి.డి. ప్రకాశరావుచే ఆవిష్కరించ బడినది. 3 ఎకరముల స్థలంలో నోబుల్ హాస్టలు ప్రాంగణములో నెలకొని యున్నది. ఇవికాక చిన్నా పెద్దా చర్చీలు బందరు పట్టణములో వాడవాడా ఎన్నో వెలసి ఉన్నవి.

**బందరు రోమన్ కాథలిక్ మిషన్ (RCM) చర్చి నిర్మాణం:**

ఫ్రెంచ్ ప్రభుత్వం ఆధీనంలోని ఫ్రెంచ్‌పేటలో 71 ఎకరం విస్తీర్ణం గల ప్రదేశంలో, 1814 నాటికి రెండు బంగళాలు, కొన్ని భవనములు, ఒక క్రైస్తవ ప్రార్థనా మందిరం (ఛాపెల్) ఉన్నదని

కిష్ణాజిల్లా మ్యాన్యువల్ చెబుతుంది. మచిలీపట్నం – ఫ్రెంచ్‌పేటలో నేటి జిల్లా పోలీసు ఆఫీసు తూర్పుగేటుకు ఎదురుగా, ముర్గుకాల్వ నానుకొని ఉన్న ప్రదేశంలో ఆనాడు పోర్చుగల్ మతాచార్యుడు 'డామ్ గాబ్రియేలు-డి-సాంక్టామారియా' కాథలిక్ చర్చి నొకదాన్ని నిర్మించాడు. చర్చికున్న స్థలం నానుకొని ఆనాడున్న ఖాళీ స్థలాన్ని ఫ్రెంచ్ పెద్దాయననొకరు చర్చి నిమిత్తం వ్రాసిచ్చాడు. ఆనాడీ చర్చిని 'సెయింట్ క్యాథరిన్ లేక గయితా' అని పిలిచేవారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌సియం చర్చి ప్రదేశంలో ఈ పెంకుటింటి చర్చి భవనం ఉండేది. 1864 ఉప్పెనలో పడిపోగా, 1868 మరొక భవనం నిర్మించారు. దరిమిలా కాలంలో చర్చి యాజమాన్యం పెంకుటిల్లు నిర్మూలించి పక్కా ఆర్‌సిసి కట్టడపు చర్చిని నిర్మించింది. పూర్వపు ఆర్‌సియం చర్చికి అనుబంధంగా ఒక క్రైస్తవ శ్మశానం కూడా ఉండేది. కొత్త భవనం నిర్మించేముందు శ్మశానంలోని సమాధులు తొలగించి నూతన భవనం నిర్మించారు.

**సెయింట్ మేరీస్ (ఇంగ్లీష్) చర్చ్ – మాచవరం:**

"మేజర్ జనరల్ పాటర్ ఆమెను (అరబెల్లా రాబిన్‌సన్, 1809, నవంబరు 6వ తేదీన మరణించినది) ఒక పొలంలో ఖననము చేసి ఆమె (సమాధి) మీద ఒక చర్చ్ నిర్మించి, 1816లో ఈ చర్చిని గౌరవనీయ కంపెనీ (ఈస్ట్ ఇండియా కంపెనీ)కు బహూకరించెను. కంపెనీ వారు సదరు చర్చ్‌ను బహుమతిగా అందుకున్నట్లు ఒక లేఖ (పాటర్‌కు) వ్రాసి, లేఖలో 'గొప్ప దాతృత్వముతో కూడిన బహుమతి' అని ప్రశంసించెను". (లిస్ట్ ఆఫ్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆన్ టూంబ్స్ & మాన్యుమెంట్స్.... వాల్యూం-1-పేజీ 136).



**బందరు ఇంగ్లీషు చర్చ్ – అరబెల్లా ప్రేమ సమాధి:**

సెయింట్ మేరీ చర్చి ప్రారంభించిన కాలములో రెవరెండ్ ఇ.పి. లెవీస్; ఎం.ఎ. చాప్లిన్; మరియు కలెక్టరు 'గ్రాంటు' సభ్యులుగా దాని బాగోగులు చూచేవారు. సెయింట్ మేరీస్ చర్చి ప్రస్తావన వచ్చింది కనుక, జనరల్ పాటర్ గురించి, మరియు అతని ప్రేమిక 'అరబెల్లా రాబిన్‌సన్' గురించి కూడా మనం ఇక్కడ ముచ్చటించు కోవలసి ఉంటుంది. సెయింట్ మేరీస్ చర్చిలో కట్టడము లోపల 'అరబెల్లా రాబిన్‌సన్ మరణం 6-11-1809. కంపెనీ మిలటరీ సర్వీసులోని కెప్టెన్ రాబిన్‌సన్ కుమార్తె అరబెల్లా రాబిన్‌సన్, 40 సంIIలు. ఆమెకు ఎప్పటికీ ప్రేమాస్పదుడైన గొప్ప స్నేహితుడు, మేజర్ జనరల్ జాన్ పాటర్‌చే ఈ జ్ఞాపకార్థ కట్టడము చర్చిగా నిర్మించ బడినది' అని శిలాఫలకము చెప్పుచున్నది. (మద్రాసు) ప్రెసిడెన్సీలోని సమాధులు, చారిత్రాత్మక కట్టడముల పట్టిక, (రివైజ్డ్ ఎడిషన్ – వాల్యూం 2)లో ఇవ్వబడిన క్రమసంఖ్య 1842 అరబెల్లా సమాధి వివరములు ఈ విధంగా ఉన్నవి. 'జనరల్ పాటర్ అరబెల్లా సమాధి మీద ఒక చర్చిని నిర్మించెను. 1816లో (పాటర్) ఈ చర్చిని ఇంగ్లీషు కంపెనీకు బహూకరించెను. లెఫ్టెనెంట్ జార్జి బౌన్‌నెస్, మిస్ హరియత్ రాబిన్‌సన్‌ను ఆగష్టు 14, 1789లో మసులీపట్నంలో వివాహమాడెను". జార్జి బౌన్‌నెస్ రాబిన్‌సన్, అరబెల్లాకు తండ్రి, హరియత్‌కు భర్త అయి ఉన్నాడు.

**అరబెల్లా – పాటర్ చరిత్ర:**

క్రైస్తవం నిలదొక్కుకుంటున్న 18వ శతాబ్దంలో సివిల్ అధికారులుగా, సైనికాధికారులుగా, సైనికులుగా, వర్తకులుగా, సేవకులుగా పలువురు యూరోపియనులు, ముఖ్యంగా ఇంగ్లీషు వారు మచిలీపట్నం వచ్చారు. 1800 ప్రాంతంలో ఇంగ్లండ్ నుండి సైనికాధికారి కెప్టెన్ రాబిన్‌సన్, అతని భార్య హరియత్, అతని కుమార్తె 'అరబెల్లా రాబిన్‌సన్' మచిలీపట్నంలో నివసించారు. మచిలీపట్నం సైనిక కేంద్రానికి మేజర్ జనరల్ పాటర్ సేనాధిపతి. ఒక మిలట్రీ కార్యక్రమంలో తల్లిదండ్రులతో వచ్చిన అరబెల్లాను, పాటర్ చూచాడు. అరబెల్లా సౌందర్యం, వయసులోనూ, హోదాలోనూ ఉన్న పాటర్‌ను ఆకర్షించింది. ఇద్దరూ ఒకరికొకరు ఇష్టపడి ప్రేమించుకున్నారు. ఒకరినొకరు విడిచి ఉండలేని స్థితిలో, అరబెల్లా తండ్రి కెప్టెన్ రాబిన్‌సన్, మరియు క్రైస్తవ స్థానిక మతాధిపతులు వారి వివాహం జరక్కుండా అడ్డుపడ్డారు. ఎవరు ఎన్ని అడ్డంకులు కలిగించినా, పాటర్ అత్యున్నత సైనికాధికారి అవటం వలన వారినెవరూ విడదీయలేక పోయారు. వారిద్దరూ వివాహం చేసుకోకపోయినా, కలిసి భార్యాభర్తల్లా సహజీవనం (కాపురం) చేశారు. బందరు ప్రాంతంలో జరిగిన ఆంగ్ల సిపాయీల అంత:కలహాలతో, బ్రిటన్ రాజుకు ఆగ్రహం కల్గి సైనికాధికార్లయిన కొందరి ప్రమోషన్లు ఆపటం జరిగింది. అలా ప్రమోషన్ కోల్పోయిన కెప్టెన్ రాబిన్‌సన్ (అరబెల్లా తండ్రి) తనకు సీనియారిటీ ప్రకారం రావల్సిన ప్రమోషన్‌కు, జనరల్ పాటర్ అడ్డుపడ్డాడని భావించి పాటర్ మీద కోపం, తన కుమార్తె అరబెల్లా మీద తీర్చుకున్నాడు. మతాధిపతులతో మాట్లాడి వారి వివాహానికి 'నసేమిరా' కుదరదనిపించాడు. 'తమకు వివాహం జరగలేదు' అనే బాధతో అరబెల్లా రోజురోజుకూ కృంగి కృశించి జబ్బుపడి, చివరకు 06-11-1809న తన ప్రియుడు పాటర్ చేతుల్లో తుది శ్వాస తీసింది.

**–మహమ్మద్ సిలార్**
మెంబర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946

# మంచుకొండల్లో మహాప్రళయం...!!

# @ నేపాల్ విలయం

ప్రస్తుత తరాల అవసరాలకు, వనరులను బాధ్యాతాయుతంగా వినియోగిస్తూ, భవిష్యత్ తరాల యొక్క అవసరాలను కూడా, తీర్చగలిగే అభివృద్ధి **"సుస్థిరాభివృద్ధి" లేదా 'కొనసాగించగల అభివృద్ధి"** అంటారని 1983లో యూఎన్ఓ నియమించిన బ్రట్‌లాంట్ కమీషన్ తెలిపింది. కానీ ప్రస్తుత తరం మానవాళి, మా అవసరాలు తీరితే చాలు అన్న స్వార్థపూరిత ఆలోచనతో వనరులను కబలించడం వల్లే కనీవినీ ఎరుగని విపత్తులు సంభవిస్తున్నాయని, గత ఆగస్టు 26న సంభవించిన నేపాల్ విధ్వంసక వరదలు అందుకు కొనసాగింపేనని పర్యావరణవేత్తలు అంటున్నారు. నేపాల్ విపత్తు గురించి మనమూ తెలుసుకుందాం.

**ఏం జరిగింది..?**

నేపాల్-చైనా(టిబెట్) సరిహద్దు సమీపంలోని లాంగ్‌టాంగ్ (Lang Tang) హిమాలయాల ప్రాంతంలో చుట్టూ అనేక హిమానీనదాలు, నిటారుగా ఉండే ఎత్తైన రాతిముఖ భాగాలు మరియు పలుశిఖరాలను కలిగి, సముద్ర మట్టం నుండి 5200 నుండి 5400 మీ॥ ఎత్తులో ఉన్న **"లాంగ్‌టాంగ్ లిరుంగ్ మాస్టిఫ్"** అనే శిఖరం యొక్క ఉత్తర ముఖభాగం వద్ద ఉన్న భారీ కొండరాళ్ళు మరియు హ్యాంగింగ్ గ్లేసియర్స్ గురుత్వాకర్షణశక్తి కారణంగా లేదా అంతర్గత బలహీనత వల్ల ఒక్కసారిగా విరిగి, సుమారు 1200 మీ॥ దిగువకు, నిలువుగా పడిపోయాయి.




ఈ భారీ మంచు, రాళ్ళు ఒక్కసారిగా కిందపడడంతో తీవ్రమైన ఘర్షణ మరియు వేగంవల్ల అదికాస్తా ద్రవీభవించిన అవక్షేపమై (Liquified Sediment) బురద పెద్దబండరాళ్ళతో కూడిన భారీ ప్రవాహంగా మారింది. ఈ శిథిలాలన్నీ టిబెట్ సరిహద్దులోని "లెండెఖోలా" అనే చిన్న నదిలోకి వచ్చిపడి, ఆ నది ప్రవాహానికి అడ్డుగా ఒక ఆనకట్టలాగా ఏర్పడ్డాయి.

తరువాత ఆనకట్ట తెగి లెండెఖోలా నుండి బోటే కోషి నదిలోకి, అక్కడి నుండి వరుసగా త్రిశూలి, నారాయణి నదులలోకి గంటకు 190 కి.మీ. వేగంతో నీరంతా దిగువకు ప్రవహించింది. ఈ రాకాసి వరదల ధాటికి 1300 పై చిలుకు మంది ప్రాణాలు పోగా 4000 మంది ఆచూకీ లేకుండా పోయారు. 475 మె.వా. విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోయి, కోట్లలో నష్టం వాటిల్లింది.

**I) హిమాలయ ప్రాంతంలో ఎందుకు ఇలాంటి పెను విపత్తులు సంభవిస్తున్నాయి..!!**

**i) భూగర్భ మరియు టెక్టానిక్ పలకల పెళుసుదనం:**

హిమాలయాలు ఇండియా మరియు యురేషియన్ ఫలకాలు నిరంతరం ఢీకొనడం ద్వారా ఏర్పడిన నవీన మరియు భూకంప పరంగా చురుకైన ముడుత పర్వతాలు. ఇలా ఫలకాలు ఢీకొనడం వల్ల హిమాలయాల భూ గర్భంలో అపారమైన పీడనం ఏర్పడుతుంది. దీని వల్ల హిమాలయాల ఉన్నత ప్రాంతాలలో మెయిన్ సెంట్రల్ థ్రస్ట్, హిమాలయాల మధ్యభాగంలో, సరిహద్దుల్లో మెయిన్ బౌండరీ థ్రస్ట్ అనీ, హిమాలయాల దక్షిణ అంచున, ఇండోగంగా మైదానాన్ని తాకే ప్రాంతంలో హిమాలయ ఫ్రంటల్ థ్రస్ట్ అనే క్రియాశీలక భౌగోళిక పగుళ్ళు ఏర్పడి భూకంపాల ముప్పుకు ప్రధాన కారణమౌతున్నాయి.

2015 గోర్ఖా భూకంపం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

**ii) వాతావరణ మార్పు మరియు శీతల ధృవాలలో అస్థిరత్వం:**

వాతావరణ మార్పు, హిమాయాల క్రయోస్ఫియర్ (హిమానీ నదాలు, మంచు పొరలు)లో అస్థిరతను తీసుకొస్తోంది.

**iii) ఎత్తుపై ఆధారపడిన ఉష్ణోగ్రత పెరుగుదల:**

ఎత్తైన ప్రాంతాల్లో ఉష్ణోగ్రత పెరగడం వల్ల మంచు కరిగిపోతుంది. తెల్లని మంచు సూర్యరశ్మిని పరావర్తనం చెందిస్తుంది. దీనినే **స్నో-ఆల్బిడో ఫీడ్‌బ్యాక్** అంటారు. కానీ మంచు కరిగిన తరువాత బయటపడే నేల సూర్యరశ్మిని అధికంగా గ్రహించి ఉష్ణోగ్రతను మరింత పెంచుతాయి. దీనివల్ల Snow-Albedo feed-back తగ్గిపోతుంది.

కాలుష్యం వల్ల గాలి ద్వారా కొండ ప్రాంతాలకు చేరే కార్బన్ మరియు ధూళికణాలు మంచుపై పేరుకుపోయి సూర్యరశ్మిని గ్రహించే శక్తిని పెంచి, మంచు త్వరగా కరిగేలా చేస్తాయి. హిమాలయాల ప్రాంతంలో ఈ EDW ప్రభావం వల్ల గ్లేసియర్లు అత్యంత వేగంగా కరిగి, గ్లేసియల్ సరస్సులు ప్రమాదకర స్థాయికి చేరి Glof (Glacial lake out burst flood) (గ్లాఫ్) లాంటి తీవ్ర విపత్తులు సంభవించే ముప్పు పెరుగుతుంది. 2023 సిక్కింలో

దక్షిణ లోనాక్ సరస్సు విపత్తు, 2021 ఛమేలీ విపత్తు ఇందుకు ఉదాహరణలు.

**iv) జలసంబంధిత తీవ్ర వితపత్తులు:**

వర్షపాత సరళిలో మార్పులు మేఘ విస్ఫోటనాలతో సహా తీవ్రమైన స్థానిక వర్షపాత సంఘటనలు సంభవించే అవకాశాన్ని పెంచుతాయి. హిమాలయ పర్వతాలలోని నిటారు వాలులు, తీవ్రమైన వర్షపాతం కారణంగా వేగవంతమైన నీటి ప్రవాహం మరియు అత్యధిక వేగంతో కూడిన ఆకస్మిక వరదలు రావడానికి కారణమౌతాయి. ఈ వరదనీరు వదులుగా ఉన్న మట్టి, రాళ్ళు మరియు నిర్మాణ శిథిలాలతో కలసి పెను విధ్వంసకరంగా మారుతుంది. 2013 కేదర్‌నాథ్ విపత్తు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

**II) మానవ సంబంధ కారకాలు:**

**i) అస్థిరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి:**

రోడ్లు, సొరంగాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, భవనాలు మరియు పర్యాటక సౌకర్యాల వేగవంతమైన నిర్మాణం సున్నితమైన పర్వత వ్యవస్థలపై ఒత్తిడిని పెంచుతుంది. మౌళిక సదుపాయాల విస్తరణలో భాగంగా కొండలకు చేసే అశాస్త్రీయ నిలువు, వాలు కోతలు సహజ ఆధారాన్ని తొలగించి, కొండ చరియలు విరిగి పడే అవకాశాన్ని పెంచుతుంది. అందువల్ల మౌళిక సదుపాయాల ప్రణాళికలో నిర్మాణానికి ముందు వివరణాత్మక భూగర్భ, జల సంబంధిత మరియు వాలు స్థిరత్వ అంచనాలు చేర్చాలి. చార్‌ధామ్ రహదారి అభివృద్ధి పథకం – దాని ఫలితాలు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.



నేపాల్ వరదలు – ప్రతీకాత్మక చిత్రం

**ii) జల విద్యుత్ మరియు సొరంగ సంబంధిత ప్రమాదాలు:**

ప్రాంతీయ అభివృద్ధికి మరియు శక్తి భద్రతకు జలవిద్యుత్ ముఖ్యమైనదే అయినప్పటికీ సొరంగాల తవ్వకం మరియు పేలుళ్ల భౌగోళిక నిర్మాణాలకు, భూగర్భ జలమార్గాలకు అంతరాయం కలిగించగలవు. భూగర్భ పొరుదల వ్యవస్థలో మార్పులు, రంధ్రపు నీటి పీడనం (Pore water pressure), భూగర్భజల లభ్యత మరియు వాలు స్థిరత్వాన్ని ప్రభావితం చేయగలవు. జోషిమఠ్ ప్రాంతంలో భూమి కుంగిపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అందువల్ల జలవిద్యుత్ అభివృద్ధి కేవలం విడి విడి ప్రాజెక్ట్ స్థాయి మూల్యాంకనాలపై ఆధారపడకుండా బేసిన్ స్థాయి సంచిత అంచనా (Basin Level cumulative Assessment)ను చేర్చాలి.

**III) పరిపాలనా మరియు నియంత్రణా లోపాలు:**

**i) ప్రాజెక్ట్‌వారీ పర్యావరణ అంచనా:**

సాంప్రదాయ పర్యావరణ ప్రభావ అంచనా ఒకే ప్రాంతంలోని బహుళ రహదారులు, సొరంగాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, నివాస ప్రాంతాలు మరియు పర్యాటక సౌకర్యాల సంచిత ప్రభావాలను గుర్తించడంలో విఫలం కావచ్చు. అలాకాకుండా వ్యూహాత్మక పర్యావరణ మదింపు మరియు భూభాగ స్థాయి సంచిత ప్రభావ మదింపు అనేవి వాలు ప్రాంతాలు, నదులు, ఆవాసాలు మరియు సమాజంపై కలిగి సంయుక్త ప్రభావాల గురించి విస్తృత అవగాహనను అందించగలవు.

**ii) బలహీనమైన భూ వినియోగ మరియు వరదమైదాన నియంత్రణ:**

ఎక్కువగా మైదానాలు, నదీ తీర ప్రాంతాలు మరియు సహజ నీటి పారుదల కాలువలపై నిర్మాణం చేపట్టడం వల్ల ఆకస్మిక వరదలు మరియు శిథిల ప్రవాహాల ముప్పు పెరుగుతుంది. పట్టణాల విస్తరణ సహజ వరద నిల్వ ప్రాంతాలను అధిక ప్రమాదం గల నివాస ప్రాంతాలుగా మార్చగలదు.

సమర్థవంతమైన భూ వినియోగ ప్రణాళికలో ప్రమాద మండలాల విభజన, వరద మైదానాల మ్యాపింగ్ మరియు పరిమిత అభివృద్ధి మండలాలను చేర్చాలి. విపత్తు ప్రమాదాన్ని కేవలం విపత్తు సంభవించిన తర్వాత మాత్రమే పరిష్కరించే సమస్యగా కాకుండా, ఒక ప్రాథమిక ప్రణాళికా అంశంగా పరిగణించాలి.

**IV) హిమాలయ ప్రాంత విపత్తులను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలు:**

**i) పర్యావరణం భరించగలిగే సామర్థ్యం మరియు సంబంధిత అంచనా:**

ప్రధాన మౌళిక సదుపాయాల ప్రాజెక్టులు అన్నింటికీ భరించగలిగే సామర్థ్యం మదింపు సంచిత ప్రభావ మదింపు మరియు సవివరమైన భూగర్భ పరిశోధనలను నిర్వహించాలి.

ఏదైనా ఒక ప్రాజెక్ట్ ప్రభావాన్ని ఒక నిర్దిష్ట ప్రాంతానికి పరిమితం చేయకుండా – ఆ ప్రాంతం యొక్క మొత్తం భౌగోళిక స్వరూపం, నదీ పరీవాహక ప్రాంతం యొక్క సమగ్ర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక రూపొందించాలి. చురుకైన వరద మైదానాలు, అస్థిరమైన వాలు ప్రాంతాలు మరియు పర్యావరణ సున్నిత ప్రాంతాలలో కఠినమైన నిర్మాణ నియంత్రణలు విధించాలి.

**ii) నీటి ఊటల నిర్వహణ మరియు నీటి భద్రత:**

హిమాలయ ప్రాంత ప్రజలకు నీటి ఊటలు ముఖ్యమైన నీటి వనరులు కాబట్టి, ఊటల పరీవాహక ప్రాంతాల నిర్వహణను విస్తరించాలి. ఊటలలో నీరు రీఛార్జ్ అయ్యే ప్రాంతాలను హైడ్రోలాజికల్ మ్యాపింగ్ ద్వారా గుర్తించి భూగర్భ జలమార్గాలకు అంతరాయం కలిగించే కార్యకలాపాలను నివారించాలి.

**iii) ప్రకృతి ఆధారితవాలు స్థిరీకరణ:**

హిమాలయ ప్రాంతాల వాలుల నిర్వహణలో సాంకేతికంగా

వీలైన ప్రతిచోటా సాంప్రదాయ ఇంజనీరింగ్‌ను ప్రకృతి ఆధారిత పరిష్కారాలతో మిళితం చేయాలి. వృక్ష సంపద ఆధారిత స్థిరీకరణ, బయో ఇంజనీరింగ్, నేలకోతను నియంత్రించడం, నీటిపారుదల నిర్వహణ, విపత్తులను తట్టుకొని నిలిచి ఉండే విధంగా రూపొందించిన నిలుపుదల నిర్మాణాలు (Retaining Structures) పర్యావరణ విపత్తులను తగ్గించగలవు.

**iv) ఆధునిక బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు:**

హిమాలయ ప్రాంతాలలో విపత్తులు సక్రమరీతిలో నిర్వహించేందుకు గానూ వర్షపాతం, నదీ ప్రవాహం, హిమానీనద ప్రవర్తన మరియు వాలు కదలికలను పర్యవేక్షించగల సమగ్ర బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరికలు అవసరం.




ఉపగ్రహ ఆధారిత ఇంటర్ ఫెరోమెట్రిక్ సింథటిక్ అపెర్చర్ రాడార్, స్వయంచాలిత వాతావరణ కేంద్రాలు, డాప్లర్ ఆధారిత వాతావరణ రాడార్లు, నదీ మట్ట సెన్సార్లు మరియు ఉపగ్రహ టెలీమెట్రీ వంటివి సమయ పర్యవేక్షణను మెరుగుపరుస్తాయి. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, చివరి అంచె సంభావ్య వ్యవస్థ, తరలింపు మార్గాలు మరియు సమాజ సంసిద్ధతతో అనుసంధానించబడి ఉండాలి.

**v) నష్టభయ ఆధారిత సున్నిత పర్వత పర్యాటకం:**

హిమాలయ ప్రాంతాలలో పర్యాటకం అధిక జన సాంద్రత మరియు అనియంత్రిత విస్తరణ పరిస్థితుల నుండి నియంత్రిత, తక్కువ నష్ట ప్రభావాన్ని చూపే సున్నిత పర్యాటకం వైపు మారాలి. పర్యాటక భరించే సామర్థ్యం, వ్యర్థాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు అత్యవసర ప్రతిస్పందన మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా ప్రణాళికలను రూపొందించాలి.

**vi) వాతావరణ మార్పులను తట్టుకోగలిగే అభివృద్ధి:**

వాతావరణ మార్పులకు అనుగుణంగా మారడం మరియు విపత్తుల ప్రమాదాన్ని తగ్గించడం లాంటి అంశాలను మౌలిక సదుపాయాలు, పట్టణ ప్రణాళిక, నీటి నిర్వహణ మరియు పర్యాటక విధానాలతో అనుసంధానించాలి. అలాగని హిమాలయ ప్రాంతాలలో అభివృద్ధిని ఆపకూడదు. కానీ ఆ అభివృద్ధి భౌగోళిక పర్యావరణ, జలసంబంధ మరియు హిమగోళ పరిమితులకు అనుకూలంగా ఉండేలా చూడటమే లక్ష్యం కావాలి.

**vii) హిమాలయ ప్రాంతాల సహకారం:**

హిమానీ నదాలు, నదీ పరివాహక ప్రాంతాలు, పర్యావరణ వ్యవస్థలు మరియు వాతావరణ ప్రక్రియలు సరిహద్దులకు అతీతంగా ఉంటాయి. కాబట్టి ఇండియా, చైనా, నేపాల్, భూటాన్ తదితర హిమాలయ దేశాలు హిమానీ నద పర్యవేక్షణ, భూకంప సంసిద్ధత, కొండ చరియల మ్యాపింగ్, జల సంబంధ అంచనా మరియు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలలో వీలైనంత ఎక్కువగా సహకారాన్ని పెంపొందించుకోవాలి. అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు బేషరతుగా నేపాల్ లాంటి చిన్న దేశాలకు సాంకేతిక సహకారాన్ని అందించాలి.

**VI) హిమాలయ ప్రాంతాల విపత్తులను తగ్గించే విధంగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు:**

**జాతీయ Glof ప్రమాద నివారణ కార్యక్రమం:**

2024లో కేంద్ర ప్రభుత్వం అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం మరియు ఉత్తరాఖండ్ రాష్ట్రాల కోసం 150 కోట్ల రూపాయల ఆర్థిక వ్యయంతో జాతీయ హిమానీ నద సరస్సు విస్ఫోటన వరద ప్రమాద నివారణ ప్రాజెక్టును ఆమోదించింది. గ్లాఫ్ సంబంధిత వరదల ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. దీనిని NDMA అమలు చేస్తుంది.

**హిమానీ నద సరస్సు పర్యవేక్షణ:**

కేంద్ర జలసంఘం హిమాలయ నదీ పరివాహక ప్రాంతాలలో 902 హిమానీనద సరస్సులు మరియు 10 హెక్టార్ల కంటే పెద్దవైన జలవనరులను రిమోట్ సెన్సింగ్ పద్ధతులను ఉపయోగించి పర్యవేక్షిస్తోంది. ఎందుకంటే GLOF ఆధారిత ప్రమాదాలు, సరస్సు పరిమాణంపై మాత్రమే కాకుండా ఆనకట్ట స్థిరత్వం, ఎగువ ప్రేరకాలు, దిగువ ప్రవాహ ప్రభావ ప్రభావం మరియు ఒకదానితో మరొకటి కలిసి సంభవించే ప్రమాద మార్గాలపై కూడా ఆధారపడి ఉంటుంది. 2025 నుండి మొత్తం 2843 హిమానీ నద సరస్సులు మరియు జలవనరులకు పర్యవేక్షణను విస్తరించారు.

**చివరగా:** అభివృద్ధి పేరుతో ప్రకృతిని విస్మరిస్తే జరగబోయే పరిణామాలు ఎలా ఉంటాయో నేపాల్ ప్రళయం మరోసారి కళ్ళకు కట్టినట్టుగా చూపింది. "సమస్త భూ మండలంలో ఉన్న చరాచరజీవులలో మానవుడు కూడా ఒక భాగం మాత్రమే తప్ప, మానవుడు భూమికి యజమాని ఎంత మాత్రం కాదు, కానేరడు. ఈ భూమిపై ఉన్న జీవజాలాన్ని (Web of life) మానవుడు అల్లలేదు. అతను కూడా అందులో కేవలం ఒక పాయ మాత్రమే. ఆ జాలానికి అతడు చేసే ప్రతిహాని, అది తనకు తానుగా చేసుకునే హానే" అన్న అమెరికా ఆదివాసి తెగ నాయకుడు **చీఫ్ సియాటెల్** మాటలు చెవిదల దాల్చి ప్రాంతాలకతీతంగా ఎకో ఫ్రెండ్లీ విధానాలను అనుసరించాలి. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా విధానపర సంస్కరణలు చేపట్టి ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**–పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం కడప,
m : 9550290047
e : obu.jmd@gmail.com





# మంజీరాను అర్థం చేసుకోవడమే నదీ పరిరక్షణకు తొలి అడుగు

ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (ఎఫ్‌బీహెచ్) ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, నదీ పరిరక్షణ ఆసక్తిపరులు మంజీరా నదిపై ఉన్న సింగూరు డ్యామ్ ప్రాజెక్టును సందర్శించారు. ఆయాకట్, నీటి సరఫరా వ్యవస్థ, నదితో ముడిపడిన ప్రాంత చరిత్రను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.




"ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్, ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ, "నది కేవలం నీటి ప్రవాహం కాదు. తాగునీరు, సాగు, గ్రామాల జీవనం, భూగర్భ జలాలు, ప్రకృతి, చరిత్ర అన్నీ దానితో ముడిపడి ఉన్నాయి. మంజీరా నీటిని ఎలా నిల్వ చేస్తున్నాం, ఎవరికి ఎలా అందిస్తున్నాం, నదిపై నిర్మించిన ప్రాజెక్టులు ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయి అనే విషయాలను తెలిపారు. నదిని అర్థం చేసుకోవడమే దాని పరిరక్షణకు తొలి అడుగు" అని అన్నారు.

గత ఏడాది ఘనపూర్ ఆనికట్ ప్రాంతాన్ని సందర్శించామని, ఈ ఏడాది సింగూరు డ్యామ్ ప్రాజెక్టును ఎంచుకున్నామని ఆయన హైదరాబాద్ జనాభా పెరిగిన క్రమంలో మంజీరా నీరు నగర తాగునీటి సరఫరాలో కీలకంగా మారిందన్నారు, ఏడుపాయల ప్రాంతంలోని నదీ ప్రవాహం, ప్రకృతి దృశ్యాలు, చారిత్రక నిర్మాణాలను కూడా విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు.

**ప్రపంచ నదుల దినోత్సవ సందేశం:** "ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ సుమారు ఆరేళ్లుగా ప్రపంచ నదుల దినోత్సవ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వరల్డ్ రివర్స్ డే చైర్ మార్క్ ఏంజెలో ఇమెయిల్ ద్వారా ప్రొఫెసర్ వేదకుమార్ కు శుభాకాంక్షలు పంపి, ఫోరం చేస్తున్న కృషిని అభినందించారని చెప్పారు. వందకు పైగా దేశాల్లో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని పేర్కొన్నారు."

సింగూరు ప్రాజెక్టు ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసుధన్ ప్రాజెక్టు నిర్మాణం, జలాశయ సామర్థ్యం, హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా, ఘనపూర్ ఆయకట్టుకు సాగునీటి విడుదల, విద్యుత్ ఉత్పత్తి గురించి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం 1976లో ప్రారంభమై 1989లో పూర్తయిందని, జలాశయం నిల్వ సామర్థ్యం సుమారు 29.9 టీఎంసీలని తెలిపారు. వర్షపాతం, నీటి నిల్వ, తాగునీరు, సాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని నీటిని విడుదల చేస్తామని చెప్పారు.

సందర్శనలో పాల్గొన్నవారు ఆనకట్ట నిర్మాణాన్ని, బహిరంగ రాష్ట్ర పురావస్తు శాఖ ప్రదర్శనలోని వీరగల్లులు, శిల్పాలను తిలకించారు. మా వంతు కృషిగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఈ ఓపెన్ మ్యూజియంను మైంటైన్ చేసే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను ఇంజనీర్ నాగేంద్ర తెలిపారు. సందర్శనకు సహకరించిన అధికారులకు వేదకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జునరావుకు, సింగూరు డ్యామ్ డిప్యూటీ ఈ ఈ మధుసూదన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఫోరం సభ్యులు వేణుగోపాల్, సుభాష్ రెడ్డి, రామరాజ్, కట్టా ప్రభాకర్, జేబీఆర్ గ్రూపు సంస్థల అధ్యాపకులు మౌనిక యాదవ్, గంగారాం సింగ్, సుధీర్ కుమార్, హరినాథ్, విద్యార్థులు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రతినిధులు, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, నదీ పరిరక్షణ ఆసక్తిపరులు పాల్గొన్నారు.

**–శోభా సింగ్**
కార్యదర్శి, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్
m : 8686664949

# పట్టణాల పునరుజ్జీవనం

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం, తన తీర్మానం 68/239 ద్వారా , ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీని ప్రపంచ నగరాల దినోత్సవంగా ప్రకటించింది. ఈ అంతర్జాతీయ దినోత్సవం, ప్రపంచ పట్టణీకరణపై అంతర్జాతీయ ఆసక్తిని బాగా ప్రోత్సహిస్తుందని, పట్టణీకరణలోని అవకాశాలు, సవాళ్లను పరిష్కరించడంలో దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా సుస్థిర పట్టణాభివృద్ధికి దోహదపడుతుందని ఆశిస్తున్నారు.



2014లో, ఐక్యరాజ్యసమితి మానవ నివాసాల కార్యక్రమం, ప్రపంచం ఎదుర్కొంటున్న పట్టణ సవాళ్లను ఎత్తిచూపడానికి, నూతన పట్టణ అజెండా అభివృద్ధిలో అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి "సిటీస్ అక్టోబర్" ప్రచారాన్ని ప్రారంభించింది. సుస్థిర పట్టణాభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న నిర్వహిస్తారు.

2026 వేడుకను చైనాలోని పుజౌ నగరంలో "నగర పునరుజ్జీవనం: అందరికీ తగిన గృహవసతి" అనే ఇతివృత్తం (థీమ్)తో నిర్వహించనున్నారు. 'నా నగరం – నా ఇల్లు' అనే ప్రచార అనుబంధంతో ఈ వేడుకను నిర్వహించనున్నారు. డిజిటల్ సాంకేతికతలు నివాసితుల అవసరాలను తీర్చాలని, అలాగే నూతన పట్టణ అజెండా మరియు 2030 అజెండాలను అమలు చేయడంలో సహాయపడాలని ఈ వేడుక ప్రత్యేకంగా తెలపుతుంది. వలసలను నివారించడానికి, సమ్మిళిత పరిసరాలను నిర్ధారించడానికి రక్షణ చర్యల మద్దతుతో, భాగస్వామ్య మరియు సమాజ నేతృత్వంలోని పట్టణ పునరుజ్జీవనం.

### ప్రపంచ గృహ సంక్షోభంపై దృష్టి:

2.8 బిలియన్ల మందికి సరైన గృహవసతి లేదు. 1.1 బిలియన్ల మంది అనధికారిక నివాసాలలో నివసిస్తున్నారు. 300 మిలియన్లకు పైగా ప్రజలు నిరాశ్రయులుగా ఉన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి, విస్తృత స్థాయిలో ప్రభావాన్ని సాధించడానికి డిజిటల్ సాధనాలను ఉపయోగించుకోవడం అవసరం. ఇది ఫ్యూచర్ కాంపాక్ట్, యూఎన్-హ్యాబిటాట్ యొక్క 2026–2029 వ్యూహాత్మక ప్రణాళిక యొక్క నిబద్ధతలకు దగ్గరగా ఉంటుంది.

దేశాల మధ్య స్మార్ట్ సిటీ పద్ధతులు, అనుభవాల మార్పిడిని ప్రోత్సహించడానికి ఈ వేడుకలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, వర్క్‌షాప్‌లు ఉంటాయి. ఆశించిన ఫలితాలలో ప్రజల-కేంద్రీకృత స్మార్ట్ సిటీలపై లోతైన అవగాహన, ఆవిష్కరణల ప్రోత్సాహం మరియు డిజిటల్ సాంకేతికతల అనువర్తనం, అలాగే గృహ లభ్యత మరియు సుస్థిర పట్టణీకరణను మెరుగుపరచడానికి విస్తృత సహకారం వంటివి ఉంటాయి.

పట్టణీకరణ అనేది మెరుగైన సమానత్వం, సేవలు మరియు కొత్త అవకాశాలను సులభంగా పొందడం, అలాగే పట్టణ, జాతీయ మరియు ప్రపంచ వైవిధ్యాన్ని ప్రతిబింబించే భాగస్వామ్యం, సామాజిక సమీకరణ వంటి కొత్త రూపాల్లో సామాజిక సమ్మిళితానికి అవకాశం కల్పిస్తుంది. అయితే, పట్టణాభివృద్ధి తరచుగా ఈ రూపాన్ని తీసుకోదు. అసమానత మరియు బహిష్కరణ ప్రబలంగా ఉన్నాయి, ఇవి తరచుగా జాతీయ సగటులను మించిపోతూ, అందరికీ ప్రయోజనం చేకూర్చే సుస్థిర అభివృద్ధిని దెబ్బతీస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితికి చెందిన 193 సభ్య దేశాలు నగరాలలో ప్రణాళిక, నిర్వహణ మరియు జీవన విధానాలను పునరాలోచించడం ద్వారా ప్రపంచాన్ని సుస్థిర పట్టణాభివృద్ధి వైపు నడిపించడమే కాకుండా, పట్టణీకరణ సవాళ్లను పరిష్కరించడానికి ఒక వేగాన్ని కూడా నిర్దేశిస్తుంది.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

# "ఐటి విప్లవంలో నాలెడ్జ్ వర్కర్లదే కీలక భూమిక"

The most valuable assets of a 20th-century company were its production equipment. The most valuable assets of a 21st-century institution, whether business or nonbusiness, will be its knowledge, workers, and their productivity.
*-Peter Drucker*

ఇరవై ఒకటో శతాబ్దం మానవ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన మార్పులకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ ఆటోమేషన్ వంటి సాంకేతిక విప్లవాలు సాంప్రదాయ పరిశ్రమల స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. వేగవంతంగా మారుతున్న ఈ ప్రపంచం (Fast Changing World)లో 'నాలెడ్జ్ వర్కర్' (Knowledge Worker) లేదా 'జ్ఞాన కార్మికుడు' అనే పదం ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది. ప్రముఖ మేనేజ్‌మెంట్ గురువుగా ప్రసిద్ధికెక్కిన పీటర్ డ్రక్కర్ 1959లో The Landmarks of Tomorrow గ్రంథంలో 'నాలెడ్జ్ వర్కర్' అనే పదాన్ని ప్రతిపాదించారు. కేవలం శారీరక శ్రమతో వస్తువులను ఉత్పత్తి చేసేవారిని శ్రామికులు (మాన్యువల్ వర్కర్లు)గా మనం పిలుస్తాం. ఇందుకు భిన్నంగా తమ మేధస్సు, ఆలోచనా శక్తి, విశ్లేషణ, సృజనాత్మకత మరియు జ్ఞానాన్ని పెట్టుబడిగా పెట్టి, సమాచారాన్ని సంపదగా మార్చే మేధోసంపన్నులను పీటర్ డ్రక్కర్ 'నాలెడ్జ్ వర్కర్లు'గా నిర్వచించారు. ప్రస్తుత కాలంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, పరిశోధకులు, వ్యూహాత్మక విశ్లేషకులు ఈ కోవకే చెందుతారు. ఇప్పుడు వీరి పాత్ర కేవలం ఒక ఉద్యోగానికి మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి సరైన దిశలో నడిపించే చోదక శక్తిగా అవతరించింది. ప్రపంచీకరణలో భాగంగా ధనం, పెట్టుబడులతో పాటు సమాచార విస్ఫోటనం (Information Explosion) జరుగుతున్న నేటి డిజిటల్ విప్లవంలో 'డేటా(Data)'నే అతిపెద్ద ఆస్తిగా మారింది. అయితే, కేవలం ముడి డేటా (Raw Data) ఉన్నంత మాత్రాన ఎటువంటి ఉపయోగం ఉండదు. ఆ డేటాను సరైన పద్ధతిలో క్రోడీకరించి, విశ్లేషించి, సంస్థల వృద్ధికి ఉపయోగపడేలా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో నాలెడ్జ్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకమైనది. AI మరియు ఆటోమేషన్ పుంజుకుంటున్న నేటి తరుణంలో, యంత్రాలు చేయలేని సృజనాత్మక, సంక్లిష్ట సమస్యల పరిష్కారాలను కనుగొనడం ద్వారా నాలెడ్జ్ వర్కర్లు భవిష్యత్తు ప్రపంచాన్ని శాసించబోతున్నారు.



ఉత్పాదకత, సేవారంగాల్లో తలెత్తే క్లిష్టమైన సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను కనుగొనడం కేవలం నాలెడ్జ్ వర్కర్స్‌కు మాత్రమే సాధ్యమవుతుంది. అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక, ఆర్థిక లేదా సామాజిక సవాళ్లకు సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, సరికొత్త ఆవిష్కరణల ద్వారా తక్షణ, శాశ్వత పరిష్కారాలను కనుగొనడంలో నాలెడ్జ్ వర్కర్లే అత్యంత కీలకమైన వనరుగా నిలుస్తున్నారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ సాంకేతికతలు మరింత అభివృద్ధి చెందడం వల్ల సాధారణ, ఒకేలా పునరావృతమయ్యే పనులన్నీ ఆటోమేట్ అవుతాయి. దీనివల్ల నాలెడ్జ్ వర్కర్ల పాత్రకు మరింత ప్రాధాన్యత సంతరించుకోనుంది. భవిష్యత్తులో కృత్రిమ మేధ పూర్తిగా నాలెడ్జ్ వర్కర్లను భర్తీ చేయలేదు. ఏఐ టూల్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోగల నాలెడ్జ్ వర్కర్, వాటిని ఉపయోగించని ఇతరుల కంటే ఎంతో ముందంజలో ఉంటాడు. నిరంతరాయంగా సాగే రోజువారీ సాధారణ పనులను ఏఐకి అప్పగించి, మానవ మేధస్సుకు మాత్రమే సాధ్యమయ్యే వ్యూహాత్మక ఆలోచనలు, నిర్ణయాత్మక కార్యాల్లో నాలెడ్జ్ వర్కర్లు కీలకం కానున్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, నేడు నేర్చుకున్న నైపుణ్యం మరో మూడేళ్లలో పనికిరాకుండా పోవచ్చు. అందువల్ల, నాలెడ్జ్ వర్కర్లు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ, కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం తప్పనిసరి. నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి నాలెడ్జ్ వర్కర్ల ప్రథమ కర్తవ్యం. వీటికి తోడు బహుముఖ ప్రజ్ఞ కూడా ఎంతో అవసరం. భవిష్యత్ కార్పొరేట్ ప్రపంచంలో కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా, రెండు

మూడు విభిన్న రంగాలపై పట్టు ఉన్న నాలెడ్జ్ వర్కర్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఉదాహరణకు వైద్య రంగంతో పాటు డేటా సైన్స్ తెలిసిన వారికి, ఫైనాన్స్‌తో పాటు సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉన్నవారికి సరికొత్త అవకాశాలు లభిస్తాయి. సాఫ్ట్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాల కలయికతో పాటు గ్లోబల్ కొలాబరేషన్ భవిష్యత్తు నాలెడ్జ్ వర్కర్లకు అత్యంత కీలకం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, మనుషుల మధ్య ఉండే పరస్పర అవగాహన, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలతో కూడిన నిర్ణయాలు కేవలం నాలెడ్జ్ వర్కర్లకే సాధ్యమవుతాయి.

వివిధ రంగాలలో నాలెడ్జ్ వర్కర్లు పోషించబోతున్న పాత్ర గురించి ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతోంది. సాంకేతిక విప్లవం మూలాన విద్యారంగంలో నాలెడ్జ్ వర్కర్ల పాత్ర గణనీయంగా మారుతోంది. గతంలో ప్రొఫెసర్లు కేవలం పాఠ్యపుస్తకాలలోని సమాచారాన్ని విద్యార్థులకు చేరవేసేవారు. నేడు ఇంటర్నెట్, గూగుల్, ఏఐ చాట్‌బాట్స్ వల్ల సమాచారం అందరికీ ఉచితంగా, వేగంగా అందుబాటులోకి వచ్చింది. భవిష్యత్తులో విద్యా రంగానికి చెందిన నాలెడ్జ్ వర్కర్లు కేవలం బోధకులుగా కాకుండా లెర్నింగ్ గైడ్స్ లేదా ఫెసిలిటేటర్స్‌గా రూపాంతరం చెందుతున్నారు. నెట్‌లో లభించే అపారమైన డేటాలో నిజానిజాలను (Deepfakes, Fake News) విశ్లేషించే విమర్శనాత్మక ఆలోచనా శైలిని (Critical Thinking) విద్యార్థులకు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. ప్రతి విద్యార్థి మానసిక సామర్థ్యం, ఆసక్తులకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన విద్యను (Personalized Learning) అందించేందుకు, ప్రత్యేక డిజిటల్ పాఠ్యాంశాలను డిజైన్ చేయడానికి ఉపాధ్యాయులు ఏఐ టూల్స్ సహాయం తీసుకుంటున్నారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సాధారణ పనులు డిజిటల్ యాప్స్, ఏఐ అల్గారిథమ్స్ ద్వారా వేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆర్థిక రంగ నాలెడ్జ్ వర్కర్ల పాత్ర సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఫైనాన్షియల్ అడ్వైజర్లుగా గ్లోబల్ ట్రెండ్స్, అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు, భౌగోళిక రాజకీయ పరిణామాల విశ్లేషణ, ఖాతాదారుల పెట్టుబడులకు రక్షణ కల్పించే నమ్మకమైన సలహాదారులుగా నాలెడ్జ్ వర్కర్లు వ్యవహరించనున్నారు. రిస్క్ అనలైజర్స్‌గా కార్పొరేట్ రుణాల వల్ల వచ్చే నష్టాలను, మార్కెట్ సంక్షోభాలను ముందే ఊహించి బ్యాంకులను అప్రమత్తం చేయడంలో ముఖ్యపాత్ర పోషించబోతున్నారు. నిమిషాల వ్యవధిలో జరిగే సైబర్ మోసాలను, మనీ లాండరింగ్ చర్యలను అధునాతన టెక్నాలజీ సహాయంతో అడ్డుకునే వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలను నాలెడ్జ్ వర్కర్లు నిర్మించగలుగుతారు.



విద్యా ఆర్థిక రంగాల తర్వాత ఎంతో ముఖ్యమైంది వైద్య ఆరోగ్య రంగం. గతంలో వైద్యం కేవలం రోగి చెప్పే లక్షణాలు, సాధారణ ల్యాబ్ రిపోర్టులపైనే ఆధారపడేది. ప్రస్తుతం సాంకేతికత పెరగడంతో హెల్త్‌కేర్ నాలెడ్జ్ వర్కర్లు, బయో-ఇన్ఫర్మేటిక్స్ నిపుణులు భవిష్యత్తు వైద్యులుగా కీలక పాత్ర పోషించబోతున్నారు. ఆరోగ్య విభాగంలో పర్సనలైజ్డ్ మెడిసిన్ (వ్యక్తిగత వైద్యం) అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రోగి డిఎన్ఏ (DNA) ప్రొఫైల్, జన్యు నిర్మాణం, జీవనశైలి డేటాను విశ్లేషించి, వారికి వంద శాతం సరిపోయే ప్రత్యేక చికిత్స అందిస్తారు. డేటా అనలిటిక్స్ సహాయంతో ఒక వ్యక్తికి భవిష్యత్తులో వచ్చే జబ్బులను ముందే ఊహించి, నివారణ మార్గాలను సూచించే ప్రిడిక్టివ్ హెల్త్‌కేర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో అత్యావశ్యకమైన టెక్నాలజీ-సస్టైనబిలిటీ రంగాల్లో నాలెడ్జ్ వర్కర్ల సేవలు విశిష్టమైనవిగా మారనున్నాయి.

సాధారణ కోడింగ్, వెబ్‌సైట్ డిజైనింగ్ పనులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ సులభంగా పూర్తి చేస్తున్నాయి. దీనివల్ల ఐటీ రంగంలో మార్పులు మొదలయ్యాయి. ఏఐ సిస్టమ్స్ నుండి ఖచ్చితమైన ఫలితాలను రాబట్టడానికి, సరైన ఇన్పుట్స్ (Prompts) ఇవ్వగల నైపుణ్యం ఉన్న ఏఐ ప్రాంప్ట్ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. మరోవైపు పర్యావరణ మార్పులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో.. పరిశ్రమలు, కంపెనీలు కాలుష్యం లేకుండా, తక్కువ కార్బన్ ఉద్గారాలతో లాభాలు గడించడానికి సలహాలు ఇచ్చే 'సస్టైనబిలిటీ కన్సల్టెంట్స్' అవసరం మున్ముందు కీలకం కానుంది. మార్పులు ప్రపంచ నియమం. వేగంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచాన్ని చూసి భయపడాల్సిన పనిలేదు. నిరంతరం అప్‌గ్రేడ్ అవ్వడమే యువత కర్తవ్యం. కేవలం సమాచారాన్ని మనసులో నిక్షిప్తం చేసుకోవడమే కాకుండా, ఆ సమాచారాన్ని సరికొత్త సాంకేతికతతో ముడిపెట్టి మానవాళి శ్రేయస్సుకు, సామాజిక-ఆర్థిక ప్రగతికి ఉపయోగించగలిగేది నాలెడ్జ్ వర్కర్లే. రానున్నరోజుల్లో ప్రపంచాన్ని నడిపించే అత్యంత విలువైన మానవ వనరుగా నాలెడ్జ్ వర్కర్లు రూపాంతరం చెందనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుపై నిశిత దృష్టి సారించాల్సి ఉంటుంది. భవిష్యత్ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థికి పటిష్టమైన అకడమిక్ ఫౌండేషన్ అందించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉంది.

–ప్రొఫెసర్ బెల్లి యాదయ్య
m : 9848392690
e: dr.bellipoet@gmail.com

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు





**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850





పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ** (Regd. 720/1982)
హైదరాబాద్

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 28th - September 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

# VOL 15వ వసంతంలో 170 ISSUES నూట డెబ్బైవ సంచిక పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



## దక్కన్ ల్యాండ్ పదనాల్గు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 అక్టోబర్ సంచికతో 170 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400–లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).







Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana, Ph : 90599 50055

**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక
వార్షిక చందా : రూ. 300/-

ఒక సంవత్సరం బైండింగ్
పుస్తకం : రూ. 400/-

TELANGANA RESOURCE CENTRE

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar